# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 4 జూలై 2025 | సంపుటి: 9 | సంచిక: 187 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## శుభమ్మాన్ డబు(గి)ల్




12

# ప్రాణాలు తీస్తున్న లే ఆఫ్‌లు



ఐటీ రంగంలో 6 నెలల్లో లక్ష మంది ఉద్యోగాలు ఊస్ట్

ఉద్యోగులను తీవ్రంగా కుంగదీస్తున్న తొలగింపులు

నాలుగు సార్లు ఉద్యోగులను తొలగించిన మైక్రోసాఫ్ట్






## ప్రధాని మోడీకి 'ఘనా' అత్యున్నత అవార్డు

'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'ను స్వయంగా మోడీ మెడలో అలంకరించిన ఆ దేశాధ్యక్షుడు మహామా

అక్రా, జూలై 3: పశ్చిమాఫ్రికా దేశమైన ఘనా తన అత్యున్నత పురస్కారంతో ప్రధాని మోడీని గౌరవించింది. రెండురోజుల పర్యటన కోసం ఘనా వెళ్లిన ప్రధానికి 'ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డును పురస్కరించింది. రాజధాని ఆక్రాలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రమానీ మోడీకి ఈ అవార్డును అలంకరించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోడీ 140 కోట్ల మంది భారతీయుల తరపున ఈ అవార్డును స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

### మా దేశంలో 2500 పార్టీలున్నాయ్

ఘనా పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని



# పెట్టుబడులను ఆకర్శించడంలో తెలంగాణ టాప్

కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి ఫ్యూచర్ సిటీని అందిస్తోంది

పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వ్యాపారం లాభాల్లో సాగేలా చూస్తున్నం

డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

వందేళ్ల ప్రగతి ప్రణాళిక దీనిలో ఉంటుందని వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో తయారీ రంగం వేగంగా వృద్ధి చెందుతోంది : మంత్రి శ్రీధర్ బాబు

### 50 ఏండ్లు రాజకీయాల్లో ఉన్న.. వివాదరహితుడు రోశయ్య

మాజీ ముఖ్యమంత్రి సేవలను స్మరించుకున్న రేవంత్

2

## నేడు ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బహిరంగ సభ

గ్రామ, మండల, జిల్లా అధ్యక్షులతో ఖర్గే భేటీ

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై దిశానిర్దేశం

మంత్రి పదవులు ఆశించి భంగపడ్డ నేతలకు బుజ్జగింపు



హైదరాబాద్, జూలై 03, (మనం బ్యూరో): తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌కు చేరుకున్నారు. గురువారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన ఆయనకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ...మిగతా 2లో

# అంగన్‌వాడీలకు ప్రమోషన్లు

- టీచర్లుగా పదోన్నతికి వయోపరిమితి 45 నుంచి 50 ఏండ్లకు పెంపు
- రాష్ట్రవ్యాప్తంగా 4,322 మందికి ప్రయోజనం
- ఫైలుపై సీతక్క సంతకం



హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలోని అంగన్‌వాడీ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్తను అందించింది. అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి పొందేందుకు ఉన్న గరిష్ఠ వయోపరిమితిని పెంచుతూ ఒక కీలక ...మిగతా 2లో

# 6న ఐటీ బోనాలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూలై 3: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు - 2025 పోస్టర్ ను ఐటీ మంత్రి శ్రీధర్బాబు ఆవిష్కరించారు. టీహబ్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ ఈనెల 6న ఐటీ బోనాల జాతరను నిర్వహించనున్నారు. శిల్పకళా వేదిక నుంచి చిన్న పెద్దమ్మ ఆలయానికి భక్తిశ్రద్ధలతో ఊరేగింపు చేపడతారు. ఈ వేడుకలో 21 ఐటీ కంపెనీలకు చెందిన 1,500 మందికి పైగా ఉద్యోగులు పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సుందీప్ కుమార్ మక్తాలా, బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# కేసీఆర్‌తోనే మాకు లెక్క

## అసెంబ్లీకొస్తే తేలుస్తం పక్కా

కేటీఆర్, హరీశ్ మాటలకు స్పందించబోం

రీజనల్ రింగ్ రోడ్డు పనులు మూడేండ్లలో పూర్తి చేస్తం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, జూలై 03, (మనం బ్యూరో): బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావు కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై చేసే విమర్శలతో తమకు సంబంధం లేదని వాటికి స్పందించేది లేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలనీ, అప్పుడే అన్ని అంశాలపై చర్చిస్తామని స్పష్టం చేశారు. గురువారం రోడ్లు, భవనాల శాఖపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ...మిగతా 2లో

## యశోదకు కేసీఆర్

'సారుకేమైంద'ంటూ కొద్ది సేపు టెన్షన్ పడ్డ బీఆర్ఎస్ శ్రేణులు



హైదరాబాద్, మనం ప్రతినిధి: గత కొంత కాలంగా ఫామ్ హౌజ్ కే పరిమితమైన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సోమాజిగూడ యశోద దవాఖానకు వెళ్లారు. గురువారం సాయంత్రం అసుపత్రికి వెళ్లిన ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ వార్త మీడియాలో ప్రసారం కావడంతో 'కేసీఆర్ సారుకేమైంది?' అంటూ తెలిసిన వారికి ఫోన్‌లు చేశారు. దీనికి తోడు సీఎం రేవంత్ కూడా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోద వైద్యులను వాకబు చేశారన్న వార్తలు రావడంతో బీఆర్ఎస్ శ్రేణులతో పాటు తెలంగాణ ప్రజలు కొద్ది సేపు టెన్షన్ పడ్డారు. 'సారుకి ఎం కాలేదు?.. రెగ్యులర్ హెల్త్ చెకప్‌లో భాగమే'నని ఆస్పత్రి వర్గాలు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## తెలంగాణలో పెరిగిన పచ్చదనం

6.85 శాతం పెరిగిన అటవీ విస్తీర్ణం

హరితహారమే కారణమన్న కేటీఆర్

2

# అవన్నీ అపోహాలే

- గ్రూప్-1 ఎంపికపై ఆరోపణల్లో వాస్తవం లేదు?
- హైకోర్టులో వాదనలు వినిపించిన టీజీపీఎస్సీ
- ఉద్యోగం రానివారే పిటిషన్లు వేసిండ్రన్న టీజీపీఎస్సీ

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. గ్రూప్-1 ఎంపికల విషయంలో వస్తున్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం అపోహలు మాత్రమేనని ఆయన కోర్టుకు ...మిగతా 2లో

## హైకోర్టు జడ్జిలుగా నలుగురు అడ్వొకేట్లు




హైదరాబాద్, జూలై 3: రాష్ట్ర హై కోర్టుకు చెందిన నలుగురు అడ్వకేట్లను హై కోర్టు జడ్జిలుగా నియామకం చేసేందుకు సుప్రీకోర్టు కొలీజియం అమోదం తెలిపింది. గురువారం సమావేశమైన కొలీజియం అడ్వకేట్లు గైస్ మీరా మోహియిద్దిన్, సుద్దాల చలపతి రావు, వాకిటి రామకృష్ణ రెడ్డి, గాడి ప్రవీణ్ కుమార్ లకు లైన్ క్లియర్ చేసింది.

## మరో మూడ్రోజులు వానలు

2

# అక్కడి భూమి కంపిస్తూనే ఉంటుందట

## ఒక్క రోజులో 183 సార్లు కంపించిన భూమి

15 రోజుల్లో 900 భూప్రకంపనలు

జపాన్‌లోని టొకార దీవుల్లో భయానక పరిస్థితి



టోక్యో, జూలై 3: జీవిత కాలంలో ఒకసారో.. రెండు సార్లో మన భూమి కంపిస్తే చచ్చిపోయేంతగా భయపడుతున్నాం. అలాంటిది 15 రోజుల్లో తాముంటున్న భూమి 900 సార్లు కంపిస్తే.. అక్కడి వారి పరిస్థితి ఎంత భయానకంగా.. గందరగోళంగా ఉంటుందో.. ఇదే పరిస్థితి జపాన్‌లో నెలకొంది. అక్కడ టొకార దీవుల్లో జూన్ 21 నుంచి భూఫలకాల కదలికలు చురుగ్గా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. బుధవారం కూడా ఇక్కడ 5.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీనితో బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి గత రెండు వారాలుగా నమోదైన భూ ప్రకంపనల సంఖ్య 900 అని జపాన్ వాతావరణశాఖ ఏజెన్సీ అధికారి అయాటకా ఎబిటా పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే టొకార దీవుల్లో జనావాసాలు తక్కువగా ...మిగతా 2లో

# విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకోండి

కానీ, చిరుద్యోగాలు, పార్ట్ టైమ్‌లపై ఆశలు పెట్టుకోవద్దు

అమెరికా విదేశాంగ శాఖ ప్రకటన

వాషింగ్టన్, జూలై 3: తమ దేశంలో చదువుకోవాలని కోరుకునే విదేశీ విద్యార్థుల వీసా దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించినట్లు అమెరికా ప్రకటించింది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని.. కానీ, చదువుకోవడానికి వచ్చే వారు విద్యాభ్యసనమే తప్ప ఉద్యోగాలపై ఆశలు పెట్టుకోవద్దంటూ విదేశాంగ శాఖ ప్రతినిధి మిగ్నాన్ హౌస్టన్ ప్రకటించారు. 'మా విద్యార్థి వీసా అప్లికేషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోండి. కానీ, ...మిగతా 2లో



# మా దేశంలో 2500 పార్టీలున్నాయ్

- ఘనా పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని
- ఆశ్చర్యపోయిన ఘనా ఎంపీలు
- 30 ఏండ్లల్లో ఆ దేశాన్ని సందర్శించిన తొలి భారత ప్రధాని మోడీ



అక్రా, జూలై 3: ఆఫ్రికా దేశమైన ఘనాలో రెండు రోజుల పర్యటన చేస్తున్న ప్రధాని మోడీ గురువారం ఆ దేశ పార్లమెంట్‌నుద్దేశించి ప్రసంగించారు. ఘనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతోందని కొనియాడారు. భారత్‌లో కూడా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని.. మా దేశంలో 2500 రాజకీయ పార్టీలు ఉన్నాయని మోడీ అన్నారు. దాంతో పార్లమెంటు సభ్యులందరూ ఆశ్చర్యం ప్రకటించారు. 'ఉప ఖండమంత వైశాల్యం కలిగిన భారత్‌లోని 29 రాష్ట్రాలను వివిధ పార్టీలు పాలిస్తున్నాయి. దేశంలో 22 అధికారిక భాషలతో పాటు దేశంలో వేలాది భాషలున్నాయి. భారత్ వచ్చే పర్యాటకులను విశాలహృదయంతో స్వాగతించడానికి ఈ భిన్నత్వమే కారణం. ఆ స్ఫూర్తివల్లే భారతీయులు ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలతో ఇట్టే కలిసిపోగలుగుతున్నారు' అని మోడీ ప్రకటించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రతినిధిగా 140 కోట్లమంది భారతీయులు శుభాకాంక్షలను నా వెంట తీసుకువచ్చాను. ఘనా దేశపురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. రెండు దేశాల సంబంధాలకు దానికి అంకితం ఇస్తున్నాను. మాకు ప్రజాస్వామ్యం ఒక వ్యవస్థ మాత్రమే కాదు.. అది ప్రాథమిక విలువల్లో భాగం. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోంది. సాంకేతికతలో విప్లవం, గ్లోబల్ సౌత్ (ఆర్థికంగా వెనకబడిన దేశాలు)లో ఎదుగుదల ఆ మార్పునకు దోహదం చేస్తున్నాయి. గ్లోబల్ సౌత్ గళం వినిపించకుండా ఆ పురోగతి సాధ్యంకాదు.

2047నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మా ప్రజలు సంకల్పంతో ఉన్నారు. బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది. ఆఫ్రికా అభివృద్ధి కోసం మా వంతు సహాయాన్ని అందిస్తాం. మన దేశాల పురోగతికి పరస్పరం సహకరించుకుందాం'' అని మోడీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూప్లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి.

# పెట్టుబడులను ఆకర్శించడంలో తెలంగాణ టాప్



హైదరాబాద్, జూలై 03, (మనం బ్యూరో): పెట్టుబడులను ఆకర్శించడంలో తెలంగాణ దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా ముందంజలో ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి ఫ్యూచర్ సిటీని అందిస్తోందని పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు, మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీ పడుతున్నాయని చెప్పారు. పెట్టుబడులను ఆకర్శించడంలో తెలంగాణ ముందుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో ఉంచుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నామని తెలిపారు. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్సల్టెంట్‌లు పని చేస్తున్నాయనీ, పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకెళుతున్నామనీ, పెట్టుబడులను ఆకర్శించడమే కాదు, వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో తయారీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందనీ, రాష్ట్రంలో 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని వెల్లడించారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 4200 దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు.



## అక్కడి భూమి కంపిస్తూనే ఉంద(ట)

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం ఒక్కటే కొంచెం ఊరటనిచ్చే అంశం. ఇక్కడివారిని ఏ క్షణమైనా తరలించేందుకు వీలుగా అధికారులు అన్నీ సిద్ధం చేశారు. ప్రజలు తరచూ వస్తున్న ఈ ప్రకంపనలతో విసిగిపోయారని ఆ గ్రామాధికారి వెల్లడించారు. జూన్ 23న అత్యధికంగా ఒక్క రోజులో 183 సార్లు భూమి కంపించింది. తమకు ఎప్పుడూ భూమి కదులుతున్నట్లే అనిపిస్తోందని ఓ బాధితుడు స్థానిక మీడియాకు వెల్లడించాడు. గతేడాది ఇదే దీవుల్లో 346 సార్లు భూమి కంపించింది. మొత్తం 12 దీవులు ఇక్కడ ఉన్నాయి. వీటిల్లో ఏడుచోట్లే ప్రజలు నివశిస్తున్నారు. వీరి సంఖ్య సుమారు 700 మంది. ప్రపంచంలోనే అత్యధిక భూకంపాలు నమోదయ్యే ప్రదేశాల్లో జపాన్ కూడా ఒకటి. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అనే ప్రదేశంలోని ప్రధాన భూ ఫలకాలపై ఈ దేశం ఉంది. ఇక్కడ ఏడాదికి 1500 వరకు ప్రకంపనలు నమోదు అవుతుండడం గమనార్హం.

# అంగన్‌వాడీలకు ప్రమోషన్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది సహాయకులకు ప్రయోజనం చేకూరనుంది. ఇంతవరకు అంగన్‌వాడీ సహాయకుల నుంచి టీచర్లుగా పదోన్నతి పొందాలంటే గరిష్ఠ వయసు 45 ఏళ్లుగా ఉండేది. తాజాగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఈ నిబంధనను సవరించి, వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచింది. ఈ మార్పునకు సంబంధించిన ఫైలుపై ఆ శాఖ మంత్రి సీతక్క గురువారం సంతకం చేసి ఆమోదం తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 4,322 మంది అంగన్వాడీ సహాయకులకు పదోన్నతి పొందేందుకు మార్గం సుగమమైంది. మంత్రి ఆమోదం లభించడంతో ఈ అంశంపై అధికారిక ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# 50 ఏండ్లు రాజకీయాల్లో ఉన్నా..

హైదరాబాద్, జూలై 03, (మనం బ్యూరో): 50 ఏండ్లు రాజకీయాల్లో ఉన్నప్పటికీ వివాద రహితుడిగా పేరు పొందిన ఘనత దివంగత సీఎం రోశయ్యకే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా ఆయన సేవలను సీఎం స్మరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కుతుందన్నారు. రోశయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని తమ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మా ప్రభుత్వం రోశయ్యకు అరుదైన గౌరవం కల్పించిందని పేర్కొన్నారు. సమైక్య ఏపీకి ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తరువాత కూడా తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య సేవలందించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

### కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ ఆరా..

మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గురువారం అకస్మాత్తుగా వైద్య పరీక్షల కోసం కేసీఆర్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై సీఎం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌కు అత్యుత్తమ వైద్య పరీక్షలు అందజేయాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలనీ, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## నేడు ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

మీనాక్షి నటరాజన్ స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణా హోటల్‌కు ఖర్గే చేరుకున్నారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించే భారీ సభలో ఖర్గే పాల్గొననున్నారు. ఈ సభకు ఖర్గే ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ, మండల, జిల్లా అధ్యక్షులతో ఖర్గే సమావేశమై పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మల్లికార్జున ఖర్గే పాల్గొననున్న సభ కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా కేడర్‌ను తరలించేందుకు పీసీసీ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి ఆశించి భంగపడ్డ పలువురు ఎమ్మెల్యేలు ఖర్గేతో భేటీ అయ్యారు. విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బాలు నాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి ఖర్గే బస చేసిన తాజ్ కృష్ణా హోటల్‌లో వీరంతా భేటీ అయ్యారు. అయితే, కొన్ని సామాజిక సమీకరణాల వల్ల పార్టీలో సీనియర్లకు మంత్రివర్గంలోచోటు కల్పించలేకపోయామని ఖర్గే వీరికి నచ్చజెప్పారు. మరోమారు జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో ఆశావహులకు మంత్రులుగా తప్పనిసరిగా అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా ఖర్గే వారికి హామీ ఇచ్చినట్లు సమాచారం.

# విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకోండి




(మొదటి పేజీ తరువాయి)

వారికి ఒక్క విషయం అర్థమయ్యేలా చెప్పాలనుకొంటున్నాం. వారు ఎందుకైతే అప్లికేషన్ పెట్టుకొన్నారో దానికే ఆ వీసాను వాడుకోవాలి. అంతేకానీ.. ఇక్కడికి వచ్చి వారు చదువును వదిలేయడం.. క్యాంపస్లను ధ్వంసం చేయడం వంటివి చేయకూడదు. మా ప్రభుత్వం ప్రతి నిర్ణయం జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకొని తీసుకొంటుంది. వలస చట్టాల ఆధారంగా ఈ పాలసీలను నిర్ణయిస్తాం. అమెరికా ఇమిగ్రేషన్ అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చూస్తాం. ఇవి కేవలం మా పౌరులను రక్షించడానికే కాదు.. వారితోపాటు చదువుకొనే ఇతర విద్యార్థులను కాపాడటానికి కూడా అవసరం'' అని హాస్టన్ స్పష్టం చేశారు.దాదాపు నెల రోజుల సస్పెన్షన్ తర్వాత జూన్ 18న విదేశీ విద్యార్థులు దరఖాస్తు చేసుకొనేందుకు అప్లికేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని విదేశాంగశాఖ ప్రకటించింది. సోషల్ మీడియా వెట్టింగ్ ప్రాసెస్ కోసం కొన్నాళ్లు దీనిని నిలిపేసిన విషయం తెలిసిందే. కొత్త దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైల్స్ అన్నింటిలో కచ్చితంగా 'పబ్లిక్ వ్యూ' ఆప్షన్ను యాక్టివేట్ చేయాలని అమెరికా సూచించింది. దీనిని పాటించకపోతే అప్లికేషన్ తిరస్కరిస్తామని.. అలాంటి వారు తర్వాత కూడా అమెరికాకు వచ్చే అవకాశం ఉండదని తేల్చిచెప్పింది.

## అవన్నీ అపోహాలే

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ముఖ్యంగా, కోఠిలోని ఒకే పరీక్షా కేంద్రం నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఎంపికయ్యారంటూ వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కోఠిలో ఉన్న రెండు కేంద్రాలను కేవలం మహిళా అభ్యర్థుల సౌకర్యం కోసమే కేటాయించామని తెలిపారు. ఆ కేంద్రాల నుంచి దాదాపు 1,500 మంది మెయిన్స్ పరీక్ష రాయగా, ఇతర కేంద్రాల నుంచి అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే అభ్యర్థులు ఎంపికయ్యారని వివరించారు.

పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యలోనూ ఎటువంటి తేడాలు లేవని నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి పారదర్శకంగా వ్యవహరించామని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపిక కాని కొందరు అభ్యర్థులు నిరాధారమైన అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారని, వారి ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని వాదించారు.

# వ్యాక్సిన్లపై నిందలా?

- లక్షల ప్రాణాలు కాపాడిన టీకాలపై నిందలు తగదు?
- హాసన్ జిల్లా మరణాలపై కర్ణాటక సర్కార్ కమిటీ
- కొవిడ్ టీకాలకు, మరణాలకు సంబంధం లేదు?..
- కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టీకరణ

హైదరాబాద్, మనం ప్రతినిధి: కర్ణాటకలో ఇటీవల సంభవించిన గుండెపోటు మరణాలకు కొవిడ్ టీకాలే కారణం కావొచ్చంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను బయోకాన్ అధినేత్రి కిరణ్ మజుందార్ షా తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిడ్ వ్యాక్సిన్లు అత్యవసర వినియోగ నిబంధనల ప్రకారమే అనుమతి పొందాయని కిరణ్ షా స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వీటిని తయారు చేశారని గుర్తుచేశారు. 'ఈ టీకాలు లక్షలాది మంది ప్రాణాలను కాపాడాయి. వీటిపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదు. దుష్ప్రభావాలు చాలా అరుదుగా నమోదయ్యాయి. వ్యాక్సిన్లపై నిందలు వేయడం ఆపి, వాటి వెనుక ఉన్న విజ్ఞాన శాస్త్రాన్ని గౌరవించాలి' అని ఆమె పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, యువతలో ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ఇతర ఆరోగ్య సమస్యలే కారణమని, కొవిడ్ టీకాలు కాదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ఐసీఎంఆర్, ఢిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనాల్లో ఇదే విషయం తేలిందని పేర్కొంది. దేశీయ వ్యాక్సిన్లు సురక్షితమైనవని, వాటి సామర్థ్యం నిరూపితమైందని, తీవ్రమైన దుష్పరిణామాలు అత్యంత అరుదు అని వెల్లడించింది.

గత నెలలో హాసన్ జిల్లాలో 20 మందికి పైగా గుండెపోటుతో మరణించడంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మరణాల వెనుక కచ్చితమైన కారణాలను తేల్చేందుకు ఆయన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కొవిడ్ వ్యాక్సిన్లను ప్రజలకు హడావుడిగా అందించడం కూడా ఈ మరణాలకు ఒక కారణమై ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కమిటీని ఆదేశించారు.

## మరో మూడ్రోజులు వానలు

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, మనం ప్రతినిధి: రుతుపవన ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

# తెలంగాణలో పెరిగిన పచ్చదనం

హైదరాబాద్, మనం ప్రతినిధి: ఒక చిన్న మొక్క నిశ్శబ్దంగా అడవికి జన్మనిస్తుంది.. అని అనడానికి తెలంగాణలో విజయవంతమైన హరితహారం నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా జూలై 3, 2015న మొదలైన హరితహారంతో తెలంగాణ పచ్చని స్వర్గసీమగా మారిందన్నారు. రాబోయే తరాలకు అద్భుతమైన పరిసరాలను అందించాలన్న కేసీఆర్ సంకల్పం పదేండ్ల స్వల్పకాలంలోనే హరితహారంతో సాకారమైందన్నారు. ఓవైపు కాలుష్య కోరల్లో చిక్కుకుని ఊపిరాడని నగరాల దుస్థితి తెలంగాణకు రాకూడదన్నదే హరితహారం లక్ష్యమని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన హరితహారం లక్ష్యం ఒక మొక్కను నాటడమో లేదంటే ఒక వనాన్ని సంరక్షించడమో కాదన్న కేటీఆర్, తెలంగాణలోని ప్రతీ మూలను పచ్చదనంతో నింపడమే అన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చూపిన పట్టుదలతో రాష్ట్రంలో పచ్చదనం 24% నుండి 33%కి పెరిగిందన్నారు. 19,472 గ్రామ పంచాయతీలు, 143 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో నర్సరీలు, ప్రకృతి వనాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిందని తెలిపారు. తమ ప్రభుత్వ కృషితో ఇవాళ తెలంగాణలో అటవీ విస్తీర్ణం 6.85 శాతం, చెట్ల విస్తీర్ణం 14.51 శాతం, పచ్చదనం 7.7 శాతం పెరిగిందన్నారు. మహత్తర ఆశయంతో కేసీఆర్ ప్రారంభించిన హరితహారం రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతాలకు కారణమవుతుందన్న నమ్మకం తనకు ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

# కేసీఆర్‌తోనే మాకు లెక్క

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అనీ, హరీష్ రావు ఉత్తి ఎమ్మెల్యే మాత్రమేనని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదని అన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తమ తప్పు ఒప్పులను చెప్పాలని అన్నారు. కేసీఆర్‌తోనే తమకు లెక్క అనీ, హరీష్ రావు ఎవరో నాకు తెలియదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో హామ్ మోడల్ రోడ్లు వేశారనీ, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే రూ.6 వేల 500 కోట్లను రోడ్ల కోసం విడుదల చేశామని అన్నారు. రూ.1500 కోట్లతో అప్రోచ్ రోడ్లు కూడా లేకుండా గ్రామాలకు లింక్ బ్రిడ్జ్‌లను గత ప్రభుత్వం నిర్మించిందని విమర్శించారు. రూ.350 కోట్లతో అప్రోచ్ రోడ్లను వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సింగిల్ రోడ్లను పునరుద్ధరణ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ట్రిపుల్ ఆర్‌పై ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి గడ్కరీని కలుస్తాననీ, ఇందుకోసం ఇప్పటికే 96 శాతం భూ సేకరణ పూర్తయిందన్నారు. త్వరలోనే కొత్త టెండర్లు పిలుస్తామనీ, సదరన్ పార్ట్ ట్రిపుల్ ఆర్



ప్రాసెస్ త్వరలోనే మొదలు పెడతామనీ, రీజినల్ రింగ్ రోడ్డు పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. 40:60 శాతం ప్రకారం హ్యామ్ రోడ్లు ఎన్‌హెచ్ఏ మోడల్‌లో అందుబాటులోకి రానున్నాయని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

# ప్రాణాలు తీస్తున్న లేఫ్ లు

హైదరాబాద్, జూలై 3: ఐటీ, ఐటీ సేవల రంగంలో ఉద్యోగులకు ఈ ఏడాది ఎక్స్‌ట్రీమ్‌లీ బ్యాడ్ టైమ్ అన్నది ఇండస్ట్రీ టాక్. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, ఇంటెల్ వంటి కంపెనీలు మొదలుకొని దాదాపు దిగ్గజ కంపెనీలన్నీ ఉద్యోగులను తొలగిస్తూ ఉండడంతో కారణంగా ఎంప్లాయిస్ రోడ్డున పడుతున్నారు. గత రెండేండ్లుగా ఆర్థిక మాంద్యం భయాలతో వేలాదిమందిని తొలగించిన సంస్థలు.. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల లక్షలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ప్రస్తుత 2025 జూన్ నాటికే, అంటే ఆరు నెలల్లోనే లక్ష మందికి పైగా ఉద్యోగులకు లే ఆఫ్ లు ప్రకటించాయి.



### మైక్రోసాఫ్ట్‌లో అత్యధికంగా..

ప్రఖ్యాత మైక్రోసాఫ్ట్ సంస్థ ఈ ఏడాది అత్యధిక కోతలను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 4 శాతం మందిని అంటే 9,100 మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాదిలో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభంలో 1 శాతం మందిని తొలగించిన కంపెనీ.. ఆ తర్వాత మే నెలలో 6 వేల మందిని ఇంటికి పంపించింది. జూన్లోనూ 300 మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. తాజాగా, ఎక్స్ బాక్స్, గేమింగ్ డివిజన్లలో కోతలు పెట్టింది. గతేడాది కూడా ఈ కంపెనీ దాదాపు 10వేల మందికి లేఆఫ్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, ప్రోడక్ట్ డెవలపర్లు ఉన్నారు.

### ఇంటెల్‌లో 20 శాతం ఉద్యోగులకు కోత..

అమెరికాకు చెందినఎలక్ట్రానిక్ చిప్ ల తయారీ సంస్థ ఇంటెల్ కూడా భారీఎత్తున ఉద్యోగాల కోతలు విధించింది. కొత్త సీఈఓ నేతృత్వంలో పునర్వ్యవస్థీకరణ చేపట్టిన కంపెనీ.. ఇప్పటికే జర్మనీలోని ఆటోమోటివ్ చిప్ యూనిట్ను మూసేసి.. అందులోని మొత్తం సిబ్బందిని తొలగించింది. కంపెనీ హెడ్క్వార్టర్స్లోనూ దాదాపు 100 మందిని తీసేసింది. ఇక, జులై మధ్యలో కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం సిబ్బందిలో 20శాతం మందికి లేఆఫ్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. చిప్ డిజైన్ సీనియర్ ఇంజినీర్లు, క్లౌడ్ ఆర్కిటెక్చర్లు, ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో ఉన్నవారిని తొలగించనున్నట్లు తెలుస్తోంది.

### అమెజాన్ ఇప్పటికే నాలుగుసార్లు..

మరో దిగ్గజ సంస్థ అమెజాన్ కూడా ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగుసార్లు తొలగింపులు చేపట్టింది. కమ్యూనికేషన్, సర్వీసెస్, వండరీ పాడ్కాస్ట్ విభాగాల్లో ఈ కోతలు విధించింది. రానున్న రోజుల్లోనూ మరింత ఎక్కువగా లేఆఫ్లు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మేనేజర్ విభాగాల్లో దాదాపు 14వేల మందిని తొలగించనున్నట్లు ఫైనాన్షియల్ ఎక్స్ప్రెస్ కథనం వెల్లడించింది.

### ఏఐ సిస్టమ్‌తో భర్తీ చేస్తున్న ఐబీఎం..

ఐబీఎం కూడా ఈ ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు 8వేల మందిని తొలగించినట్లు సమాచారం. ఎక్కువగా మానవ వనరుల విభాగంలో ఈ కోతలు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే దాదాపు 200మంది ఉద్యోగులను ఏఐ వ్యవస్థలతో భర్తీ చేసింది.

మరో టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల 240 మంది ఎంట్రీ లెవల్ ఉద్యోగులను తొలగించింది. అంతకుముందు ఫిబ్రవరిలోనూ 300 మంది ఫ్రెషర్స్‌



కు లే ఆఫ్‌లు ఇచ్చింది.

గూగుల్ తన ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్ విభాగాల్లో లేఆఫ్లు ప్రకటించింది. అంతకుముందు క్లౌడ్, హెచ్ఆర్ యూనిట్లలోనూ ఉద్యోగులను తొలగించింది.

మెటా ఈ ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు 3600 మంది ఉద్యోగాలకు కోత పెట్టింది. పనితీరు బాగాలేదన్న కారణంతో వీరిని తొలగించింది.

హెచ్ పీ పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా 2000 మందిని తొలగించింది. టిక్ టాక్ తన డబ్లిన్ కార్యాలయంలో 300 మందిని ఇంటికి పంపించింది.

ఓలా ఎలక్ట్రిక్ ఐదు నెలల్లో రెండుసార్లు కోతలు ప్రకటించింది. వెయ్యి మందికి పైగా ఉద్యోగులను తీసేసింది.

సేల్స్ ఫోర్స్, బ్లూఆర్జిన్ సంస్థలు 1000 మంది చొప్పున ఉద్యోగులకు గుడ్ బై చెప్పాయి.

సైమన్స్ గ్రూప్ తన ఆటోమేషన్, ఈవీ ఛార్జింగ్ యూనిట్లలో దాదాపు 5,600 మందిని ఇంటికి పంపించింది.

# మీ తీరు నిబంధనలకు విరుద్ధం

- నిందితులని 24 గంటలకన్నా ఎక్కువగా మీ అదుపులోనే ఎట్లా ఉంచుకుంటరు?
- వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులకు అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ మందలింపు

హైదరాబాద్, మనం ప్రతినిధి: మహాన్యూస్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు చేపట్టిన నిరసన కేసులో వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులకు షోకాజ్ నోటీసుల జారీకి కోర్టు ఆదేశించింది. పోలీసుల అత్యుత్సాహంపై అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసుకు సంబందించి ఎ2 నర్సింగ్, ఎ3 జంగయ్యలను టాస్క్ ఫోర్స్ పోలీసులు 24 గంటలకన్నా ఎక్కువగా వారి అదుపులోనే ఉంచుకోవడం.. బీఎన్ఎస్ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ న్యాయమూర్తి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ కేసులో నిబంధనలను అతిక్రమించిన వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ విచారణాధికారికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గురువారం నాడు కోర్టు ఆదేశించింది.

# ఏఎంసీ వైస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి

## టిఎన్‌జీవో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ డిమాండ్



రంగారెడ్డి, జూలై 3 (మనం న్యూస్): మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ ను పదవి నుండి తొలగించాలి. అని టి ఎన్ జీ వో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ డిమాండ్ చేశారు. గురువారం మలక్పేట్ లోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్లో భోజన విరామ సమయంలో మార్కెట్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి మాట్లాడుతూ మహబూబ్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో లైసెనస్డ్ హమాలీ అడ కూలి కి ప్రభుత్వం కల్పించిన డ్రెస్సుల పంపిణీ కార్యక్రమంలో లైసెన్స్ లేని వారి కి కూడా డ్రెస్ లు ఇవ్వమని వైస్ చైర్మన్ ఒత్తిడిని ఆది రూల్స్ కి విరుద్ధమని తెలియ చేసే క్రమములో మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్ పై ఆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ విచక్షణ రహితంగ దాడి చేసిన విషయాన్ని ముక్త కంఠం తో ఖండిస్తున్నామని అన్నారు.అందుకు నిరసనగా రాష్ట్రం లో ని అన్ని మార్కెట్ కమిటీ ల కార్యాలయ ఆవరణ నందు బోజన విరామ సమయములో ఉద్యోగులు అందరు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయుటకు నిర్ణయించడమయినది అని అన్నారు . మార్కెటింగ్ శాఖ ఉన్నత అధికారులు వైస్ చైర్మన్ విజయ్ కుమార్ పై చట్ట ప్రకారం వారిని ఆ పదవి నుండి తొలగించుటకు చర్యలు తీసుకోవాలి అని అన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని రకాల ఆదేశాలు జారీ చేయుటకు గాను మార్కెట్ కమిటీ ఉద్యోగుల పక్షాన, టి ఎన్ జీ వో మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ , మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రిన్సిపుల్ సెక్రటరీ, సంచాలకులు లని కోరుతున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ముక్రం , సెక్రటరీ సెంట్రల్ యూనియన్ సంతోష్, ,ఖలీద్ అహ్మద్ అధ్యక్షులు హైదరాబాద్ జిల్లా యూనిట్, రేవంత్, పవన్ ,షరీఫ్ , పుష్ , మాదూరి తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ లైసెన్సు రద్దు చేయాలి



- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

చేవెళ్ల, జూలై 3(మనం న్యూస్ ): వీరభద్ర ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో హాస్టల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... చేవెళ్ల డివిజన్ లో ప్రభుత్వ హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్లకు 8 నెలల నుంచి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీరభద్ర అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా హాస్టల్ వర్కర్లకు వేతనాలు అందిస్తున్నారని వీరభద్ర ఔట్సోర్సింగ్ ఏజెన్సీ యాజమాన్యాన్ని జీతాలు అడిగితే ప్రభుత్వం నుంచి తమకు బిల్లులు రావడం లేదని అందుకే చెల్లించక లేక పోతున్నామని చెప్పడం సరికాదన్నారు . వీరభద్ర అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్మికులకు వెంటనే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టు యాజమాన్యం కుమ్మక్కై హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ వీరభద్ర అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేసి, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ప్రభుత్వ హాస్టల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు రాములు, హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



చేవెళ్ల, జులై 3 (మనం న్యూస్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బిఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. చేవెళ్ల మండలంలోని గొల్లపల్లి పరిధిలో గల గురుకుల పాఠశాలలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తరగతి గదులు, వంటగది ,మూత్రశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు నాణ్యమైన ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పూలే పల్లి పృథ్వీరాజ్ , రవికుమార్, ఆసిఫ్, ఉప సర్పంచ్ భాస్కర్, కార్తీక్, అమాన్, అలీఖాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో ప్రగతి సాధించాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల, జులై 3(మనం న్యూస్ ): రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో ప్రగతి సాధించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అధికారులకు ఆదేశించారు. చేవెళ్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గం డిఏఓ, ఎమ్మార్వో, ఎంపీడీవో, వ్యవసాయ, ఇతర ప్రభుత్వ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ఎంత మంది రైతులకు జరిగిందని, రుణమాఫీ జరగని రైతులు ఇంకా ఎంతమంది ఉన్నారని, రైతు బంధు పథకం ఇతర అంశాలపై ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం తరపున ఉచితంగా పంపిణీ చేసే విత్తనాలను రైతులకు చేరవేయాలని, ఏ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. గ్రామాల్లో మొన్నటి వరకు జరిగిన భూభారతి రెవెన్యూ చట్టంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్లకు కోరారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ప్రతి ఒక్కరు నిర్మించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు రాని వారికి రెండో విడుతలో మంజూరూ అయ్యే విధంగా చూడాలని ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సిజిఎల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రత పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వివిధ మండలాల వ్యవసాయ అధికారులు , ఇతర ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాలు పంపిణి



రంగారెడ్డి, జూలై 3 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొగ్గారపు శరత్ చంద్ర ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ ఇందిరా నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా,రోడ్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల భవన నిర్మాణం పనులను మధ్యలోనే నిలిపివేశారని ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ నేతలు దయానంద్ గుప్తా, రాంరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లగా... ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చేస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం 50 వేల పుస్తకాలు పంపిణీ చేస్తున్న శరత్ చంద్రను వారు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, వెంకటేష్ చారి, రవి కేశవ్ నాయుడు, చిన్నా గౌడ్, చరణ్, అరుణ్, రవి కేశవ్ నాయుడు, విజయ రంగ, బంటి పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావును కలిసిన చేవెళ్ల బిజెపి శ్రేణులు



- చేవెళ్ల బిజెపి యువ నాయకులు డాక్టర్ వైభవరెడ్డి

చేవెళ్ల, జులై 3(మనం న్యూస్ ): బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాం చందర్ రావును చేవెళ్ల బిజెపి నేతలు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాం చందర్ రావు నాయకులు, కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడుతూ... బిజెపి పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. గ్రామ, గ్రామాన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు , కార్యకర్తలు తదితరులున్నారు.



## చిగురింత పెద్దబాల్ రెడ్డి హఠాన్మరణం

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, జూలై 3 (మనం న్యూస్): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ గ్రామానికి చెందిన చిగురింత పెద్ద బాల్ రెడ్డి హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి బాధను పంచుకున్నారు, ధైర్యాన్ని అందించారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకులబ్ధి

- ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



రంగారెడ్డి, జూలై 3 (మనం న్యూస్): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో మేలు అని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని చిలకలబస్తీకి చెందిన నిఖిత కీళ్ల నొప్పులకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థిక స్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి నీ సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 1,50,000(ఒక లక్ష యాభై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు




- చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

రంగారెడ్డి, జూలై 3 (మనం న్యూస్): ఆర్కె పురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీలోని ఐరా గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో వన మహోత్సవం లో భాగంగా పచ్చదనం పెంపొందించడానికి చెట్లను నాటడం కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పకృతి వనం, పచ్చదనం పై చిన్నారులకు అవగాహన కల్పిస్తూ చెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. చెట్ల పెంపకతో నే పర్యావరణ పరిరక్షణ ను కాపాడవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మెన్ సందీప్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ పాల్, ప్రిన్సిపల్ పద్మజ, నవీన్, సంధ్య, పద్మశ్రీ, మానస, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఆధారాలు లేని భూమిపై అడ్డొస్తున్న లక్ష్మయ్య పై చర్యలు తీసుకోవాలి



- మునుగోడు ఎస్ఐ పై చేసిన ఆరోపణలు అవస్థవం
- 40 సంవత్సరాలుగా మా ఆధీనంలో ఉన్న భూమిపై లక్ష్మయ్యకు ఎలాంటి హక్కు లేదు

నల్గొండ, జూలై 3( మనం న్యూస్ ): భూమికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకుండా తరసు భూమిపై వస్తున్న మునుగోడు మండల కేంద్రానికి చెందిన పెరమాళ్ళ లక్ష్మయ్య పై చర్యలు తీసుకోవాలని పెరమళ్ళ కనకయ్య కుమారులు యాదగిరి,రవి,పురుషోత్తం లు విలేకరుల సమావేశంలో అధికారులను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మునుగోడు ఎస్ఐ పై లక్ష్మయ్య చేసిన ఆరోపణలు అవస్తవం భూమి వివాదం కోర్టులో నడుస్తుండగా భూమిపైకి వచ్చి దౌర్జన్యం చేయడంతో ఎస్సై సివిల్ సమస్యలు మీరు కోర్టులో చూసుకోవాలని తెలిపాడు తప్ప దూషించడం ఆయనపై చేయి చేసుకోవడం లాంటివి ఏమి జరగలేదని ఆయనపై అవస్తవాలు సృష్టించి లాండ్ ఆర్డర్ శాంతిభద్రతలు కాపాడుతున్న ఎస్సై పై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని అన్నారు. మునుగోడు గ్రామ శివారులో ఉన్న 32, 33,78 సర్వే నెంబర్ లో పట్టా కలిగి గత 40 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు.లక్ష్మయ్య కు వచ్చిన వాటా భూమిని అమ్ముకొని మా భూమి పై కి వస్తు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.ఈ భూమి వివాదం కోర్టులో నడుస్తుందని తెలిపారు. తరసుగా ఆయన చేస్తున్న గొడవలకు మా తల్లి మానసికంగా కృంగిపోయి చనిపోయిందని మా తండ్రి మంచానికి పరిమితమయ్యాడని అన్నారు. ఆధారాలుంటే కోర్టులో చూసుకోవాలని మమ్ముల వేధిస్తూ అధికారులను పై తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదని కోర్టులో ఆధారాలు చూపించి రుజువు చేసుకుంటే ఆ భూమిని ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# పిఎసిఎస్ సీఈఓపై దాడి హేయమైన చర్య

- ఎరువుల పంపిణీ పై రాజకీయాలు మానుకోవాలి
- వ్యక్తిగత కక్షలతోనే దాడికి పాల్పడ్డారు



జాజిరెడ్డిగూడెం, జూలై 03( మనం న్యూస్ ): పిఎసిఎస్ సీఈఓ పై దాడి చేయడం హేయమైన చర్య అని పిఎసిఎస్ చైర్మన్ మారిపెద్ది మంగమ్మ, వైస్ చైర్మన్ కొనతం స్టాలిన్ రెడ్డి లు అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం పిఎసిఎస్ లో రైతులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 1వ తేదీన పిఎసిఎస్ తిమ్మాపురంలో రైతులకు సీఈవో ఊర సత్యనారాయణ రైతులకు ఎరువులు పంపిణీ చేస్తుండగా డీసీఎంఎస్ కు సంబంధించిన వ్యక్తి ఇందుర్తి జితేందర్ రెడ్డి పిఎసిఎస్ సీఈఓ సత్యనారాయణ, ఎల్గూరు వెంకన్న పై దాడి చేసి గాయపరచడం సరైన చర్యకాదన్నారు. గత 30 సంవత్సరాలుగా పిఎసిఎస్ లో ప్రజలకు సేవలు చేస్తున్న సత్యనారాయణ పై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా రైతులకు విత్తనాలు, ఎరువలను అందిస్తూ తాన విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. రైతులకు ఏ చిన్న సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకుపోవాలి కానీ ప్రత్యక్షంగా దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కేవలం వ్యక్తిగత కక్షలు దృష్టిలో ఉంచుకొని నాపై దాడి చేశారని ఆరోపించారు. బిజెపి నాయకులు మీలా కృష్ణయ్య మాట్లాడుతూ.. అధికారులపై ప్రత్యక్ష దాడి చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇలాంటి దాడి వల్ల తిమ్మాపురం గ్రామంలో అభివృద్ధి పనులు ఆగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యులు చల్లా వేణుధర్ రెడ్డి, మంగదొడ్ల మల్లయ్య, బొల్లం సుజాత, జ్యోతుల రాంబాయమ్మ, రైతులు దేశడి సందీప్, ఎడ్ల అమరేంద్రరావు, బొడ్డు బొందమ్మ, జ్యోతుల నాగయ్య, మంగదొడ్ల సత్యనారాయణ, మధుసూదన్, పాలెల్లి శీను, చామకూరి లక్ష్మయ్య, జీడి స్వామి, జీడి నరసయ్య పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణానికి రూ.1లక్ష విరాళం



చేవెళ్ల, జులై 3 (మనం న్యూస్): మండలంలోని న్యాలట గ్రామంలో నిర్మిస్తున్న చర్చికి చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డిలు రూ.1లక్ష విరాళం అందించారు. ప్రార్ధన మందిరాలు నిర్మించడం వల్ల ఆధ్యాత్మిక నెలకొంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సీనియర్ యువ నాయకులు మద్దెల శ్రీనివాస్ , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

# పీఏ పల్లి మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పిఏపల్లి, జూలై 3(మనంన్యూస్): సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున రాబోయే 3 నెలలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.గురువారం ఆమె నల్గొండ జిల్లా, పీఏ పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ఏ ఎన్ సి రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్ ,ఓపి, మాత, శిశుమరణాల రిజిస్టర్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. తగినన్ని మందులు స్టాక్ ఉన్నాయా? అలాగే సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా రాబోయే 3 నెలలు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సేవల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఆమె చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ పీఏ పల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూ భారతి పై తీసుకున్న చర్యలు, సంబంధిత వ్యక్తులకు జారీచేసిన నోటీసుల వివరాలు, తదితర వివరాలను తహసిల్దార్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. భూ భారతి కింద వచ్చిన అన్ని దరఖాస్తులకు ముందుగా నోటీసులు జారీ చేయాలని, అన్ని వివరాలను పోర్టల్ లో అప్లోడ్ చేయాలని, నోటీసును సైతం పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా పనుల నిమిత్తం తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులలు, ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీబాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి పాఠశాల పరిశుభ్రతను,వంట గదిని,టాయ్‌లెట్లు, విద్యార్థుల చదువు,భోజనం,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు .

## జీతం సగమూ జీవితం పెద్ద సగమూ!

అవును నేను చూస్తూ ఉండగానే
జీతం సగమైపోయింది
జీవితం పెద్ద సగమైపోయింది!
నేనొక నిత్య ప్రవాహాన్ని
పయనిస్తూ ఉండగానే
నన్ను ఎవరో మడుగులోకి తోసేశారు!
బహుశా అది కాలమే కావచ్చు
ఇకపై వేళకు లేవాల్సిన పనిలేదు
సమయానికే తినాల్సిన అవసరం లేదు
ఎవరి దగ్గరా ఇప్పుడు
తొలినాటి ప్రాధాన్యతలాశించక్కరలేదు
నెమరువేతలు
అసంకల్పితంగా మొదలైతవి
రోజూ సూర్యాస్తమయం భయపెడుతుంది
అటుగా వెళ్ళినప్పుడల్లా
తెరిచిన కాలేజీ గేటు
ప్రవేశం లేదని వెక్కిరిస్తుంది!
ఆ ప్రాంగణంలో నేను నాటిన మొక్కలు
తడారిన గొంతుకలతో నన్నెందుకో
నిశ్శబ్దంగా పిలుస్తున్నట్లు అనిపిస్తుంది
దారెంటా పోతూ పోతూ పాత విద్యార్థొకడు
నమస్తే సార్ అంటూ ఉంటే
బ్రతికిన క్షణాలు యాదికొస్తాయి!
మనసు కొంచెం పురివిప్పుకుంటది
నాన్నా నీవు ఇప్పుడు ఖాళీనే కదా
ఇంటి దగ్గరే ఉంటావా?
బయటికెళ్ళొస్తామని పిల్లలు అంటుంటే
నన్ను ఎవరో లేని గొలుసుతో
ఇంటి గుమ్మానికి కట్టేసినట్లు ఉంటది!
నన్నెరిగిన ఒకరిద్దరు సహచరులు కలిస్తే
నాలాగే ఇంకిన కన్నీళ్లను దాచుకుంటూ
ఒక పొడి నవ్వు విసిరేస్తుంటారు
ఇది ఒక బాధ కాదు
అవ్యక్త దుఃఖాలు కదా
ఎవరికీ చరమాంకం చేరకుండా అర్థం కావు!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# భారత్‌లో తగ్గిన ఆడపిల్లల జననాల రేటు



మన దేశం జనాభాపరంగా ఈ ఏడాది ప్రపంచంలోనే నెంబర్ వన్ (మొదటి)స్థానంలో కొనసాగుతోందని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఈ ఏడాది చివరి కల్లా జనాభా 146 కోట్ల చేరుకుంటుందని అంచనా వేసింది. అయితే జననాల రేటు నిర్దేశిత స్థాయి కంటే దిగువకు పడిపోయిందని వెల్లడించింది.

గత నలభై ఏళ్ల తర్వాత తగ్గుముఖం పట్టినట్టు నివేదిక తెలుపుతుంది. భారత్‌లో జననాల రేటు1.9శాతంగాఉంది.ఏ దేశంలోనైనా సగటు రీప్లేస్‌మెంట్ రేటు కనీసం 2.1 శాతంగా ఉండాలి. కానీ భారత్ లో సంతాన ఉత్పత్తి రేటు పడిపోయింది. జననాల రేటు తగ్గి పోయినప్పటికీ, భారతదేశ జనాభా సంఖ్య నిల కడగా కొనసాగుతుంది. ఇలా ఇంకొన్నాళ్లు కొన సాగి ఆ తర్వాత నుంచి జనాభా తగ్గుదల మొద లయ్యే అవకాశం ఉందని విశ్లేషించింది.

మన దేశ జనాభాలో వయసుల వారిగా 68 శాతం జనాభా 15 నుంచి 64 ఏళ్లలోపు వయోవర్గానికి చెందినవారు. ఇది వర్కింగ్ ఏజ్ గ్రూప్, అత్యధిక జనాభా వర్కింగ్ ఏజ్ గ్రూపులో ఉండటం అనేది భారత్ కు కలిసి వచ్చే అంశం. ఈ ఏజ్ లోని వారికి తగినన్ని ఉపాధి అవకాశాలు ప్రభుత్వ విధానపరమైన మద్దతు లభిస్తే భారత్ ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తుంది. అలాగే 10 నుంచి 24 ఏళ్ల లోపు వారు 26శాతం.0 నుంచి 14 ఏళ్ల లోపు వారు 24శాతం.10 నుంచి 19 ఏళ్ల లోపు వారు 17 శాతం మంది ఉన్నారు. అదేవిధంగా 65 ఏళ్లకు పైబడిన వారు భారత దేశంలో కేవలం 7శాతం మంది ఉన్నారు.



ప్రజల ఆయుర్దాయాలు పెరుగు తున్నందున రాబోయే కొన్ని రోజుల్లో 65 ఏళ్ల పైబడిన వయోవర్గంలోని వృద్ధుల సంఖ్య మరింత పెరగవచ్చు.2025 నాటికి భారతదేశంలోని పురుషుల సగటు ఆయుర్దాయం 71 ఏండ్లు కాగా, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉంది. మనదేశ మహిళల వల్లే ఈ మార్పు 1971 దశకం నాటికి మనదేశ మహిళల సగటు సంతానోత్పత్తి రేటు ఐదుగురు పిల్లల్ని కనడం. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది, మహిళలు సగటున ఇద్దరు పిల్లలకే జన్మనిస్తున్నారు.

ప్రెగ్నెన్సీ సమయంలో సంభవించే మరణాలు తగ్గిపోయాయి.ఈ విషయంలో వివిధ రాష్ట్రాలలో కులాలు, ఆదాయ వర్గాలు తేడాలు ఉన్నాయి. సంతానం ఎంతమంది ఉండాలనే దానిపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది.

మన తెలంగాణ రాష్ట్రంలో బాలురతో పోలిస్తే బాలికల జననాలు గణనీయంగా తగ్గుతున్నాయి. 2022లో ప్రతి 1000 మంది బాలురకు 907 మంది అమ్మాయిలు మాత్రమే జన్మించారు. ఈ మేరకు బాలురు, బాలికల జననాల నిష్పత్తి జాబితాలో తెలంగాణ దేశంలో దిగువ నుంచి మూడో స్థానంలో ఉంది.

తెలంగాణ తరువాత బీహార్ (891), మహారాష్ట్ర (906)లు మాత్రమే ఉన్నారు. ఏపీలో ఇది (938) గా నమోదయింది.ఈ మేరకు దేశవ్యాప్తంగా 2022లో జనన మరణాల నివేదిక ను కేంద్ర జనాభా లెక్క విభాగం విడుదల చేసింది. **అందులోని ప్రధాన అంశాలు:** 2022లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో బాలుర కంటే బాలికల జననాల ఎక్కువగా ఉన్నవి ముచ్చటగా మూడు మాత్రమే. ఆ మేరకు ప్రతి వెయ్యి మంది బాలురకు అత్యధికంగా నాగాలాండ్లో 1,068 మంది. అరుణాచల్ ప్రదేశ్ లో 1,036, లద్దాఖ్ లో1,027 మంది బాలికలు జన్మించారు. కానీ తాజాగా 2023-24లోకి వచ్చేసరికి దేశంలో విద్యావంతులు పెరుగుతున్న లైంగిక వివక్ష, కరడు గట్టిన పితృస్వామ్య భావజాలం సమాజాన్ని వదిలి పోవడం లేదు.

దాంతో అబ్బాయిల కంటే అమ్మా యిలు తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. 2023- 24 జాతీయ సగటు 1000 బాలురుకు/ బాలికలు (930)తో పోలిస్తే చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆడశిశువుల జననాలు తక్కువే. అవి ఏవంటే.. (వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య) లక్షదీవులు 831, అండమాన్ నికోబార్ 832, బీహార్ 882, మహారాష్ట్ర 915, చండీగఢ్ 916, తెలంగాణ 917, హర్యానా 917, ఢిల్లీ 918, నాగాలాండ్ 919, పంజాబ్ 928,దాద్రా, నగర్ హవేలీ: ధమణ్, దీవ్ 924, గుజరాత్ 925, మధ్యప్రదేశ్ 929, మణిపూర్ 929 వెయ్యి మంది అబ్బాయిలకు గాను పై విధంగా కేంద్రపాలిత ప్రాంతాలు,వివిధ రాష్ట్రాల్లో అమ్మాయిల వ్యత్యాసం కొనసాగుతుండడం భారత సమాజానికి శ్రేయస్కరం కానే కాదు.

**లోకసభలో కేంద్రం వెల్లడించిన వివరాలు**

2022లో తెలంగాణలో వెయ్యి మంది బాలురకు 907 మంది బాలికలతో తక్కువ నిష్పత్తి నమోదయింది.

దేశంలో బాలురు 52.4 శాతం ఉంటే, బాలికలు 47.6శాతంగాఉంది. ఇలా బాలికల జననాల రేటు తగ్గిపోవడం ప్రమాదకర సంకేతమే. మహిళలను గౌరవించాలి.

అన్ని చోట్ల వారికి సమాన అవకాశాలు కల్పించాలన్న ఉపన్యాసాలు మన దేశంలో వినసొంపుగా వినిపిస్తుంటాయి. సమస్త రంగాల్లో స్త్రీల భాగస్వామ్యం పెరగాలని అప్పుడే అభివృద్ధి పథంలో మనం దూసుకు పోతామని ప్రభుత్వాలు నిత్యం టముకు వేస్తుం టాయి. కానీ ముఖ్యంగా సమాజంలో గుణాత్మక మార్పులకు సాహకారం చేసి రాజకీయ రంగంలో స్త్రీల వాటా వారి జనాభాకు తగినట్టుగా ఉందా! అమలుకు నోచుకోని మహిళా రాజకీయ రిజర్వే షన్లు.

ప్రపంచ ఆర్థిక వేదిక తాజాగా విడుదల చేసిన లింగ సమానత్వ సూచి నేటికీ లేదని చెప్తుంది. ఆర్థిక కార్యకలాపాల్లో స్త్రీ,పురుషుల భాగస్వామ్యం, అందుకు లభిస్తున్న అవకాశాలు, విద్య, ఆరోగ్యం, జీవనస్థితిగతులు, రాజకీయ సాధికారత ప్రాతిపదికలుగా 148 దేశాల కేటాయించిన ర్యాంకుల్లో ఇండియా 131 స్థానంలో చతికిలబడింది.

ఆధునిక సాంకేతిక యుగంలో కూడా ఇంకా వెర్రి తలలు వేస్తున్న లింగ వివక్ష, పురుష ఆధిపత్య చట్రంలోంచి బయట పడలేక పోతున్న సమాజలో బాలికల నిస్సహాయతకు అర్థం పడుతుంది. సమాజం, ప్రభుత్వాలు బాలికల జననాల రేటు తగ్గి పోతూ స్త్రీ పురుష నిష్పత్తిలో ఆగాధం పెరిగిపోతే సృష్టికి ప్రమాదం. సమానత్వం సుదూర స్వప్నం కారాదు?. దీన్ని నివారించేందుకు అవగాహన, చైతన్యం పెంచుకోవాల్సిన ఉమ్మడి బాధ్యత చాలా ఉంది.

**- మేకిరి దామోదర్**
95736 66650

# యోగిపుంగవుడు స్వామి వివేకానంద



అపార విశ్వాసం, అనంత శక్తి ఇవే విజయసాధనకు మార్గాలని, సేవకుడిగా ఉండడం నేర్చుకుంటే, నాయకుడయ్యే యోగ్యత లభిస్తుందని, అఖండమైన ఉత్సాహం, అపరిమితమైన ధైర్యం, అప్రతిహతమైన శక్తి.... అన్నింటిని మించి పరిపూర్ణవిధేయత, ఈ లక్షణాలు ఒక వ్యక్తిని గాని, ఒకదేశాన్ని గాని పునరుజ్జీవింప చేయగలవని ఎన్నో మార్లు తెలియచేసిన యువసన్యాసి, యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

'నరేన్' గా ముద్దుగా పిలువబడే 'నరేంద్రనాథ్ దత్త' తరువాత కాలంలో విశ్వ విఖ్యాత గాంచిన, సింహసదృశ్యమైన మనోబలానికి ప్రతిరూపమై భారతదేశ యువజనులందరికి ఆదర్శమై నిలిచిన 'స్వామి వివేకానంద' గా పేరు గాంచాడు.

ఎందరికో జ్ఞానోదయం కలిగించి ,ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి,భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్యజ్ఞాని స్వామిజీ.

కలకత్త నగరంలో విశ్వనాథ్ దత్త ,భువనేశ్వరి దేవి దంపతుల గారాల పుత్రుడుగా జనవరి 12,1863 న జన్మించాడు.చిన్న నాటి నుండి దైవభక్తి,ఏకాగ్రత కలిగి ప్రతి ఒక్కరి మన్ననలు పొందాడు. ఆటలలో, చదువులలో ఏరంగాల్లో అయిన సులభంగా, ఉత్సాహంగా పాల్గొని అందరిలో ముందుండేవాడు. మహాగురువు రామకృష్ణ పరమహంస వద్ద చేరి వారికి ప్రియ శిష్యుడుగా మారి, వేదాంత, యోగా, తత్వశాస్త్రాలలోని అంశాలను ప్రజలకు విడమరిచి చెపుతూ వారిని మానసికంగా సిద్ధం చేసిన మహనీయుడు స్వామిజీ. స్వప్నంలో గురువు పరమహంస గారు ప్రత్యక్షంగా మాతా శారదా దేవి గారి ఆజ్ఞ మేరకు మొదటి సారిగా విదేశాలకు పయనమయ్యాడు.

1893 వ సంవత్సరం, సెప్టెంబర్ 11 వ తేదీ సోమవారం రోజు విశ్వమత మహాసభలు ప్రారంభం అయ్యాయి. ఆ సమావేశాల్లో మాట్లాడేటపుడు హృదయాంతరాలలో నుంచి వచ్చిన విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనతో, 'నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా...'అని మొదలుపెట్టగానే ఆ విశాల సమావేశములో ఉన్న అందరూ లేచి నిలబడి, కరతాళ ధ్వనుల వర్షం కురిపించారు. అప్పటి నుండి ప్రపంచానికి భారత్ యొక్క గొప్పతనం తెలియ వచ్చింది.

భారతదేశంలో స్వామి వివేకానంద పేరు తెలియని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. ఆధునిక యుగపు గొప్ప ఆధ్యాత్మిక వేత్తలలో ఆయనొకరు.

1893లో జరిగిన చికాగో సర్వమత సభలలో చేసిన ప్రసంగాలు మరియు తర్వాత నాలుగున్నర సంవత్సరాల పాటు అమెరికా, ఇంగ్లాండులో చేసిన ఉపన్యాసాల ద్వారా ఆయన భారతదేశానికి సంబంధించి అప్పటి వరకూ పాశ్చాత్యులకు ఉన్న భావనను మార్చడంలో చాలా వరకూ విజయం సాధించారు. ఆధ్యాత్మికతకు, సామరస్యానికి, గొప్ప సంస్కృతికి భారత భూమి నిలయమని వారు గ్రహించేలా చేశారు. భారతదేశం పై వారికి గల అభిప్రాయాన్ని మార్చి వారి మనస్సులో భారతదేశాన్ని గొప్పగా భావించేలా చేశారు; ఉన్నత స్థానాన్ని కల్పించారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తన అద్భుతమైన వాగ్ధాటితో, ప్రసంగ పరంపరలతో భారతావని ఉత్కృష్ట సంస్కృతి, వారసత్వ సంపద గురించి ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యాన్ని నింపారు. ఆత్మ విశ్వాసాన్ని ఆశావహ దృక్పథాన్ని పెంపొందించి అణగారిన జనులను ఉద్ధరించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. ఆధునిక భారతదేశంలో పేదల అభ్యున్నతికై పాటుపడమని బోధించి వివిధ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రప్రథమ యతివరేణ్యుడు వివేకానంద. రామకృష్ణ మఠం స్థాపించి అందరి అవసరాలకు బాసటగా నిలిచిని గొప్ప వ్యక్తి స్వామిజీ.

అమెరికా మరియు విదేశాల్లో తన ప్రసంగంద్వారా ఎందరినో ఆకట్టుకొని భారతదేశమునకు తిరిగి వచ్చిన తర్వాత ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ... నా ప్రియాతిప్రియమైన ప్రజలారా... భారతదేశ ముద్దు బిడ్డలారా.... అమృత పుత్రులారా... ఋషి బిడ్డలారా... నేడు జరుగుతున్న సన్మానమూ, మర్యాద, ఏ రాజకీయ నాయకుడికో, ఏ వ్యాపారవేత్తకో, ఏ కళాకారుడికో, ధనవంతుడికో జరుగుతున్నది కాదు. రేపటి రోజు భోజనం ఉంటుందో లేదో తెలియని, భగవంతుడినే హృదయంలో నింపుకుని జీవించే ఒక దేశ దిమ్మరియైన సన్యాసికి జరుగుతున్నది.

భారతదేశం యొక్క ఆయువు పట్టు దాని ఆధ్యాత్మికతా, భగవన్మయ జీవనంలోనే ఉన్నదనదానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం మరొకటి ఉండదు. లేవండి! మేల్కోండి! మనుష్యులవ్వండి! మనం బానిసలమనీ, ఎందుకూ పనికిరాని వారమనీ, మన పూర్వీకులు చెప్పినదంతా హాస్యాస్పదమనీ ఎవడో బయటివాడు వచ్చి చెప్పగానే నిజమేనని నమ్మి వాడి బూట్లు తుడవడం ఎంత హేయం! ఎంత దయనీయం! నా భారతదేశ యువ కిశోరాల్లారా, నా ఆశలన్నీ మీ పైనే ఉన్నాయి. మీరు అనంత శక్తి సంపన్నులు. దేన్నైనాసరే సాధించే శక్తి యుక్తులు మీలో ఉన్నాయి. మీరు గొర్రెలని అనుకోవద్దు. సింహాలు మీరు. మీరు లేచి జూలు విదిలించి ఒక్కసారి గాండ్రిస్తే కుయుక్తులతో నక్కలవలె చుట్టు ముట్టిన బలహీనతలన్నీ దుష్ట శక్తులన్నీ మిమ్మల్ని చూసి, మీ సింహ నినాదం విని, గుండెలు జారి పారిపోతాయి. లేవండి! మేల్కోండి! గమ్యం చేరేవరకూ విశ్రమించకండి! అని పిలుపునిచ్చారు.

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాశక్తులను, లక్ష్య సాధనలో సైతం చూపించడమే విజయారహస్యం అని,మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి.బలహీన పరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండని ఎన్నోమార్లు యువతకు వెన్నుతట్టిన యువ నేత స్వామి వివేకానంద.మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారని,బలహీనులమని భావిస్తే ,బలహీనులే అవుతారని,శక్తిని స్మరిస్తే శక్తిమంతులు అవుతారని యువతకు సందేశమిచ్చిన హిందు కర్మయోగి స్వామి వివేకానంద..సమస్త శక్తి మీలోనే ఉంది.అసమర్థులమని భావించకండి. మీరు ఏమైనా చేయగలరు,అన్నింటిని సాధించ గలరని ప్రతి రంగంలో ముందు ఉండాల్సింది యువతేనని ప్రోత్సహిస్తూ వారిని కార్యోన్ముఖులను చేసాడు స్వామి వివేకానంద.

'లేచి నిలబడు, ధైర్యం వహించు,బలవంతుడివికా, భాధ్యతనంతా నీ భుజాలపైనే వేసుకొని,నీ విధికి నీవే కర్తవని తెలుసుకో.నీకు కావాల్సిన బలం,సహాయం అంతా నీలోనే ఉంది.అందుకే నీ భవితవ్యాన్ని నీవే నిర్మించుకో' అని యువత శక్తి సామర్థ్యాలను గుర్తింపచేశాడు స్వామి వివేకానంద.బలమే జీవనం,బలహీనతే మరణం.బలం సంక్షేమాన్ని,అంతమే లేని జీవితాన్ని,అమరత్వాన్ని ప్రసాదిస్తుందని,బలహీనత అంతులేని శ్రమను,దుఃఖాన్ని కలిగిస్తుందని అదే బలహీనత మరణమని ఎన్నో మార్లు తన ప్రసంగాల్లో తెలియ చేసిన యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

మొదట మన లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి.తర్వాత దాన్ని ఆచరణలో పెట్టె మార్గాలను అన్వేషించాలని యువకులకు ఉద్బోధ చేసిన గొప్ప వక్త స్వామి వివేకానంద.

దృఢ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయని, వీటిని ఆయుధాలుగా గ్రహించిన వారు కొద్దిమందే అయినా, అన్ని విఘ్నాలను ఎదుర్కొని నిలువగలిగారని ఎల్ల వేళలా నిలువగలుగుతారాని తెలియచేసిన విద్యావేత్త స్వామి వివేకానంద.

ఆధునిక యవతరానికి స్వామీజీ మాత్రమే ఆదర్శం. ఆయన జీవిత కాలం ముప్ఫై తొమ్మిది సంవత్సరాల ఆరునెలలు. ఇంతటి స్వల్ప జీవితంలోనే ఆయన ఎంతో సాధించారు. మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి, ఆధ్యాత్మికోన్నతికీ తన యౌవన జీవితంతోనే ఇంతగా కృషిచేసినవారు చరిత్రలో కొద్దిమంది మాత్రమే ఉన్నారు.అందులో ప్రథముడు స్వామి వివేకానంద.

భరత మాత దాస్యశృంఖలాలు తెంచడానికి మా దేశపౌరులు సిద్ధంగా ఉన్నారు. స్వాతంత్రం అనంతరం దేశపతిష్ఠత కోసమే తన తపన అని ఎన్నోమార్లు తెలియ చేసిన గొప్ప వక్త.

స్వామీజీ తన జీవితాంతం ఎంతో శ్రమపడి కష్టపడి పని చేశారు. తుదకు స్వామిజీ భౌతిక జీవితం ముగిసింది. కానీ ఆయన పని కొనసాగుతూనే ఉంది. లేవండి! మేల్కొనండి! గమ్యం చేరే వరకూ విశ్రమించకండి! అని తన దేశ ప్రజలకి పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగాలలో ఉన్న జ్ఞానాన్ని ,ఇచ్చిన ధైర్యాన్ని ఉపయోగించుకొని మొదలైన నవ భారత నిర్మాణం, దేశానికి స్వాతంత్రం రావడంతోనే కాక ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది....ఇప్పుడు యువత చేతుల్లోనే మన భవిత ఉన్నదనేది వాస్తవం...ఆధునికత వైపు పరుగులు పెడుతున్న నేటితరం యువత ఆధునికత అంటే నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక స్పృహ అనే విలువల పట్ల తిరస్కార భావం కాదని తెలీసుకొని,

భారతదేశ సాంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని, భారతజాతి నిండు గౌరవాన్ని కాపాడుకోవాలన్న తపనతో,ప్రతికులా ప్రాబల్యాలకు లోనుకాకుండా,శక్తిని, ఉత్సాహాన్ని, దేశ భక్తిని, ఆత్మవిశ్వాశాన్ని కలిగించిన వ్యక్తి స్వామి వివేకానంద అని యువత గుర్తించింది.

ఎందరికో జ్ఞానోదయం కలిగించి ,ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి,భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్యజ్ఞాని స్వామిజీ.

నేను నా శరీరాన్ని వదిలిపెట్టినా,నేను పూర్తిచేయవలసిన కార్యాలను పూర్తి చేసే విదంగా రాబోవు తరాల వారిని కార్యనిర్వహణ కొరకు ప్రేరేపిస్తుంటాను.' అని చాలా సందర్భాల్లో ఆశాభావం వ్యక్తం చేసిన మాటను నిజం చేసి ,దేశ అభివృద్ధికి బాటలు వేయవాల్సిన యువత నడుం బిగించాల్సిన అవసరం ఉంది..

**- గడప రఘుపతిరావు**
9963499282



# కాలదోషం పట్టిన కంఠస్థ విధానం విడనాడాలి



ప్రపంచం విజ్ఞాన రంగంలో ఎంతో ముందుకు దూసుకుపోతున్నది. ఇతర గ్రహాలపై అన్వేషణ కొనసాగుతున్నది. భారతదేశం కూడా సూర్యచంద్రాదులపై పరిశోధనలు చేస్తున్నది. అంతరిక్షంలోను, అణు, సాంకేతిక రంగాల్లోను దేశం ముందుకు దూసుకు పోతుంటే, ఇంకా మన విద్యావ్యవస్థలో పరిశోధనాత్మకతకు, సాంకేతికతకు తావివ్వకుండా కంఠస్థంతో విద్యార్థులు కాలం నెట్టుకురావడం దేనికి సంకేతం? కృత్రిమ మేథస్సు ఉగ్రూతలూగిస్తూ ఉరకలేస్తుంటే, సాంఘిక మాధ్యమాలు వీక్షకులకు ఊపిరి సలపనీయడం లేదు. అంతరిక్షంలో అద్భుతాలు జరుగుతున్నాయి. స్పేస్‌వాక్ చేసి, అంతరిక్షయానంలో ఎదురైన ఆటంకాలను అవలీలగా జయించి, విజేతగా భూమికి అడుగిడిన సునీతా విలియమ్స్ సాహసాన్ని చూసాం. అంతరిక్షంలోకి అడుగిడిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా కు శుభాసీస్సులందించాం. విజ్ఞానం ఇంతగా వికసించి, గ్రహాంతర యానానికి దారులు వెదుకుతుంటే, ఇంకా మనం విద్యావ్యవస్థను మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. బట్టీ చదువులకు స్వస్తి చెప్పలేకపోతున్నాం. ఇంకా మార్కులు, ర్యాంకులంటూ మూస పద్ధతిలోనే పయనిస్తున్నాం. బండెడు పుస్తకాలను విద్యార్థులకు అంటగట్టి, ఫీజుల పేరుతో మోయలేని ఆర్థిక భారాన్ని తల్లిదండ్రుల నెత్తిన పెట్టడం భావ్యమా? మారుతున్న కాలానికి అనుగుణం గా చదువుల్లో గుణాత్మకమైన మార్పు రావాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలి. విద్యా బోధనలో సులభమైన పద్ధతులు అందు బాటులోకి వచ్చాయి. వాటిని అందుకుని నాణ్యతా ప్రమాణాల గల విద్యను భావితరాలకు అందించాలి. విద్యార్థులకు ఉపాధ్యా యులకు మధ్య గల సంబంధం కేవలం తరగతి గదులకే పరిమితమయ్యే గురుశిష్యుల సంబంధం మాత్రమే కారాదు. విజ్ఞానాన్ని ప్రపంచం నలుచెరగులా వ్యాపింప చేసి, అభివృద్ధికి ఆలంబనగా ఉండాలి. ఉపాధ్యాయులు నవ ప్రపంచ నిర్మాతలు. విద్యార్థులకు మార్గ నిర్దేశకులు. విశ్వానికి వెలుగు రేఖలు ఉపాధ్యాయులు.

అజ్ఞానమనే అంధకారం నుండి విజ్ఞానమనే వెలుగు వైపు పయనింప చేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకే సాధ్యం. ప్రపంచ ప్రగతి సాధన ఉత్తమ విద్య ద్వారా మాత్రమే సాధ్యం. ఉత్తమ నాణ్యతా ప్రమాణాలను నెలకొల్పి, విద్యార్థుల్లో నైపుణ్యానికి ఉపాధ్యాయులు,విద్యావంతులు కృషి చేయాలి. కంఠస్థం చేయడం వలన కంఠశోష తప్ప ప్రయోజనం శూన్యం. దురదృష్టవశాత్తూ ఈనాటికీ ప్రపంచంలో చాలా మందికి విద్యావకాశాలు గగనకుసుమంలా మారాయి. కొన్ని దేశాల్లో స్త్రీలకు చదువుకునే స్వేచ్ఛ లేదు. మరికొన్ని దేశాల్లో కుటుంబాల ఆర్థిక స్థోమత సరిగా లేక, చదువుకునే అవకాశాలు మృగ్యమైపోతున్నాయి. బాలకార్మికులుగా, వీధి బాలల్లా మిగిలి పోతున్నారు. ఒక వైపు ఇలాంటి పరిస్థితులు తాండవిస్తుంటే,మరొకవైపు నాణ్యత లేని విద్యల వలన ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతున్నాయి. నైపుణ్యం లోపించిన చదువుల వలన ప్రపంచ ప్రగతి సాధ్యం కాదు. ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేసి, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి. విద్య యొక్క ప్రాధాన్యతను పెంచే విధంగా సంస్కరణలు రావాలి. నిజమైన విద్యకోసం పాటుపడాలి. సాంకేతిక రంగాన్ని చెడిపోవడానికే వినియోగించుకునే ధోరణిలో మార్పురావాలి. వాస్తవ ప్రపంచానికి దూరంగా, రంగుల లోకంలో విహరిస్తూ పెనుభారంగా తయారైన యువత చాలా ప్రమాదకరం. ఊహల్లో తేలియాడే ప్రపంచానికై ఉగ్రూతలూగుతున్న యువతను సంస్కరించాలి. తల్లిదండ్రుల దృక్పథంలో కూడా మార్పు రావాలి. తల్లి దండ్రులు ఒక స్థాయి వరకు తమ పిల్లలను తమ వద్దే పెరిగేటట్టు చూడాలి. బాహ్య ప్రపంచంలోని అనైతిక ధోరణుల వలన కలిగే పర్యవసానాల గురించి తెలియచెప్పాలి. ఉపాధ్యాయులు కూడా తమ వృత్తి పట్ల అంకితభావం ప్రదర్శించాలి. భావితరాలను మేథాశక్తి సుసంపన్నులు తయారు చేయడంలో వారి పట్ల గురుతరమైన బాధ్యత ఉంది. ఉపాధ్యాయుల ఆలోచనల్లోనే నిజమైన దేశ నిర్మాణం ఆధారపడి ఉంది. అందుకోసం ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులై శ్రమించాలి. విద్యార్థు లను ఉన్నతంగా తీర్చిదిద్దాలి. ఉపాధ్యాయుల ధ్యాసంతా విద్యార్థులపై కేంద్రీకరించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. విద్యార్థులను నాణ్యమైన విద్యాబోధనతో అన్నిరంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడం. విలువలతో ఉత్తమపౌరులుగా తయారు చేయడం. అందుకు అనువైన పరిస్థితులను ప్రభుత్వాలు నెలకొల్పాలి.ఏ దేశమైనా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే ప్రజలకు సజావుగా జీవించడానికి మౌలిక సదుపాయాలు అందుతాయి. జీవనోపాధి లభిస్తుంది. ప్రజలంతా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా జీవించ గలిగినపుడే అలజడులు,అరాచకాలు తగ్గి ప్రశాంత వాతావరణం ఏర్పడి, శాంతి భద్రతలు నెలకొని, దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. వీటన్నింటికీ మూలాధారం విద్య. విద్య అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. విద్య ద్వారా సాధించలేనిదంటూ ఏదీ లేదు. అలాంటి నాణ్యమైన విద్య దేశంలో ప్రతీ ఒక్కరికీ అందాలి. సక్రమమైన విద్యల వలన విద్యావంతులు విభిన్న రంగాల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి దేశాభివృద్ధిని శిఖరాగ్ర భాగంలో నిలబెట్టగలరు. ప్రపంచ గతిని మార్చగలరు. మనిషి మానసిక ఎదుగుదలకు, వ్యక్తిత్వ వికాసానికి విద్య అవసరం.విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావాలి. విద్యార్థులను అన్నిరంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే మనం ఆశించిన నిజమైన దేశాభివృద్ధి, ప్రపంచాభివృద్ధి సాధ్యపడుతుంది. విద్యార్థులంతా చక్కని విద్యా సాధనతో విలువలతో కూడిన నవ ప్రపంచాన్ని సృష్టించాలి. వర్తమాన సమాజం తప్పుటడుగులేస్తున్నది. తప్పటడుగుల దశలో పిల్లలను సరిదిద్దకపోవడమే ఇందుకు కారణం. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించాలంటే వారిలో విలువలను పెంపొందించాలి. 'సంపాదన కోసమే చదువు' అనే భ్రమను తొలగించాలి. ఆహ్లాదకరమైన కుటుంబ వాతావరణంలో పిల్లలు పెరగాలి. కుటుంబ వాతావరణం సరిగా లేకపోతే బాలల భవితవ్యం ఆగమ్యగోచరమౌతుంది.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463



# నిరుద్యోగ యువతకు శుభవార్త

- **ఉచితంగా డేటా ఇంజినీరింగ్**

**కరీంనగర్/వరంగల్, జూలై 3(మనం బ్యూరో):** శ్రీసత్యసాయి సేవా సంస్థ నిరుద్యోగ యువత కోసం శ్రీసత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత డేటా ఇంజినీరింగ్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సుకు 2022-25 మధ్య బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సేతు.ఏఐలో నమోదు చేసుకోవచ్చు. లేదా 90523 72023కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్క్యుఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. తరగతులు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో జరుగుతాయి. కోర్సు పూర్తయిన తరువాత ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందిస్తారన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్ రమేశ్

**సుల్తానాబాద్, జూలై 3(మనం న్యూస్):** సుల్తానాబాద్ పట్టణంలోని కాలనీలలో, మెయిన్ రోడ్‌లలో వర్షపు నీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.రమేష్ శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. గురువారం సుల్తానాబాద్ మెయిన్ రోడ్‌లో, వార్డులలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి వర్షపు నీరు ఎక్కడ నిలవకుండా బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా పేరుకుపోయిన మట్టిని ఇసుక దిబ్బలను మున్సిపల్ సిబ్బందిచే తొలగించారు. కాలనీలో సైతం వర్షపు నీరు గాని మురుగునీరు గాని నిలువకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు ఈ సందర్భంగా సిబ్బందికి తెలియజేశారు. అలాగే, జడ్పీ



హెచ్ఎస్ బాలుర పాఠశాలతో పాటు మార్కండేయ కాలనీలోని ఎస్సీ, బీసీ హాస్టల్ లను పరిశీలించారు, పిల్లలకు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజే శారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది శ్రావణ్ కుమార్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలలో ప్రసవాలు జరిగేలా కార్యాచరణ

- **అవెన్యూ ప్లాంటేషన్ కింద ఎత్తైన మొక్కలు నాటాలి**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, జూలై 3(మనం ప్రతినిధి):** జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాలకుర్తి మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించారు. పాలకుర్తి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, రామారావు పల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రం, జయ్యారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎస్సీ సంక్షేమ హాస్టల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పుట్నూరు గ్రామంలో ఉన్న కేజీబీవీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాలకుర్తి ఎంపీడీవో కార్యాలయం, కన్నాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. రాబోయే మార్చి నాటికి ప్రతి ప్రాథమిక విద్యార్థి చదవడం, రాయడం , చదివింది అర్థం చేసుకోవడం, బేసిక్ మ్యాథ్స్ చేసేలా తయారు చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థుల పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. మండలంలో పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని



అన్నారు. కొత్తపల్లి ఎం.పి.యూ.పి.ఎస్ లో అదనపు వాష్ బేసిన్, ఇంటర్ లాకింగ్ టైల్స్ వేయాలని, జయ్యారం జడ్పి.హెచ్.ఎస్. లో గ్రౌండ్ లెవెలింగ్, స్టేజ్ నిర్మాణానికి ప్రతిపాదనలు అందించాలని, మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జయ్యారం ఎస్సి హస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పుట్నూరు లో మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎస్సి హస్టల్ అదనపు డార్మటరీ, డైనింగ్ హాల్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జయ్యారం గ్రామ పంచాయతీ తాత్కాలికంగా పాఠశాలలోని అదనపు తరగతిలోకి మార్చాలని అన్నారు. కేజీబీవీ పుట్నూరు లో అదనపు డ్రైనేజీ లైన్, లైటింగ్ , సిసి కేమేరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరగాలని అన్నారు. 400 నుంచి 600 చదరపు గజాల లోపు ఇంటి నిర్మాణం ఉండాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సకాలంలో పేమెంట్ జరిగేలా చూడాలని అన్నారు. పుట్నూరు పి.హెచ్.సి లో సాధారణ ప్రసవాలు జరగాలని అన్నారు. గర్భిణీ మహిళలను 100 శాతం ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు. ఎన్.సి.డి సర్వే పక్కగా నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించాలని, డయాగ్నోస్టిక్ హబ్ వద్ద వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు రోగుల నుంచి శాంపిల్స్ సేకరణ, తరలింపు పక్కాగా జరిగేలా చూడాలని అన్నారు. అయుష్ విభాగంలో వస్తున్న ఔట్ పేషంట్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సీజనల్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. పి.హెచ్.సి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు కు ప్రతి మండల అగ్రికల్చర్ పరిధిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు సాగు జరగాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం పనులు వేగవంతం చేయాలని అన్నారు.

రోడ్ల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ లో ఎత్తైన మొక్కలు నాటాలని అన్నారు. మండలంలోని నీటిపారుదల కాలువలలో సెంటు తొలగింపు పనులు పూర్తి చేయాలని అన్నారు. మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పుట్నూరు లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థితిగతుల పై నివేదిక అందించాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎం.పీ.డీ.వో. రామ్మోహన్ చారి, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఎం.ఈ.ఓ. విమల, హౌసింగ్ డీఈ దస్తగిరి, ఏఈ పంచాయతీ రాజ్ రుషి కేష్, ఎంపీ ఓ సుదర్శన్, వైద్య అధికారులు డాక్టర్ సాయి సూర్య, కేజీబీవీ ప్రత్యేక అధికారి డి స్వరూప, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంత కుంట మండల సమాఖ్యకు ఆత్మ నిర్భర్ సంఘటన్ అవార్డు

- **అభినందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**రాజన్న సిరిసిల్ల, జూలై 3(మనం ప్రతినిధి):** స్వయం సహాయక సంఘాలకు విశిష్ట సేవలందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటున అందిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైంది. వచ్చే నెల ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న అవార్డుల ప్రధాన ఉత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానం అందింది. జిల్లాలోని మండల సమాఖ్య జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక అవడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. వారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ప్రత్యేకంగా అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంటలోని ఆదర్శ మండల సమాఖ్య ఎస్‌హెచ్‌జీ స్వయం సహాయక సభ్యులకు సేవలందిస్తోంది. ఈ మండల సమాఖ్య పరిధిలో 46 విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ)లు ఉండగా 1103 స్వయం సహాయక సం ఘాలు 11వేలకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆదర్శ మండ ల సమాఖ్య ఆధ్వర్యంలో గత ఐదేళ్లకు పైగా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణాలు అందించడం వాటిని క్రమం తప్పకుండా చెల్లించేలా చూడటం సభ్యులకు భీమా కల్పించడం తది తర సేవలు అందిస్తుంది. ఎస్‌హెచ్‌జీ సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణించేలా నిరంతరం శిక్షణ, సలహాలు అందిస్తున్నారు. అలాగే సామాజిక బాధ్యత కింద అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, నీటి వనరుల సంరక్షణ ప్లాస్టిక్ వినియోగించవద్దని, సైబర్ మోసాలకు గురి కావద్దని తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు మహిళా సంఘాల సభ్యులు జీవనోపాధి పెంచే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమాఖ్యల పనితీరును పరిశీలించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన



జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో భాగంగా ఉత్తమ సేవలందిస్తున్న మండల సమాఖ్యలను గుర్తించి 'ఆత్మ నిర్భర్ సంఘాతన్ అవార్డు 2024' ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి 22 మహిళా సంఘాలను ఎంపిక చేసింది. అవార్డులకు దేశంలోని ఆరు రీజియన్ల పరిధిలో 22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు(సీఎల్ఎఫ్)లు ఎంపిక కాగా.. సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య రెండో స్థానంలో నిలిచి ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖకు లేఖ అందింది. రానున్న ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద నిర్వహించనున్న అవార్డుల ప్రదాన ఉత్సవానికి రావలసిందిగా ఆహ్వానం అందింది. ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు అక్కడికి వెళ్లి అవార్డును స్వీకరించనున్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి: జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**జగిత్యాల, జూలై 3(మనం ప్రతినిధి):** రాయికల్ మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం నిగురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓ పి. సేవలు, ఐపీ సేవలు రికార్డ్స్, ల్యాబ్ రికార్డ్స్, ఐపీ రికార్డ్స్, మెడికల్ ఫార్మసి జిల్లాకలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి వైద్య సేవలను గురించి నేరుగా పేషంట్లని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు మెరుగు



పరచాలని డాక్టర్లు సమయ పాలన పాటించాలని. అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు డైట్ ఫుడ్ అందించాలి పాలు ఇడ్లీ బ్రెడ్ ఫ్రూట్స్ పోషక ఆహార పదార్థాలు అందించాలన్నారు. ముందస్తు వర్షాకాలం సీజనల్ వ్యాధులు పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు డెంగ్యూ మలేరియా ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రంగా.ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.

# పచ్చదనం పెంపుదలకు కన్హా ఆశ్రమంతో ఒప్పందం

**గోదావరిఖని, జూలై 3(మనం న్యూస్):** సింగరేణి సంస్థ గనుల ప్రాంతాలలో మొక్కలను నాటడానికి, పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపట్టడానికి ప్రముఖ యోగా, పర్యావరణ పరిరక్షణ సంస్థ అయిన హార్ట్ ఫుల్ నెస్ ఇన్స్టిట్యూట్ (కన్హా ఆశ్రమం) వారితో సింగరేణి సంస్థ ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల ఆదేశాలకు ప్రకారం గురువారం హైదరాబాదుకు సమీపంలోని కన్హా శాంతి వనం ఆశ్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పందంపై సింగరేణి సంస్థ నుండి సిఎండి ఎన్ బలరామ్, కన్హా ఆశ్రమం డైరెక్టర్ సంజయ్ సెహగల్ సంతకాలు చేశారు. ఇదే తరహా ఒప్పందాన్ని కోల్ ఇండియా కూడా కన్హా ఆశ్రమంతో కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం సింగరేణి ప్రాంతంలో కన్హా ఆశ్రమం ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున మొక్కలను నాటడం, పెంచడంతో పాటు ఎకో పార్కులను నిర్మించడం, వర్షారణ్యాలు, హరిత కంచెల ఏర్పాటు వంటి పర్యావరణహిత చర్యలు చేపట్టనున్నారు. ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంపుల మీద, ఖాళీ ప్రదేశాలలో, బొగ్గు రవాణా బెల్టులకు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచనున్నారు. ప్రతీ ప్రదేశంలో నాటిన మొక్కలు 90 శాతం వృక్షాలుగా పెరగడానికి కృషి చేస్తారు. ఈ కార్యక్రమాలలో సమీప గ్రామాల ప్రజలను కూడా భాగస్వాములను




చేస్తూ, వారి అవసరాలకు, ఉపాధి కల్పనకు కూడా కన్హా ఆశ్రమం పనిచేస్తుంది. సింగరేణి సంస్థ ఇప్పటికే పెద్ద ఎత్తున మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తనవంతుగా కృషి చేస్తుంది. 14,900 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 7 కోట్ల మొక్కలను నాటి వాటిని వనాలుగా పెంచుతోంది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల ఆదేశం మేరకు ఈ చర్యలను మరింత ఉధృతం చేసేందుకు కన్హా ఆశ్రమంతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు సింగరేణి సంస్థ సిఎండి పేర్కొన్నారు. సంస్థ విస్తరించి ఉన్న ఆరు జిల్లాలలో అవసరమైన చోట ఈ తరహా పర్యావరణహిత చర్యలు చేపట్టడానికి కన్హా ఆశ్రమ సహకారాన్ని తీసుకోవడానికి ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తుంది అన్నారు. కన్హా ఆశ్రమం వారు యోగా కార్యక్రమాలు, పర్యావరణహిత చర్యలను పెద్ద ఎత్తున చేపట్టి మంచి పేరును సాధించారని, ఈ సంస్థతో కలిసి సింగరేణిలో పర్యావరణహిత, సమాజహిత కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ కార్యదర్శి సతీష్ చంద్ర దూబే, బొగ్గు గనుల శాఖ అదనపు కార్యదర్శి రూపేంద్ర సింగ్ బ్రార్, సింగరేణి డైరెక్టర్ పా గౌతం పొట్రు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం అవసరం

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తా**
- **రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**రామగుండం, జూలై 3(మనం న్యూస్):** దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకలను అదే విధంగా పని చేయాలని అన్నారు రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఈ మేరకు ఎన్టీపిసిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలో రామగుండం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల, కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజక వర్గ ఎన్నికల పరిశీలకుడు సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకలను అదే విధంగా పని చేయాలని



అన్నారు. నా గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. వడ్ల కట్టింగ్ లేకుండా తడిచిన, రంగు మారిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు జరిగిందని, డివిజన్‌లో, గ్రామాలలో ఉండే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలు ఎప్పుడూ వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలతో ధైర్యంగా వెళ్ళి ఓటు అడగాలిని, ఎమ్మెల్యేగా నేను గెలవడానికి ఎంత కష్టపడ్డారో అదే విధంగా మీ గెలుపు కోసం నా శాయశక్తుల కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గం



**జగిత్యాల, జూలై 3(మనం ప్రతినిధి):** ఇటీవల జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్ లో టిడబ్ల్యూజేఎఫ్ మహాసభ నిర్వహించుకుని జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంజీవరాజు, కార్యదర్శి మెన్నేని రవీందర్రావులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జగిత్యాల పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకాలను మంజూరు చేయాలని కోరగా దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం యూనియన్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

## క్యాన్సర్ నియంత్రణకు ప్రణాళికా చర్యలు అవశ్యం

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, జూలై 3(మనం ప్రతినిధి):** క్యాన్సర్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోహిణి ఫౌండేషన్ ద్వారా 10 గ్రామాలలో పర్యటించి 2 వేలకు పైగా ప్రజలను క్యాన్సర్ స్క్రీనింగ్ చేశామని అన్నారు. ప్రజల అలవాట్ల ఆధారంగా పరీక్షలు నిర్వహించి 104 మందికి క్యాన్సర్ గుర్తించామని, వీరిలో 90 మంది స్టేజి 3, స్టేజి 4 దశలో ఉన్నారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, క్యాన్సర్ వల్నరబుల్ ఉన్న ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన పరీక్షలు చేయాలని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ రంగంలోని క్యాన్సర్ చికిత్స అందించే ఆసుపత్రులతో కోఆర్డినేట్ చేసుకుంటూ క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని అన్నారు. 30 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల వారిని ఎన్.సి.డి సర్వే లో భాగంగా నోటి క్యాన్సర్ లక్షణాలు పరిశీలించి,




అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. క్యాన్సర్ రోగులకు చికిత్స అందించిన తర్వాత మళ్ళీ చెడు అలవాట్లు బారినపడకుండా కౌన్సెలింగ్ అందించాలని అన్నారు. క్యాన్సర్ కేసులు గుర్తించిన రోగులకు ఆశా కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలని, సరైన చికిత్స తీసుకుంటూ అలవాట్లు మార్చుకుంటే నయం చేయవచ్చని భరోసా కల్పించాలని అన్నారు. కొత్త క్యాన్సర్ కేసులు రాకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో 8 లక్షల జనాభా ఉందని, 5 వేల వరకు క్యాన్సర్ కేసులు ఉండే ఆస్కారం ఉంటుందని, వీరికి ఎటువంటి చికిత్స అందించాలి, గుర్తింపు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం కీలకం

- **సిబ్బందిలో సామర్థ్యం, ప్రతిభను వెలికి తీసేందుకు పోలీసు డ్యూటీ మీట్**
- **రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ**

**గోదావరిఖని, జూలై 3(మనం న్యూస్):** రాష్ట్ర, జాతీయ స్థాయిలో రామగుండం కమిషనరేట్‌కు, కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్. ఈ మేరకు రామగుండం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ రెండవ రోజు పలు అంశాలపై అధికారులు, సిబ్బందికి డ్యూటీ మీట్ పోటీలను నిర్వహించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగాలైన డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టిమ్ పనితీరును రామగుండం పోలీస్ కమీషనర్



అంబర్ కిషోర్ ఝూ ప్రత్యేకంగా పరిశీలించారు. పోలీసు జాగిలాల నుండి గౌరవ వందనం అందుకున్న సీపీ, అనంతరం జాగిలాలు నేర స్థలంలో బాంబులను, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను ఏ విధంగా గుర్తిస్తాయని, డాగ్ హ్యాండ్లర్ ప్రత్యక్షంగా చూపించారు. బాంబు డిస్పోజల్ ముఖ్యమైన ప్రదేశాలను ఏ విధంగా సెర్చ్ చేయడం జరుగుతుందని, డీప్ సెర్చ్ మెటల్ డిటెక్టర్ ద్వారా భూమి లోపల పాతిపెట్టిన మందుగుండు సామాగ్రిని, అనుమానాస్పదమైన, ప్రమాదకరమైన ఇనుప వస్తువులను ఏ విధంగా నివృత్తి చేయడం జరుగుతుందని బిడి టీమ్ సిబ్బంది చేసి చూపించారు. ఈ సందర్భంగా సిపిఐ మాట్లాడుతూ... పోలీసు అధికారులు, సిబ్బందిలో సామర్థ్యం, ప్రతిభను వెలికితీసేందుకు పోలీసు డ్యూటి మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం చాలా కీలకమని, కాళేశ్వరం జోన్ స్థాయి డ్యూటీ మీట్ లో 91 మంది అధికారులు, సిబ్బంది కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటో-వీడియోగ్రఫీ విభాగాల్లో పాల్గొని వారు కనబరిచిన తమ ప్రతిభ, సామర్థ్యం ఆధారంగా రాష్ట్ర స్థాయిలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో నిర్వహింబడే తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ ఎంపిక చేయడం జరుగుతుందని, పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రదర్శనను అందించాలని ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరపున, రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్ కు, కాళేశ్వరం జోన్ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, గోదావరిఖని ఏసిపి ఎమ్ రమేష్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏఆర్ ఏసిపి ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బాబురావు, ఆర్ఐలు దామోదర్ వామనమూర్తి శ్రీనివాస్ మల్లేశం, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల సాధనకై నేడు ఛలో సెక్రటేరియట్

- **ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి నోటిఫికేషన్స్ వేయాలి**
- **డీవైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కమిటీ**

**పెద్దపల్లి, జూలై 3(మనం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి ఉద్యోగాలకై నోటిఫికేషన్స్ వేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిర్యద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జూలై 4న జరిగే సెక్రటేరియట్ ముట్టడికి డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, యువత హాజరై చలో సెక్రటరియేట్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గొర్రెంకల సురేష్, కొంటు సాగర్‌లు పిలుపునిచ్చారు. గురువారం పెద్దపల్లి శాంతినగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటి వరకు కేవలం గత ప్రభుత్వ నోటిఫికేషన్లతో కలిపి 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ




చేసింది. ఇంకా 1,45,000 ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. అదే విధంగా జాబ్ క్యాలెండర్‌ను నామమాత్రంగా ప్రకటించి అమలు చేయడం లేదన్నారు. గత బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. స్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ని ప్రకటించి అమలు చేయాలని, తక్షణమే ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్స్ వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు నిరుద్యోగ యువతకు ప్రతి ఒక్కరికి 4000 రూపాయలు నిరుద్యోగ భృతిని ఇస్తామని చెప్పి నేటికీ బడ్జెట్లో నిధులు కేటాయించకుండా అసలు నిరుద్యోగ భృతి అనే పేరు ప్రస్తావించకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందన్నారు.

# అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు
- హుస్నాబాద్ రింగ్ రోడ్డుకు మ్యాపింగ్ చేయాలి
- అనుమతులు ఇచ్చి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి



**హుస్నాబాద్, జూలై 3(మనం న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పను ల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. పట్టణ కేంద్రంలో గురువారం ఆయా శాఖల మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ హుస్నాబాద్ రింగ్ రోడ్డు ప్లానింగ్ చేసి మూలమలుపులు ఎక్కువగా లేకుండా వాహనదారులు సులభంగా వెళ్లేందుకు మ్యాపింగ్ చెయ్యాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించడం జరిగిందన్నారు.డిగ్రీ కళాశాలలో పి.జి.కోర్సులు (ఎం.కామ్ కోర్సు) 60 సీట్లు మంజూరైంది అని తెలిపారు. హుస్నాబాద్ టూ కొత్తపల్లి నాలుగు వరుసల రహదారి నిర్మాణం పనులు ఆయా శాఖల అధికారులు అనుమతులు ఇచ్చి టెండర్ విధానం పూర్తి చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు నరకడం, తొలగించడం ఈ నెల చివరి కల్లా పూర్తి చేయాలన్నారు. రోడ్డు పనులు మొదలవ్వాలని ప్రతి పని ఒక టైం ఫ్రేమ్ పెట్టుకుని పనిచేయాలని ఆర్ అండ్.బి. అధికారులను ఆదేశించారు. అంతక్కపేట లో 220 కె.వి. విద్యుత్ జంక్షన్ 10 ఎకరాల స్థలం తహసీల్దార్ దగ్గర రెడీ గా ఉంది, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ఆయా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మాపూర్ వద్ద శాతవాహన ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించిన స్థల సేకరణ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని అనుమతులు రాగానే ఇంజనీరింగ్ అధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. కొత్తచెరువు బండ్ డెవలప్మెంట్ కోసం ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇవ్వాలని సూచించారు. రంగనాయక సాగర్ నుంచి నీటిని అందించేందుకు బస్వాపూర్, పోరెడ్డిపల్లిలో కాలువల భూసేకరణ ప్రక్రియ అవార్డు స్టేజ్ పూర్తయ్యిందని తెలిపారు. హుస్నాబాద్ నుండి జనగాం వరకు నిర్మించే రోడ్డు నిర్మాణం ప్రపోజల్ స్టేజ్ లో ఉంది, నాక్ సెంటర్ కోసం స్థల సేకరణ పూర్తయిందన్నారు. హుస్నాబాద్‌లో ఆర్టీఏ యూనిట్ ఆఫీస్ కోసం స్థలం అందించామని ప్రపోజల్ స్టేజ్ ఉందని తెలిపారు.150 పడకల ఆసుపత్రి, కోహెడలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్క్, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సింగరాయకొండ, ప్రాజెక్టు ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు అందించడం కోసం కాలువల భూసేకరణ పనులు, స్పోర్ట్స్ స్టేడియంలో ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్, జిమ్ ప్రపోజల్ తదితర అభివృద్ధి కార్యక్రమాల పై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ , ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి ఆటలు అవసరం

- భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి
- జీహెచ్ఎంసీ అధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ



**రామచంద్రపురం, జూలై 3(మనం న్యూస్):** సంపూర్ణ ఆరోగ్యానికి అందరికి ఆటలు ఎంతో అవసరమని భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సొసైటీలకు చెందిన యువకులకు, సభ్యులకు ఆటలకు అవసరమైన క్రీడా సామగ్రిని కార్పొరేటర్ సింధు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సొసైటీ ప్రతినిధులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓలు విధులను సక్రమంగా నిర్వహించాలి

- మంథని ఆర్డిఓ సురేష్




**రామగిరి, జూలై 3(మనం న్యూస్):** బీఎల్ ఓ లు తమకు అప్పగించిన పనులను సక్రమంగా నిర్వర్తించాలని మంథని ఆర్డిఓ సురేష్ అన్నారు. గురువారం కమాన్ పూర్ మండలంలోని నాగారం గ్రామంలో గల రైతు వేదిక లో తహసీల్దార్ ముస్త్యాల వాసంతి ఆధ్వర్యంలో బి ఎల్ వో లకు ఒక రోజు శిక్షణను మాస్టర్ ట్రైనర్ మెరుగు రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సురేష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా బీఎల్వోలకు ఈ నెల మూడో తేదీ నుండి 17వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు నమోదు చేయాలని అలాగే ఎవరైనా ఊరు విడిచి వెళ్ళిపోతే వారి పేరును తొలగించాలని పేర్కొన్నారు. ఎవరైనా మరణించిన వారు ఉంటే వారి పేర్లను సైతం తొలగించాలని స్పష్టం చేశారు. ప్రతి బూత్ లెవెల్ అధికారి ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించి వారి వివరాలను సేకరించాలని ఎవరైనా నమోదు గాని వ్యక్తులు ఉంటే వారి పేర్లను ఓటర్ లిస్టులో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలి

- వసతి గృహాల్లో అన్నిసౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి




**సిద్దిపేట, జూలై 3(మనం ప్రతినిధి):** సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం రోజున సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇంటర్మీడియట్, ఆయా సంక్షేమ శాఖల అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమీషన్ నుండి మంజూరైన నిధులను కళాశాలలకు పెయింటింగ్, టేబుళ్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. అత్యవసర తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని, ఇంజనీరింగ్ ఏజెన్సీ వారు కావాల్సిన ఎస్టిమేట్ తయారు చేయాలని సూచించారు. వివిధ కళాశాలలకు, రావడానికి బస్సు సౌకర్యం కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఆర్టీసి అధికారులతో సమావేశం నిర్వహించి కావాల్సిన రూట్లలో బస్సులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల మానవీయ కోణంలో ఆలోచించాలని, గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ తోపాటు పలు కళాశాలల్లో ఆకతాయిలు మద్యం తాగుతూ కిటికీలు, ఇతర వసతులు ధ్వంసం చేస్తున్నారని తెలువగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పోలీస్ అధికారుల ద్వారా పికెటింగ్ ఏర్పాట చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిఐఈఓ రవిందర్ రెడ్డి, డిఆర్డీఓ జయదేవ్ ఆర్య, డిబిసిడిఓ నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ప్రేమ లాంటిది.. అమర్నాథ్ అన్నదాన సేవా సమితి

- అమర్నాథ్ యాత్రికులకు అమృతాహారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న యాత్రికులు



**సిద్దిపేట రూరల్, జూలై 3(మనం న్యూస్):** అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సిద్దిపేట వారు అందిస్తున్న సేవలు అమ్మ ప్రేమ వంటివని అమర్నాథ్ యాత్రికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం అందరూ క్షేమముగా ఉండాలని ప్రజా క్షేమం కోసం ప్రారంభించిన అన్నప్రసాదం సేవా కార్యక్రమం భక్తుల కడుపులు నింపుతుంది. సిద్దిపేటకు చెందిన అమర్నాథ్ సేవా సమితి వారి అమర్నాథ్ యాత్రికులకు ఏర్పాటు చేసిన మూడు అన్నప్రసాద కేంద్రాల్లో రుచికరమైన తెలుగువారి బోజనాలు యాత్రికులు స్వీకరించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఐదు రోజులుగా దక్షిణాది భోజనం లేకుండా ఉన్న వారికి సిద్దిపేట అమర్నాథ్ అన్నదాన సేవా సమితి వారు బాల్తాల్ ప్రాంగణంలో తెలుగువారి భోజనం అందించడం చూసి లంగర్ నంబర్ చూసుకొని లంగర్ లోకి రాగానే ఇక్కడి ఆహారాలను చూసి అమ్మ ప్రేమను పంచుతున్నట్లుగా చక్కటి తెలుగు వారి రుచులు అందించడం వారి గొప్పతనమును కొనియాడారు. తమ ఆరు రోజుల ఆకలి తీర్చుకున్న సంతోషం కలిగిందని, వారు ఇక్కడ చేసిన ఏర్పాట్లు శుభకార్యాలలో నిర్వహించే విధముగా చక్కటి సోఫాలు, టీపాయిలు, రుచికరమైన ఆహారాలతో పాటూ వేడి నీళ్ళు, శుచి శుభ్రతతో కూడిన వడ్డింపు చాలా నచ్చిందని, యాత్రికులకు వెలకట్టలేని భోజనం అందించారని, అమరేశ్వరుడి ఆశీస్సుల వల్లే మీకు కలిగిందని, ఆ అమరేశ్వరుడి ఆశీస్సులతో మా యాత్రికుల ఆశీస్సులతో సేవా సమితి వారు, సిద్దిపేట ప్రాంతం వారు ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని దీవించారు. అమర్నాథ్ సేవా సమితిలో సమితి ఛైర్మెన్ చీకోటి మధుసూదన్, అధ్యక్షులు కాచం కాశినాథ్ కార్యవర్గ సభ్యులు చింత శ్రీనివాస్ సభ్యులు కార్తివాడ శ్రీకాంత్ ఉన్నారు.

# బహిరంగ సభను విజయవంతం చేయండి

- దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు



**జమ్మికుంట, జూలై 3(మనం న్యూస్):** ఈనెల 4న శుక్రవారం సాయంత్రం 4:00 గంటలకు ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నందున ఎల్బి స్టేడియంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్ని శాఖల మంత్రులు హాజరుకానున్నారు. 18 గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆత్మీయ సమ్మేళనానికి రావాలని కాంగ్రెస్ పార్టీ చరిత్రలో గ్రామ శాఖ అధ్యక్షులు కలవడం సువర్ణ అవకాశం అన్నారు. కేంద్రంలో మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఇప్పటి నుండే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా వచ్చి కాంగ్రెస్ పార్టీ కోసం అధికారంలోకి తేవడానికి కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు గోడిశాల పరమేష్, చిరంజీవి, గోపాల్ రెడ్డి ,శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం కొలతలు తెలపండి

- నష్ట పరిహారం పెంచాలి
- ఆర్డీవో కార్యాలయం ఎదుట మిట్టపల్లి వాసుల నిరసన



**సిద్దిపేట అర్బన్, జూలై 3(మనం న్యూస్):** సిద్దిపేట నుండి హుస్నాబాద్ కు వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ వద్ద రంగదాంపల్లి సమీపం నుండి మిట్టపల్లి వరకు నిర్మిస్తున్న బ్రిడ్జ్ నిర్మాణం పై అధికారులు పూర్తిస్థాయిలో నోటీసులు ఇవ్వకుండానే కొలతలు తెలపకుండానే నష్టపరిహా రం తీసుకొమ్మని చెప్పడం సమంజసం కాదని పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ సంతోష్ లు అన్నారు. గురువారం సిద్దిపేట ఆర్డిఓ కార్యాలయం ఎదుట బ్రిడ్జి బాధితులతో కలిసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతు రోడ్డుమధ్య నుండి 50 ఫీట్ల వరకు గతంలో మార్కింగ్ ఇచ్చినప్పుడు నిరసన కార్యక్రమాలు చేపడితే రోడ్డు వెడల్పు తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఎంతవరకు తగ్గించారో ఇంత వరకు బాధితులకు తెలుపలేదని అన్నారు. భూమి మార్కెట్ ధర గజానికి 2100 ఉంటే ప్రభుత్వం రూ.300లు ఇస్తామనడం ఎంతవరకు న్యాయమని అన్నారు. నష్టపరిహారం ఎకరాకు లెక్క గట్టి ఇస్తున్నారని, కానీ, గజానికి లెక్క కట్టి ఇవ్వాల్సి ఉందన్నారు. అనేక ప్లాట్లకు నాలా కన్వర్షన్ పర్మిషన్ కూడా తీసుకోవడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ ఎకరా చొప్పున లెక్క కట్టి నష్టపరిహారం ఇవ్వడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణ కొలతలను పూర్తిస్థాయిలో తెలిపి నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని లేనిచో ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు రాజు, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి

**మిరుదొడ్డి, జూలై 3(మనం న్యూస్):** పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట స్వామి, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, బాలా గౌడ్, రాములు, సత్యనారాయణ, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏకు శ్రీవాణి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**పరకాల, జూలై 3(మనం న్యూస్):** ఏకు శ్రీవాణి కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. గత మూడు రోజుల క్రితం బాలికల వసతి గృహంలో ఉరివేసుకొని బలవన్మరణం చెందిన ఏకు శ్రీవాణి మృతి గల కారణాలను గురుకులం ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గురుకులంలో అనుకోని సంఘటన జరగడం బాధాకరమని, విద్యార్థినీ ఆత్మహత్య గల కారణాలు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి లోపాలను గుర్తించి మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం శ్రీవాణి స్వగృహానికి వెళ్లి శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరి వెంట పరకాల రెవెన్యూ డివిజన్ అధికారి డాక్టర్ కే నారాయణ, పరకాల ఏసీపీ సతీష్ బాబు, తహసిల్దార్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుష్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ప్రత్యేక బృందాన్ని అభినందించిన పోలీస్ కమిషనర్



**కొమురవెల్లి, జులై 3(మనం న్యూస్):** అంతరాష్ట్ర దొంగలను చేర్యాల, కొమురవెల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు హుస్నాబా ద్ ఏసిపి సదానందం తెలిపారు. కొమురవెల్లి స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ గత నెల 24వ తేదీన మండల కేంద్రంలోని కుమ్మరి కొమురెల్లి ఇంట్లో దొంగతనం జరిగిన కేసు నమోదు చేసి చేర్యాల సిఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టగా మండల పరిధిలోని తలసాని వెంచర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా కనిపించడంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించాగా వారి పై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిసాయి. నిందితులు బిజిలి సురేష్, అంగిడి జంపయ్య, దాసరి అశోక్, మాదగాని సురేష్, ఆనారెడ్డి రవి, కూజ నరసయ్య, ఆరుగురిలో నలుగురీని అదుపులోకి తీసుకొని విచారణ చేశామని తెలిపారు. గత సంవత్సరం నుండే కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 7, చేర్యాల ,రాయపోల్, కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3, దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో 2, తాళం వేసిన ఇండ్లనే టార్గెట్గా చేసుకొని మొత్తం 18 చోట్ల వరుస దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుల నుండి మొత్తం తొమ్మిది తులాల బంగారం నగలు, 22.5 తులాల వెండి నగలు, ఒక ఇనుప రాడు, మూడు బైకులు ,ఒక సెల్ ఫోన్ స్వాధీనం పరుచుకున్నామని అన్నారు. అరెస్టు చేసిన నిందితులపై నాన్ బెయిల్ వారెంట్లు సంబంధిత కేసులు ఉన్నాయని తెలిపారు. అదుపులోకి తీసుకున్న నలుగురు నిందితులను గురువారం న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. ప్రజలు విహారయాత్రలకు బంధువుల ఇండ్లకు వెళ్లేవారు వారి విలువైన ఆభరణం ఇండ్లలో ఉంచకుండా వారి వెంట తీసుకొని వెళ్లాలని, తాళం వేసిన ఇండ్ల వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఇవ్వాలని కోరారు. వరుస దొంగతనాల కేసులను చేదించిన ప్రత్యేక బృందాన్ని ఏసిపి అభినందించారు.

# జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు

- స్రీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్లు హరి పచౌరి, డా. కె.గోవర్ధన్‌లు




**రామగిరి, జూలై 3(మనం న్యూస్):** జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలనుఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్లు హరి పచౌరి, డా: కె.గోవర్ధన్ లు అన్నారు. గురువారం జి.యం కార్యాలయం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో ప్రయాస్ పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్ల్యు ఎ ఉద్యోగుల పదకొండవ వెజ్ బోర్డ్ కు సంబంధించిన 228 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు కు అందజేశారు. ఈ సందర్భంగాసిఎంపిఎఫ్‌రీజినల్ కమిషనర్ హరిపచౌరి మాట్లాడుతూసిఎంపిఎఫ్‌లావాదేవీలు అన్ని సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండాసీఎం పిఎఫ్‌సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. సిఎంపిఎఫ్ బెనిఫిట్స్ కు అర్హులు, పెన్షన్, రివైజ్డ్ పెన్షన్ పట్ల అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్ సిఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకు వచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని చెప్పారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సిఎంపిఎఫ్ వివరాలను చూసే సిబ్బంది సిఎంపిఎఫ్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సీనియర్ పిఓ పి.రాజేశం, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శిరీష, సిఎంపిఎఫ్ సిబ్బంది భారతి, కామేశ్వర రావు, అనిత, లలిత తో పాటు వివిధ గనుల సంక్షేమ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరానికి దీటుగా పాలేరు అభివృద్ధి

**18 నెలల కాలంలో పాలేరుకు 1500 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు**

**కూసుమంచి మండలంలో 5.5 కోట్లతో జూనియర్ కళాశాల నిర్మాణం**

**ఆర్థిక పరిస్థితి బాగు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు**

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**పలు రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి**





**కూసుమంచి, జూలై 03(మనం న్యూస్):** నగరాలకు ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రివర్యులు, కూసుమంచి మండలంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి గురువారం పర్యటించి పలు రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు. ధర్మతండా గ్రామంలో 36 లక్షలతో కూసుమంచి ఆర్ అండ్ బి రోడ్డు నుండి ధర్మతండా వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనులకు, లోక్యాతండా గ్రామంలో ఒక కోటి 26 లక్షలతో లోక్యాతండా నుండి ధర్మతండా వరకు, ఒక కోటి 16 లక్షలతో లోక్యాతండా నుండి అగ్రహారం వరకు చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులకు, కోక్యాతండా గ్రామంలో 2 కోట్ల 90 లక్షలతో కోక్యాతండా నుండి వీర్యాతండా వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గన్యాతండా గ్రామంలో 3 కోట్ల 30 లక్షలతో గన్యా తండా నుండి మోటాపురం వీరన్న స్వామి టెంపుల్ వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కూసుమంచి గ్రామంలో 6 కోట్ల 50 లక్షలతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి పనులకు, ఖమ్మం - కోదాడ, కూసుమంచి, నేలకొండపల్లి పట్టణ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి రోడ్డులో ఏర్పాటు చేయు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కోక్యా తండాలో నిర్మాణంలో ఉన్న బాణోత్ సురేష్, భూమిక ల ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ప్రభుత్వం నుండి ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు, నిర్మాణం పూర్తి అయిన వాటికి దశల వారిగా ప్రతి సోమవారం విడతలుగా నేరుగా లబ్దిదారుని ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూసుమంచి, నేలకొండపల్లి మండల హెడ్ క్వార్టర్ లలో 6 కోట్ల 50 లక్షల రూపాయలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్స్, జంక్షన్ అభివృద్ధి పనులు కొద్ది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి అంతర్గత రోడ్లు నిర్మించామని, తాగునీటి సరఫరా సమస్యలు పరిష్కరించామని, 50 లక్షల రూపాయలతో షాదీ ఖానా మంజూరు చేసుకున్నామని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో మంజూరు చేశామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు. గత 18 నెలల కాలంలో ధర్మతండా గ్రామంలో 22 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్లు పూర్తి చేశామని, 20 లక్షల రూపాయలతో గిరిజన శాఖ ద్వారా పలు అభివృద్ధి పనులు, లోక్యతండా గ్రామంలో 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు, 12 లక్షలతో అంగన్ వాడి కేంద్రాల అభివృద్ధి, 4 లక్షల రూపాయలతో త్రాగు నీటి సరఫరా పనులు, కొక్యా తండా లో 14 లక్షలు ఖర్చుపెట్టి సిమెంట్ రోడ్లు, 12.35 లక్షలతో అంగన్వాడీ భవనం, 10 లక్షలు ఖర్చు పెట్టి మంచినీటి సమస్య తీర్చుకున్నామని అన్నారు. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత 18 నెలల కాలంలో సుమారు 1400 నుంచి 1500 కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేసుకున్నామని తెలిపారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం.వెంకటేశ్వర్లు, ఇఇ మిషన్ భగీరథ వాణిశ్రీ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, విద్యుత్ శాఖ ఏడిఇ లోక్యా నాయక్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట అందంగా ఉండాలి



- **ఎమ్మెల్యే జారే, అధికారులతో కలిసి మంత్రి తుమ్మల సమీక్ష**

**దమ్మపేట, జూలై 3 (మనం న్యూస్ ):** అశ్వారావుపేట నియోజవర్గం అందం గా ఉండాలని, సమస్యలు ఉంటే ఎమ్మెల్యే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్ళాలని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులను ఆదేశించారు. గురువారం గండుగులపల్లి,లోని తన స్వగృహంలో అధికారులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి సమీక్ష నిర్వహించారు. సమీక్ష లో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, చెరువులు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న అశ్వారావుపేట, ను తెలంగాణ గుమ్మంగా తీర్చి దిద్దాలని తుమ్మల కోరారు. అశ్వారావుపేట, దమ్మపేట తహసీల్దార్లు, విధ్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, అటవీ, పంచాయతీ రాజ్,పోలీస్ శాఖ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుత రావు,కాసాని నాగ ప్రసాద్,కె వి సత్యనారాయణ, మన్యం అప్పారావు,ఎర్ర వసంతరావు,మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

## కింగ్ డోమ్స్ కల్చర్ మినిస్ట్రీస్ రక్తదాన శిబిరం నిర్వహణ



- **ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
- **ఎస్ కె అంజుమనార బేగం సామాజిక సేవలు చేయడం గొప్ప విషయం**

**మణుగూరు, జూలై 3(మనం న్యూస్):** మణుగూరు మండలంలో గల వంద పడకల హాస్పిటల్ నందు కింగ్ డోమ్స్ కల్చర్ మినిస్ట్రీస్ వారు ఎస్కే అంజుమనార బేగం ఆధ్వర్యంలో డాక్టర్ కె సునీల్ మజ్డూనేకర్, మెడికల్ సూపరింటెండెంట్ మణుగూరు ఏరియా హాస్పిటల్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ కె అంజుమనార బేగం బిటిపిఎస్ నందు ఉద్యోగం చేసుకుంటూ సామాజిక సేవ చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. యాక్సిడెంట్, ఆపరేషన్ సమయాలలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారు రక్తం దొరకక చాలా ఇబ్బంది పడిన సంఘటన ఎన్నో సందర్భాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఇటువంటి రక్త శిబిరాలలో రక్త దానం చేయాలని సూచించారు. అనంతరం 100 పడకల హాస్పిటల్ క్యాజువాలిటీ నందు రోగులని కలిసి వారి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. వంద పడకల హాస్పిటల్ కి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని వర్షాకాలం ని దృష్టిలో పెట్టుకొని శానిటైజింగ్ తరచుగా చేయాలని, సిబ్బంది రోగుల పట్ల ఆప్యాయంగా మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు చైతన్య నాయుడు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, సుబ్బారెడ్డి ,మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాల్యాశ్రీకి 'పురుషోత్తం' స్మారక సాహితీ పురస్కారం

- **వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు**
- **అంతర్జాతీయ కథల, కవితల పోటీల ఫలితాలు వెల్లడి**






**ఖమ్మం, జూలై 3(మనం న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన కవి మాల్యాశ్రీకి ఈ ఏడాది భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక సాహితీ పురస్కారం-2025 అందజేయనున్నట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని వురిమళ్ల ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కథల, కవితల పోటీల ఫలితాలను వెల్లడించారు. అదే సందర్భంలో ఈ ఏడాది కవి మాల్యాశ్రీకి భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక పురస్కారం-2025 అందజేయాలని నిర్వహణ కమిటీ నిర్ణయించిందన్నారు. త్వరలో జరుగబోయే ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో మాల్యాశ్రీకి పురస్కారంతో పాటు పది వేల నగదు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సాహిత్యరంగంలో విశేష కృషి చేస్తున్న సుప్రసిద్ధ కవులకు ఈ పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తున్నట్లు తెలిపారు.

**వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీ విజేతలు వీరే :**

వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీల్లో 5 వేల నగదు ప్రథమ బహుమతిని రంగనాధ్ సుదర్శన్(ఇల్లందు) రాసిన 'మైలంటని మహాలక్ష్మీ' కథ గెలుచుకుంది. 4 వేల నగదు ద్వితీయ బహుమతిని యస్వీ కృష్ణ(హైదరాబాద్) రాసిన 'ఇంధనం' కథ గెలుచుకుంది. 3 వేల నగదు తృతీయ బహుమతిని జివి హేమతల(గుంటూరు) రాసిన 'గ్రహణం ' కథ గెలుచుకుంది. వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులను మంత్రి ప్రగడ శ్రీనివాసరావు(ఖమ్మం) రాసిన 'స్వేయ శిల్పి', పెమ్మరాజు విజయరామచంద్ర(హైదరాబాద్) రాసిన 'డక్కీ', ఎస్‌బిఎస్ శ్రీనివాస్ పోలిశెట్టి(కాకినాడ) రాసిన 'డెంజరస్ డెవిల్స్', నల్లబాటి రాఘవేంద్రరావు(హైదరాబాద్) రాసిన 'మొట్టమొదటి అడుగు', సయ్యద్ గఫార్(హైదరాబాద్) రాసిన 'షికార్' కథలు ఎంపికయ్యాయి.

**వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీ విజేతలు వీరే :**

వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీల్లో 4 వేల నగదు ప్రథమ బహుమతికి చిందం రమేష్(జగిత్యాల) రాసిన 'విషాద కావ్యం' కవిత ఎంపికైంది. 3 వేల నగదు ద్వితీయ బహుమతికి పొత్తూరి సీతారామరాజు(కాకినాడ) రాసిన 'సాగనీ పయనం' కవిత ఎంపికైంది. 2 వేల నగదు తృతీయ బహుమతికి అవ్వారు శ్రీధర్‌బాబు(నెల్లూరు) రాసిన 'జూమ్ చెయ్' కవిత ఎంపికైంది. వెయ్యి రూపాయల నగదు పొందే కన్సోలేషన్ బహుమతులకు శింగరాజు శ్రీనివాసరావు(ఒంగోలు) రాసిన 'ఆరవ శక్తి', కటుకోజ్వల రమేష్(ఖమ్మం) రాసిన 'కాలధర్మం', మామిడిశెట్టి శ్రీనివాసరావు(పశ్చిమ గోదావరి) రాసిన 'మనిషతనమై మొలకెత్తి' కవితలు ఎంపికయ్యాయి. విజేతలందరికీ త్వరలో ఖమ్మంలో జరుగబోయే వార్షికోత్సవ సభలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమల్ల ఉపేందర్ పాల్గొన్నారు.

## కిన్నెరసానికి జలకళ



- **397.40 అడుగులకు చేరిన నీటిమట్టం**
- **ఇన్ ఫ్లో 17 వందల క్యూసెక్కులు**

**పాల్వంచ, జూలై 3(మనం న్యూస్):** కిన్నెరసానికి జలకళ ఉట్టిపడుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరద నీరు కిన్నెర జలాశయానికి చేరింది. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 407 అడుగులు కాగా.. గురువారం ఉదయానికి 397.40 అడుగులకు నీటిమట్టం చేరింది. కే టి పి ఎస్ డ్యాం సైట్ యంత్రాంగం దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కిన్నెరసాని నది పరివాహక ప్రాంత రైతులు మోటార్లను ముందస్తుగా తీసివేసి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు.

## సిపిఎం సీనియర్ నాయకుడు దొంగల కోటయ్యను పరామర్శించిన నున్నా

**ఖమ్మం, జూలై 3(మనం న్యూస్):** ఇటీవల అనారోగ్యానికి గురై ఆరోగ్య హాస్పటల్లో చికిత్స పొంది తన ఇంటి వద్ద రెస్ట్ తీసుకుంటున్న సిపిఎం సీనియర్ నాయకుడు దొంగల కోటయ్యను సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. దొంగల కోటయ్య గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ హాస్పిటల్ లో చికిత్స పొందిన విషయాన్ని తెలుసుకొని వారి ఇంటి వద్దకువెళ్లి నున్నా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను తెలుసుకొని పలు సూచనలు చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, బుగ్గవీటి సరళ, బండి పద్మ, షేక్ మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, చిలకల వెంకటేశ్వర్లు, తుడుం ప్రవీణ్, గాలి వెంకటాద్రి కత్తుల అమరావతి, గాలి అంజయ్య, తిప్పర్తి నరసింహారావు, తోట నాగరాజు, పోతురాజు వెంకటి, జట్ల ఆనందరావు, నలమల సత్యనారాయణ, వేదగిరి మురహరి, డ్రైవర్ గోపి, తదితరులు ఉన్నారు.



## 5న నెలనెలా మెడికల్ క్యాంపు



**ఖమ్మం, జూలై 3(మనం న్యూస్):** సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో జూలై 5న మొదటి శనివారం మంచికంటి హాల్ లో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకోవాలని ఆ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ , బివికె మేనేజర్ వై శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి నెలా మెడికల్ క్యాంపు జరుగుతుందని తెలిపారు. బిపి, షుగర్ తదితర అనారోగ్య సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ జరుగుతుందని తెలిపారు. నగరంలోని ప్రముఖ వైద్యులు పాల్గొని వైద్య పరీక్ష లు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలకు వరుకు మెడికల్ క్యాంపు జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లయన్స్ ఆధ్వర్యంలో గర్భ కోశ వ్యాధుల పరీక్షా శిబిరం



**భద్రాచలం, జూలై 3( మనం న్యూస్ ):** భద్రాచలంలోని చిన్న జీయర్ మఠంలో గురువారం స్త్రీలకు గర్భకోశ వ్యాధుల ఉచిత పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ వికాస తరంగణి, సంయుక్తంగా ఈ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. చిన్న జీయర్ మఠం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలవ్యాప్తంగా 1481 క్యాంపులు నిర్వహించారు. 1482 వ క్యాంపు భద్రాచలంలో నిర్వహించారు. పరీక్షల కోసం మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ ఈ పరీక్ష చేయించుకోవడం ద్వారా రాబోయే గర్భకోశ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం లయన్స్ క్లబ్ , వికాస తరంగణి అధ్యక్షురాలు, కమల రాజశేఖర్ ,చినజీయర్ మఠం అధ్యక్షులు వెంకటాచారీ, వికాస తరంగిణి జిల్లా అధ్యక్షురాలు రోజా రమణి, గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ మాధవి, డాక్టర్ జయ భారతి, వికాస తరంగిణి చక్రవర్తి, లయన్స్ సెక్రెటరీ సిద్ధారెడ్డి, హరిచంద్ర నాయ క్, చారుగుల్ల శ్రీనివాస్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించండి

- **ఉపముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఆఫీస్ ముట్టడి**
- **పిడిఎస్‌యూ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు**




**ఖమ్మం, జూలై 3(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయల విషయంలో స్పందించకుండా మొండి చేయి చూపిస్తోందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయాలను గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా పిడియస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్మెంట్, 8 వేల కోట్లు, బెస్ట్ అవైలబుల్ 200 కోట్లు బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు బృందాన్ని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలిచారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా నాయకులు వినయ్, కార్తీక్, పృధ్వీ, సురేష్, నసీర్, చందు, అశోక్, ప్రసాద్, పేర్ల వెంకటేష్, నరేంద్ర ర్, వరుణ్, సంతోష్, అఖిల్ స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే సంక్షేమ పథకాల అమలు

- **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
- **వేపకుంట్ల గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపన**



**రఘునాథపాలెం, జూలై 03(మనం న్యూస్):** అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో పర్యటించి ఎస్సీ కాలని నందు సి.ఆర్.ఆర్.(ఎస్.సి.పి.) నిధులు 50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ తొలి విడతలో గుడిసెల్లో ఉన్న నిరుపేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని, ఇంకా ఎవరైనా గుడిసెలలో ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు రాని పక్షంలో ప్రతిపాదనలు అందించాలని వెంటనే మంజూరు చేస్తామని అన్నారు. దశల వారీగా మిగిలిన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. గ్రామంలో గుడిసెలో ఉంటున్న వారి ఫోటోలు తీసుకొని రావాలని మంత్రి తెలిపారు. గ్రామంలో నిరుపేదలైన అర్హులకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, వేపకుంట్ల గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వేల మందికి ఇండ్లు కట్టించే అవకాశం లభించింది

- 1437 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు పంపిణీ
- ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు
- రాబోయే రోజుల్లో మయూరి కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,జూలై 3(మనం బ్యూరో):** వేల మందికి ఇండ్లు కట్టించే అదృష్టం తనకు లభించిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ పట్టణం లోని శిల్పారామం లో నగరపాలక సంస్థ పరిధికి చెందిన లబ్దిదారులకు ఆయన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి ప్రొసీడింగ్స్ పత్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ ఇండ్లు మంజూరు చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. తైబజార్ రద్దు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చామని, ఎన్నికల ఫలితాలు రాగానే తైబజార్ రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎవరి మధ్యవర్తిత్వం , దళారీ వ్యవస్థ లేకుండా, పార్టీలకు అతీతంగా అసలైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు తీసుకురాబోతున్నామని, మిమ్మల్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి నిరంతరం పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. మీ కాళ్ళు మీద నిలబడి జీవించేందుకు నైపుణ్య శిక్షణ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని, మహిళల కోసమే వీరన్న పేటలో రెండుమూడు రోజుల్లోగా శంకుస్థాపన చేసుకుంటామని, అలాగే రైల్వే స్టేషన్ రోడ్ లో ఒక ట్రైనింగ్ సెంటర్ పూర్తయిందని, దానిని కూడా ప్రారంభించుకోబోతున్నామని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు బికె రెడ్డి కాలనీ లో కంప్యూటర్ కోర్స్ లో వెయ్యి మందికి పైగా మా ఆడబిడ్డలు శిక్షణ పూర్తి చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. రాబోయే మూడున్నర సంవత్సరాలు మహబూబ్ నగర్ ఆడబిడ్డలకు మంచి రోజులు రాబోతున్నాయని ఆయన చెప్పారు. దానికి రుజువు ఈరోజు వందల మందికి వారి సొంతింటి కళ సాకారం చేయడమే అని ఆయన స్పష్టం చేశారు. ఇంతమంది సొంతింటి కళ నెరవేర్చిన ముఖ్యమంత్రి ని ఆశీర్వదించి దీవించాలని ఆయన సూచించారు. మున్సిపాలిటీ గా ఉన్న మహబూబ్ నగర్ ను మున్సిపల్ కార్పొరేషన్ గా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి మహబూబ్ నగర్ ను నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్ ను మొదటి స్థానంలో నిలిపేందుకు మా ఆడబిడ్డల సహకారం వారి తోడ్పాటు అవసరమని ఆయన చెప్పారు. రెండు మూడు వారాల్లోగా రేషన్ కార్డులు లేని వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, టి పిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అవేజ్, ఫయాజ్, సిజె బెనహార్, అజ్మత్ అలి, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, జహీర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బోర్నపల్లి యుపిఎస్ స్కూల్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**జగిత్యాల, జులై 3 ( మనం ప్రతినిధి):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామంలోని,యుపిఎస్, అప్పర్ ప్రైమరీ స్కూల్ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పరిశీలించారు. పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అధికారులకు ఆదేశించారు. తప్పనిసరిగా పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, శుభ్రంగా ఉంచాలని అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్ పొయ్యి మీదనే చేయాలని వంట సరుకులను ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలని అధికారులకు.కు సూచించారు. కిచెన్ గార్డెన్ వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలోని బోధించే ఉపాధ్యాయుల విధానము విద్యార్థులకు బోధించే విధానంను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్ లో కూరగాయల మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ పరిశీలన తర్వాత బోధనలో గాని, పాఠశాల రెడి నెస్ లో గాని పిల్లల సౌకర్యాల ఏర్పాట్లు గాని ఎట్టి పొరపాటు లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచనలు తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

## ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన కలెక్టర్



**మహబూబ్ నగర్, జూలై 3 (మనం బ్యూరో):** మహబూబ్ నగర్ అర్బన్ మండలం పరిధిలోని వీరన్నపేటలో గురువారం జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయి ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. నవోదయ పాఠశాల ఏర్పాటు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు కొరకు స్థల సేకరణకు ప్రభుత్వ భూములు పరిశీలన చేయడం జరిగింది. అనంతరం వీరన్నపేట్ లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్లలో ఉన్న లబ్ధిదారులను కలెక్టర్ పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇల్లు ఎవరి పేరు మీద వచ్చింది ఇంట్లో ఎవరున్నారు తదితర వివరాలను ఇండ్లను పరిశీలించారు.. అదేవిధంగా కొన్ని డోర్ లాక్ ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ను పరిశీలించారు. వెదిర, జడ్చర్ల మధ్య బోయిన పల్లి శివారు లో ఐఐటి కొరకు స్థల పరిశీలన చేశారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ నవీన్ కుమార్, మహబూబ్ నగర్ అర్బన్ తహశీల్దార్ ఘన్సీరాం,తదితరులు ఉన్నారు.

## అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన మధ్యాహ్న భోజనం



- విద్యార్థులకు వరంగా మారిన పథకం

**మహబూబ్ నగర్, జూలై 3(మనం బ్యూరో):** తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ సమగ్రశిక్ష సీఎంఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలు యాదవ్ బైకాని, మండల విద్యాశాఖ అధికారి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ఉచితంగా అందించే మధ్యాహ్న భోజన పథకం ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరిగి, విద్యాభ్యాసం పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా వారి అధ్యయన సామర్థ్యాన్ని కూడా పెంచుతుందని తెలియజేశారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శారీరకంగా ఆరోగ్యంగా, మానసికంగా విజ్ఞానంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మరియు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఎంఇఒ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- హాస్టళ్ల పరిసరాలు, వంటగదులు, ఆహార పదార్థాల పరిశీలన





**రాజన్న సిరిసిల్ల, జూలై 3 ( మనం ప్రతినిధి):** జిల్లాలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల గురుకుల వసతి గృహం పెద్దూర్ లోని మహాత్మా జ్యోతి భాపూలే వసతి గృహం, తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని మైనార్టీ బాలుర హాస్టల్, నేరెళ్లలోని బాలికల రెసిడెన్షియల్ విద్యాలయానికి కలెక్టర్ చేరుకొని ముందుగా ఆయా హాస్టళ్ల పరిసరాలు, కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు తదితరులు తనిఖీ చేశారు. మండేపల్లిలోని మైనార్టీ బాలుర వసతి గృహంలో సౌకర్యాలు సరిపడా లేకపోవడంతో వారికి కేంద్రీయ విద్యాలయానికి సంబంధించిన గత భవనాన్ని వినియోగించాలని సూచించారు. పెద్దూర్, మండేపల్లిలోని ఆర్ఓ ప్లాంట్లు రెండు రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. తాజా, నాణ్యమైన కూరగాయలు, పండ్లు నిత్యం అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణ వంట గదులు తదితర పరిసరాలు కచ్చితంగా పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత కోసం మున్సిపల్, అలాగే పంచాయతీ అధికారులతో చేయించాలని సూచించారు.
విద్యాలయాల్లో సంక్షేమ వసతి గృహాల్లో ఎంతమంది విద్యార్థులు ఉండవచ్చు ప్రస్తుతం ఎందరున్నారో ఆరా తీశారు. వారికి సరిపడా టాయిలెట్లు, బెడ్స్, డెస్క్ లు ఉన్నాయని ఆ విద్యాసంస్థల బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయా హాస్టళ్లలో రోజు అందిస్తున్న భోజనం పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సామగ్రి అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళా సంక్షేమ వసతి గృహాల్లో అందరూ మహిళా సిబ్బంది ఉండాలని, అలాగే పురుషుల సంక్షేమ వసతి గృహాల్లో పురుషులే ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు విద్యాలయాల్లో హాస్టల్లో పనిచేసే సిబ్బంది అంతా స్థానికంగానే ఉండాలని ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు నిల్వ చేసే స్టోర్ రూమ్ లలోకి కీటకాలు, ఈగలు, దోమలు రాకుండా ఎలక్ట్రిక్ మిషన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, డి. పి.ఆర్. ఓ.వి.శ్రీధర్, ఆయా విద్యాసంస్థల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

## సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- ప్రత్యేక అవసరాల బాలలకు అండగా ప్రభుత్వం
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్, జూలై 3(మనంప్రతినిధి):** ప్రత్యేక అవసరాల బాలల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెడతామని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వెల్లడించారు. తెలకపల్లి భవిత కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన బాల, బాలికలకు మెరుగైన విద్యతోపాటు, ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని భవిత కేంద్రం ఐఆర్పి టీచర్లను ఆదేశించారు. వారికి అండగా ప్రభుత్వం ఉంటుందని, వారి శారీరక మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందించాలన్నారు. ప్రస్తుతం భవిత కేంద్రంలో 20, మంది విద్యార్థులు థెరపీకి కోసం ఇటీవలే రెండు లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన సేవలందించేందుకు సంబంధిత శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అక్కడి బోధనాసిబ్బంది, థెరపీ సిబ్బందితో చర్చించారు. వారి నుంచి భవిత కేంద్ర పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాలున్న బాల బాలికలకు అన్ని విధాలుగా అండగా ఉండేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారి బోధనకు అవసరమైన ఉపకరణాలు, టెక్స్ బుక్స్, స్పెషల్ కౌన్సిలింగ్, టెక్నాలజీ ఆధారిత సదుపాయాలు అందించేందుకు కృషి కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, వారి ఎదుగుదలకు తోడ్పాటునందించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్, తహసిల్దార్ జాకిర్ అలీ, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, భవిత కేంద్రం కోఆర్డినేటర్ బాల నరసింహ, ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయుడు శేఖర్ ఉన్నారు.

## బాలకార్మికులను గుర్తించాలి



- ఈ నెల 31వరకు ఆపరేషన్ ముస్కాన్
- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్ నగర్, జూలై 3(మనం బ్యూరో):** జూలై 1 నుండి జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రెస్క్యూ టీమ్ అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మిని సమావేశ మందిరంలో ఆపరేషన్ ముస్కాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాల కార్మికులు పని చేసే ప్రాంతాల్లో వారిని గుర్తించి తీసుకున్న పునరావాస చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలోని హోటళ్ళు, పూల దుకాణాలు, మెకానిక్ షాపులు, నిర్మాణ రంగం, భిక్షాటన, ఇటుక బట్టీలు, ఇతర చోట్ల, ప్రమాదకర ప్రాంతాలలో పని చేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ అధికారి సమన్వయంతో కలిసి రెస్క్యూ టీమ్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో బాల కార్మికులను గుర్తిస్తే వారిని పనిలో నియమించిన వారి పై బాల కార్మిక నిర్మూలన చట్టం 2016 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, బాల కార్మికుల పిల్లలను బాలల సంరక్షణ కమిటీ కి అప్పగించి వారి సంక్షేమం కు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలలు పాఠశాల, కళాశాల లో ఉండాలని, పనిలో ఉండవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో 0 నుండి 14 సంవత్సరాల లోపు, 14 నుండి 18 సంవత్సరాల లోపు బాలలను పని లో పెట్టుకున్నా, వారిని లైంగికంగా వేధించిన అటు వంటి సంఘటనలు బాలల సంరక్షణ అధికారి కి గాని చైల్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098 కి సమాచారం అందించాలని అన్నారు. జులై 1 నుండి జులై 31 వరకు వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ లో తప్పి పోయిన, నిరాదరణ కు గురైన, పని లో ఉన్న బాల కార్మికులను గుర్తించాలని అన్నారు ఈ సమావేశం లో జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి డి.ఇందిరా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి. ఎన్.బి.రత్నం, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి శంకరాచారి, బాలల సంరక్షణ కమిటీ చైర్మన్ , డీసీపీఓ, రెస్క్యూ టీమ్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వేద సదస్సుకు వేములవాడ వేదిక

- చతుర్వేద స్మార్త పరీక్షలతో ప్రారంభమైన అఖిల భారత వేద సదస్సు
- ఇది మన ప్రాంత గౌరవం
- విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, జూలై 03(మనం న్యూస్):** శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు గురువారం వేములవాడలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వేదపండితుల కోసం చతుర్వేద స్మార్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. దేశ నలుమూలల నుంచి వేద పాఠశాలల నుండి విద్యార్థులు, పండితులు హాజరయ్యారు.సదస్సు ప్రారంభోత్సవానికి రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, తుని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు ముందుగా శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా వేద పండితుల కోసం నిర్వహించే చతుర్వేద స్మార్త పరీక్షలను తెలంగాణలో, అది కూడా వేములవాడలో నిర్వహించడం గర్వకారణమని అన్నారు. ఇది రాష్ట్రానికి మాత్రమే కాదు, మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందన్నారు. తిరుపతి తరహాలో ఇప్పుడు వేములవాడ రాజన్న సన్నిధిలో వేద పరీక్షలు జరగడం శుభ సూచకమని,ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి కృతజ్ఞతలు అని అన్నారు.అలాగే, ఆలయ విస్తరణ పనులపై మాట్లాడుతూ,ప్రజలందరికీ మెరుగైన దర్శన వసతులు కల్పించేందుకు మొదటి దశలో రూ.150 కోట్లు కేటాయించామని ఆలయాన్ని నాలుగు ఎకరాల్లో విస్తరిస్తున్నామని,రాబోయే రోజుల్లో 40 ఎకరాల స్థలంలో ఆధునిక గోశాలను నిర్మించబోతున్నామని



అని చెప్పారు. అలాగే వేద యూనివర్సిటీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి సహకారంతో చర్యలు కొనసాగుతున్నాయన్నారు.అనంతరం తుని పీఠాధిపతి స్వామి మాట్లాడుతూ..శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోందని ఎన్నోసార్లు స్వామి వారిని దర్శించుకున్నానని. ఆలయానికి గొప్ప చరిత్ర ఉందన్నారు.. ప్రభుత్వం చేపట్టిన విస్తరణ పనులు విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలకు అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.

## సమయపాలన పాటించాలి



- రక్త నమూనాల సేకరణపై కలెక్టర్ అసంతృప్తి
- తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, జూలై 03(మనం ప్రతినిధి):** సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేందుకు వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. రక్త పరీక్షల కేంద్రంలో రక్త పరీక్షల రిపోర్టులు రక్త నమూనాలను కలెక్టర్ పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ అంశాలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవల కోసం వచ్చే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. అక్కడి వైద్య సేవల గురించి తెలుసుకుని, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు విన్న ఆయన, ఆరోగ్య కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ జాకిర్ ఆలి, ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉన్నారు.

## పని చేసిన వారిని పార్టీ ఆదరిస్తుంది

- ఎమ్మెల్యేలు వంశీ కృష్ణ, దామోదర్ రెడ్డి, రాజేష్‌రెడ్డి

**నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, జూలై 03(మనం న్యూస్) :** యువత టికెట్లు అడుక్కోవద్దని ఇంటికే వచ్చేట్లు పని చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కన్వెన్షన్ హాల్లో గురువారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్ ధ్యక్షతన నిర్వహించిన నాగర్ కర్నూల్ జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. తాను రాజకీయాల్లో టికెట్టు ఎన్నడూ ఆశించలేదని, టికెట్టు తనకు ఇంటివద్దకు వచ్చినదని వెల్లడించారు. దేశంలో రాజకీయ నాయకుడే ఏంటో గొప్పవాడని రాజ్యాంగాన్ని రక్షించేది రాజకీయ నాయకుడేనన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 శాతం సీట్లు యువతకే కేటాయించానని, ఈ సారి 50 శాతం టికెట్లు యువతకే ఇస్తానని ప్రకటించారు. ప్రజల్లో బలముంటేనే గెలుస్తారని, ధైర్యమున్నవారే నాయకులవుతారన్నారు. రాజకీయాల్లో ఎవరినీ ఎవరూ లీడర్ చేయరని, తనకు తానే తయారు కావాల్సి ఉంటుందన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవాలని, పరిష్కరించాలన్నారు.అచ్చంపేటలో యువతపై ఉన్నన్ని కేసులు రాష్ట్రంలో మరెక్కడా లేవన్నారు.

**యువత తలచింది జరుగుతుంది : ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

రాజకీయాల్లో యువత తలచింది జరిగి తీరుతుందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ ఎంతో కష్టపడి పనిచేసినదని, అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినదన్నారు. పార్టీకి వెన్నుదన్ను యువతేనని, పని చేసిన వారిని పార్టీ తప్పకుండా ఆదరిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్లో పని చేసిన వారి గ్రాఫ్ పైకే పెరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లో చేసిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలనీ




యువతకు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా విభాగం బాగా పనిచేసిందని, అధికారంలోకొచ్చాక వెనకబడ్డామన్నారు. గ్రామాల్లో సోషల్ మీడియా టీములు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలకపల్లి ఆలేరు గ్రామంలో జూలై 7వ తేదీన అమరవీరుల స్థూపం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

**యువతే పార్టీకి బలం : ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి**

యువతే పార్టీకి బలమని ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి స్పష్టం చేశారు. యువత బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం చేసిన 7 లక్షల కోట్ల అప్పులకు వడ్డీ కట్టడానికే రాష్ట్రంలో రాబడి సరిపోతున్నదన్నారు. ఒక లక్ష కోట్లు కాంట్రాక్టర్లకు బాకీ పెట్టారన్నారు. అందుకే కొన్ని పథకాలు అమలులో జాప్యం జరుగుతున్నదని, అధిగమిస్తున్నామన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వాళ్ళ 2 లక్షల రుణమాఫీ కొందరికి అమలు కాలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని, కొత్త పెన్షన్లు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి ఎమ్మెల్యేల ద్వారా పరిష్కరింపజేయాలని యువజన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రజలకు సేవ చేస్తేనే గుర్తింపు వస్తుందని, రాజకీయాల్లో ఎదుగుతారన్నారు.

# షిఫ్టింగ్ పర్మిషన్ లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**విద్యార్థి సంఘాల 3 (మనం ప్రతినిధి) :** షిఫ్టింగ్ పర్మిషన్ లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు (ఎస్) తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్పీ) విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల విద్యాధికారి వెంకన్నకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్ రాజ్, టీఎస్పీ జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్ లు మాట్లాడుతూ.. స్థానిక బీర్కూర్ మండల కేంద్రంలో గల ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయని, వారి ఇష్ట రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కి మరి విద్యాసంస్థలను కొనసాగిస్తున్నారని, వారి పాఠశాలలను ఉన్న చోటు నుండి మరొక చోటుకి మార్చుకుంటున్నారని మండిపడ్డారు.



ప్రభుత్వం ఒక్క చోటున పర్మిషన్ ఇస్తే, వారు మరొకచోటుకు మార్చుకుంటున్నారని, పర్మిషన్ ఒక్కదగ్గర విద్యార్థుల అడ్మిషన్స్ ఒక్క దగ్గర వారి వ్యక్తిగతంగానే ఎక్కడ పడితే అక్కడికి మార్చి మార్చి విద్యాసంస్థలను కొనసాగిస్తున్నారని అన్నారు. మరొక విద్యాసంస్థ అయితే పూర్తిగా రేకుల షెడ్డులో కొనసాగుతుందని, అది కూడా ఇప్పుడు నాసిరకానికి గురైందని, 400 మంది విద్యార్థులకు ఎప్పుడు ఏమి జరిగేది తెలియని పరిస్థితి లో ఉందని, అంతే కాకుండా ఈ విద్యాసంస్థలకి విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలం, కనీస అవసరాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేవు, తాగడానికి మినరల్ వాటర్ సదుపాయం లేదు, ఫైర్ సెఫ్టీ అసలే లేదు.

ఈ వర్షాకాలం లో అయితే ఆ స్కూల్స్ లో విద్యార్థులు అడుగేసిన అడుగు తీసిన మొత్తం బురదమాయమై ఉంటాయని, చాలా రకాల ఇబ్బందులు ఈ విద్య సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఎదుర్కుంటూ, విద్యను కొనసాగిస్తున్నారని అన్నారు.

ప్రయివేట్ యాజమాన్యాలు ఈ విద్యాసంస్థల్లో వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, అనర్హత కలిగిన టీచర్లతో విద్య బోధన కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తూన్నారని అన్నారు. కావున ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న ఈ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా యం ఈ ఓ కి విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున్న ఉద్యమలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# శ్రీ చైతన్య పాఠశాలకు నోటీసులు జారీ చేసిన ఎంఈవో

**కామారెడ్డి, జూలై 03 (మనంప్రతినిధి) :** విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతుంది ఈ శ్రీ చైతన్య విద్యాసంస్థలు. నిత్యం ఎక్కడో ఒక్కచోట ఈ పాఠశాల పేరు వినిపిస్తునే ఉంటుంది. కానీ అవేమిపట్టనట్టు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల నిర్మాణం ఇంకా పూర్తి అవ్వలేదు. అయినా అడ్మిషన్లు తీసుకోని తరగతులు నిర్వహిస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు ఎంఈవో నాగేశ్వరరావు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అనుమతులు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సదరు పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు లేదని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు.



ప్రభుత్వ అనుమతి ఉన్న పాఠశాలల్లోనే అడ్మిషన్లు పొందాలని సూచించారు. అవగాహన లేకుండా గుర్తింపులేని పాఠశాలల్లో చేర్పిస్తే భవిష్యత్తులో విద్యార్థుల చదువులకు ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్..

**కామారెడ్డి, జూలై 03 ( మనం జిల్లా ప్రతినిధి) :** అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. గురువారం సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో 2.40 కోట్ల నిధులతో మిషన్ భగీరథ బల్క్ నీటి కనెక్షన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ., సకల సదుపాయాలతో టీజీఐఐసీని ఏర్పాటు చేసుకుంటున్నామని, ఇప్పటికే ఒక కంపెనీ ని తీసుకొచ్చానని, అది కూడా వచ్చే నెలలో ప్రారంభం కాబోతుంది అని అన్నారు. మరిన్ని కంపెనీ లతో కూడా మాట్లాడుతున్నానని, ఈ కంపెనీ లు రావడం వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఎన్నో సార్లు జాబ్ మేళాలు పెట్టి యువతకు ఉపాధి కల్పించానని గుర్తు చేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు 23 కోట్ల నిధులను విడుదల చేసామని అన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ నిర్మాణ పనుల్లో భాగంగా



భూంపల్లి, మోతె, కాటేవాడి జలశాల నిర్మాణాలకు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో, చీఫ్ ఇంజనీర్ తో మాట్లాడి అవసరమైన పెండింగ్ లో ఉన్న క్లీరెన్స్ చేపించామని అన్నారు. ఆర్థిక శాఖ నుండి ఫైనల్ అప్రూవల్ వస్తే జలాశయాల నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని రైతులకు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వానితో మాట్లాడుతానని అన్నారు. రైతుల వివరాలు రిపోర్ట్ తయారు చేసి ఒక వారం రోజులో అందించాలని ఎమ్మార్వోకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల అధ్యక్షులు, ఎమ్మార్వో , మిషన్ భగీరథ అధికారులు, మండల సీనియర్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ కమిటి సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో భారీగా ఎస్సైల బదిలీలు

**కామారెడ్డి క్రైమ్, జూలై 03 (మనం న్యూస్) :** కామారెడ్డి జిల్లాలో భారీగా ఎస్సైల బదిలీలు నిర్వహించారు. మొత్తం పది మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా బదిలీలపై జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తన మార్కు చూపించినట్లుగా తెలుస్తోంది. బదిలీల్లో భాగంగా వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్ ఇచ్చారు. అలాగే ఇద్దరు ఎస్సైలను వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న నవీన్ చంద్రను జుక్కల్‌కు బదిలీ చేశారు. రాఘవేంద్రను నస్రుల్లాబాద్ ఎస్సైగా నియమించారు. అరుణ్ కుమార్‌ను పెద్ద కొడప్‌గల్‌గా ఎస్సైగా ట్రాన్స్‌ఫర్ చేశారు. రాజారాంనకు కామారెడ్డి టౌన్ ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. నస్రుల్లాబాద్ ఎస్సై పని చేసిన లావణ్యను రామారెడ్డికి బదిలీ చేశారు. రాజంపేట ఎస్సై పుష్పరాజ్‌ను సదాశివనగర్ ఎస్సైగా ట్రాన్స్‌ఫర్ చేశారు. సదాశివనగర్ ఎస్సై రంజిత్‌ను దేవునిపల్లి పీఎస్‌కు పంపించారు. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్‌ను దేవునిపల్లి-2 ఎస్సైగా బదిలీ చేశారు. కాగా దేవునిపల్లి ఎస్సై రాజు, పెద్ద కొడప్‌గల్ ఎస్సైమహేందర్‌ను వీఆర్‌కు పంపించారు.

# అత్తను హతమార్చిన అల్లుడు



- కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో ఘటన

**కామారెడ్డి క్రైమ్, జూలై 03 ( మనం న్యూస్) :** అత్తను అల్లుడు హతమార్చిన ఘటన పిట్లం మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జిన్నలక్ష్మీ మధ్యాహ్న భోజన కార్మికురాలిగా స్థానిక పాఠశాలలో పనిచేస్తుంది. తన కుమార్తెకు అదే గ్రామానికి చెందిన బాగరాజుతో కొంతకాలం క్రితం వివాహం చేసింది. ఇటీవల పంట సాగును అల్లుడు బాగరాజు చూస్తున్నాడు. అయితే పంట డబ్బుల విషయంలో గురువారం ఉదయం గొడవ జరిగింది. స్థానికులు ఇద్దరి మధ్య సయోధ్యతో సద్దుమణిగించారు. స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండివార్చి వస్తున్న జిన్న లక్ష్మిని బాగరాజు దారికాచి పదునైన ఆయుధంతో దాడి చేసి హతమార్చాడు. బాన్సువాడ డీఎస్పీ విఠల్రెడ్డి, రూరల్ సీఐ రాజేష్, పిట్లం ఎస్ఐ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు

- బీజేపీతో 'చేయి'కలిపింది: కేజ్రీవాల్

**అహ్మదాబాద్, జూలై 3 :** కాంగ్రెస్‌తో తమకు పొత్తు లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో అధికార బీజేపీకి కాంగ్రెస్ సహకరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ సారథ్యంలో విపక్ష పార్టీలతో ఏర్పాటైన 'ఇండియా' కూటమి కేవలం గతఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించింది మాత్రమేనన్నారు. గురువారం ఆయన అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2027లో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ



ఎన్నికల్లో ఆప్ పోటీ చేసి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్‌లను కాకుండా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు.

''కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు. ఒకవేళ ఏదైనా పొత్తు ఉందనుకుంటే.. విశావదర్ ఉప ఎన్నికల్లో వాళ్లెందుకు మాపై పోటీ చేశారు? మమ్మల్ని ఓడించాలని చూశారు. ఓట్లు చీల్చి ఆప్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌ను బీజేపీ పంపించింది. కాంగ్రెస్ విఫలం కావడంతో బీజేపీ వారిని చీవాట్లు కూడా పెట్టింది. 'ఇండియా' కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే. ఇప్పుడు మా వైపు నుంచి ఎలాంటి పొత్తు లేదు'' అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని విశావదర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ నేత గోపాల్ ఇటాలియ విజయం సాధించిన విషయం తెలిసిందే. బీజేపీ అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నితిన్‌కు కేవలం 5501 ఓట్లు మాత్రమే వచ్చాయి. గుజరాత్లో నేటి నుంచి గుజరాత్ జోడో అభియాన్ను ప్రారంభిస్తున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీని ద్వారా ప్రజలు తాము ఇచ్చిన నంబర్కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఆప్లో చేరొచ్చన్నారు. తమ కార్యకర్తలు కూడా ప్రతి ఇంటిని సందర్శిస్తారన్నారు. ఆప్ యువకుల పార్టీ అని, అవినీతి రహిత గుజరాత్ను కోరుకునే యువత పెద్ద సంఖ్యలో తమతో కలిసి రావాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు.

# భారత్‌కు డేంజర్ బెల్స్..అమెరికాతో జాగ్రత్త

- గ్లోబల్ ట్రేడ్ రీసెర్చి ఇనీషియేటివ్ రిపోర్టు

**వాషింగ్టన్, జూలై 3 :** భారత్ వాణిజ్య లక్ష్యాలకు వియత్నాంతో అమెరికా చేసుకొన్న ఒప్పందం ఓ హెచ్చరికగా మారింది. తాజాగా వియత్నాంతో వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ఆసియా నుంచి ఎగుమతులు చేసే దేశాల్లో కొంత ఆందోళన మొదలైంది. భారత ఎగుమతిదారులు జాగ్రత్తగా ఉండాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చి ఇనీషియేటివ్ ఓ రిపోర్టును ప్రచురించింది. తాజాగా వాషింగ్టన్-హనోయ్‌ల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం టారిఫ్‌లు గణనీయంగా తగ్గనున్నాయి. వియత్నాం నుంచి ఎగుమతి అయ్యే అన్నిరకాల వస్తువులపై అమెరికాలో 20శాతం టారిఫ్ విధించనున్నారు. దీంతో అది చేసే 135 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనుంది. వాస్తవానికి హనోయ్ వాణిజ్యంలో భారత్‌కు పోటీదారే అయినా.. ప్రాంతీయంగా విలువ జోడింపు రంగంలో మంచి భాగస్వాములు. తాజా ఒప్పందం భారత్ విషయంలో ప్రమాద ఘంటికలు మోగించడంతోపాటు.. వ్యూహాత్మక ప్రభావం చూపనుందని జీటీఆర్ఐ(గ్లోబల్ ట్రేడ్ రీసెర్చి ఇనీషియేటివ్) పేర్కొంది.



**హనోయ్‌కు చేదు గుళిక..**

తాజా అగ్రిమెంట్‌తో వియత్నాంతో ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (బీటీఏ) అమెరికా భర్తీ చేయనుంది. పాత ఒప్పందం ప్రకారం ఆ దేశ సరకులపై ప్రిఫరెన్షియల్ యాక్సెస్ కింద అగ్రరాజ్యంలో కేవలం 2 నుంచి 10 శాతం మధ్య టారిఫ్‌లు విధించేవారు. వీటిల్లో ముఖ్యంగా వస్త్రాలు, ఫుట్‌వేర్, సీఫుడ్, ఫర్నీచర్ వంటివి ఉండేవి. పాత బీటీఏ ప్రకారం వియత్నాం ఎగుమతులు 800 మిలియన్ డాలర్ల నుంచి 135 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇప్పుడు తాజా ఒప్పందం ప్రకారం పన్ను రేట్లు పెరగడంతో గతంలో వలే ఎగుమతులు ఉండకపోవచ్చు.

అంతేకాదు.. చైనా వంటి దేశాల్లో తయారై వియత్నాం మార్గంగా వచ్చే సరకులపై ఏకంగా 40 శాతం పన్ను వసూలుచేయాలని తాజా డీల్లో నిర్ణయించారు. ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో గతంలో వియత్నాంను చైనా కాలనీగా అభివర్ణించిన విషయం తెలిసిందే. ఇక తాజాగా ఒప్పందం కుదిరినట్లు వియత్నాం వెల్లడించింది కానీ.. తుది నిబంధనలు మాత్రం పేర్కొనలేదు.

**భారత్‌కు అప్రమత్తత అవసరం..**

ఇక అమెరికాతో వాణిజ్య చర్చలు జరుగుతున్న ఈ సమయం భారత్‌కు అత్యంత కీలకమైంది. న్యూఢిల్లీ తరఫున వీటిల్లో పాల్గొంటున్నవారు అప్రమత్తంగా వ్యవహరించి వియత్నాం ఒప్పందం నుంచి నేర్చుకోవాలని జీటీఆర్ఐ వెల్లడించింది. ముఖ్యంగా ఇప్పటివరకు లభించే టారిఫ్ రాయితీలు హఠాత్తుగా తొలగిపోవడం, సరకుల రవాణాపై అస్పష్టమైన నిబంధనలు, అన్నింటిపైనా ఒకే రేటుతో పన్ను విధింపు వంటివి దీర్ఘకాలిక వాణిజ్య స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. వియత్నాం ఒప్పందంలోని లోటుపాట్లను భారత్ వాణిజ్య వ్యూహకర్తలు పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చి ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) సూచించింది.

# ట్రంప్ సీక్రెట్ మిలిటరీ మీటింగ్లోకి జుకర్బర్గ్..

- బయటకు పంపించేసిన సిబ్బంది..!

**వాషింగ్టన్, జూలై 3 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ అధ్యక్షతన జరుగుతున్న అత్యంత కీలక సమావేశంలో అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. ఈ భేటీ జరుగుతుండగా మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అనుకోకుండా ఓవల్ ఆఫీసు లోపలికి వచ్చేశారు. దీంతో సిబ్బంది ఆయనకు బయటకు పంపించేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఆరంభంలో చోటుచేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది.



అమెరికా ఆరోతరం ఫైటర్ జెట్లు అయిన ఎఫ్-47 స్టెల్త్ యుద్ధ విమానాలపై కొన్ని నెలల క్రితం ట్రంప్ అత్యంత రహస్య సమావేశం నిర్వహించారు. ఓవల్ ఆఫీసులో జరిగిన ఈ భేటీలో మిలిటరీ ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ యుద్ధ విమానాల సామర్థ్యం గురించి మిలిటరీ అధికారులు అధ్యక్షుడికి వివరిస్తుండగా.. ఉన్నట్టుండి మెటా అధినేత జుకర్‌బర్గ్ ఆ సమావేశం గది లోపలికి వచ్చేశారు. ఆయనను చూసి సైనికాధికారులు షాక్ అయ్యారు.

ఎలాంటి సెక్యూరిటీ క్లియరెన్స్ లేకుండా జుకర్బర్గ్ ఆ సమావేశం లోపలికి వెళ్లినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. దీంతో అక్కడున్న భద్రతా సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా బయటకు వెళ్లమని చెప్పినట్లు పేర్కొన్నాయి. దీంతో ఆయన అధ్యక్షుడిని పలకరించి గది నుంచి బయటకు వచ్చేసినట్లు సదరు కథనాల సారాంశం.

అయితే, ఈ సంఘటనపై మిలిటరీ అధికారులు అసహనం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. దీన్ని భద్రతాలోపంగా వారు పేర్కొన్నట్లు సమాచారం.

కాగా.. ఈ వార్తలపై వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు స్పందించారు. జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని అన్నారు. ''ట్రంప్ అభ్యర్థన మేరకే జుకర్‌బర్గ్ లోపలికి వచ్చి అధ్యక్షుడికి హాయ్ చెప్పారు. ఆ తర్వాత బయటకు వెళ్లి ట్రంప్‌తో తన భేటీ ప్రారంభమయ్యే సమయం వరకు ఎదురుచూశారు. మిలిటరీ అధికారులతో సమావేశం పూర్తయిన తర్వాత వీరిద్దరూ భేటీ అయ్యారు'' అని సదరు అధికారి చెప్పడం గమనార్హం.

2021లో క్యాపిటల్ భవనంపై దాడి తర్వాత ట్రంప్ ఫేస్‌బుక్, ఇన్‌స్టా ఖాతాలపై మెటా నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీంతో వీరిద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే, గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌తో జుకర్‌బర్గ్ స్నేహబంధం మళ్లీ మొదలైంది. అధ్యక్షుడి 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అజెండాకు మద్దతు పలికిన మెటా అధినేత.. 1 మిలియన్ డాలర్ల విరాళం ప్రకటించారు. ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి కూడా ఆయన హాజరయ్యారు.

# చికాగోలో కాల్పుల కలకలం.. నలుగురు మృతి!

**చికాగో, జూలై 3 :** అమెరికాలోని షికాగోలో కాల్పులు కలకలం రేపాయి. ఓ గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా.. 14 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చికాగోలోని రివర్ నార్త్ పరిసరాల్లో ఉన్న ఓ రెస్టారెంట్ దగ్గర ఓ ఆల్బమ్ రిలీజ్ పార్టీ జరుగుతోంది. అదే సమయంలో అక్కడ లాంజ్‌లో ఉన్న వారిపై ఓ దుండగుడు కాల్పులు జరిపి పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తంగా 13 మంది మహిళలు, ఐదుగురు పురుషులపై కాల్పులు జరగ్గా.. వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. బాధితుల వయసు 21-32 మధ్య ఉందని.. వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించినట్లు పేర్కొన్నారు.

# అమెరికాలో పాక్ సైనికాధికారుల వరుస పర్యటనలు..!

**వాషింగ్టన్, జూలై 3 :** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ అలా అమెరికా వెళ్లి వచ్చాడో లేదో పాక్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్దు ఇప్పుడు అమెరికా వెళ్లాడు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అగ్రదేశంతో రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఈ వరుస పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ.. చైనా వ్యవస్థలు వాడుతోన్న పొరుగుదేశానికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ తరుణంలో వరుస అమెరికా పర్యటనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు తమ వద్ద ఉన్నాయని, భారత వైమానిక, క్షిపణి దాడులను అవి అడ్డుకుంటాయని కలలుగన్న పాకిస్థాన్‌కు ఇటీవల చుక్కెదురైన సంగతి తెలిసిందే. చైనా నుంచి సమీకరించిన హెచ్‌క్యూ-9, ఎల్‌వై-80 వ్యవస్థలు, వాటి రాడార్లు.. ఆపరేషన్ సిందూర్లో భాగంగా భారత్ ప్రయోగించిన ఒక్క క్షిపణినీ ఆపలేకపోయాయి. అవి విఫలం కావడమో సకాలంలో గుర్తించలేకపోవడమో జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో చైనా అందించిన ఆయుధ పరిజ్ఞానంపై ప్రధానంగా ఆధారపడుతున్న పాక్ సాధనసంపత్తి విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది. ఇక ఈ పర్యటనలో యూఎస్ మిలిటరీ, ఇతర నాయకులతో పాక్ ఎయిర్ మార్షల్ సమావేశమయ్యారు. చైనా పరికరాల విశ్వసనీయతపై ఆందోళనల నేపథ్యంలో యూఎస్ అధునాతన ఆయుధాలు, వ్యవస్థలతో పాకిస్థాన్ తన వైమానిక దళాన్ని ఆధునీకరించడంపై దృష్టి సారించిందని సమాచారం. ఊ-16 ఫైటర్ జెట్లు, గగనతల రక్షణ వ్యవస్థలు, ఎయిర్-టు-ఎయిర్ మిస్సైల్ ఎయిమ్-7 స్పారో వంటి వాటిని కొనుగోలు చేయాలని యోచిస్తోందని తెలుస్తోంది. గత దశాబ్ద కాలంగా చైనాతో పాక్ స్నేహంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల అమెరికా సైనిక ఉన్నతాధికారులు, రాజకీయ వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. ఈ పర్యటనలతో అమెరికా నుంచి రక్షణ కొనుగోళ్లను పెంచుకోవాలని చూస్తోంది. అమెరికాతో సైనిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో పాక్ తరపున ఐదు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మునీర్ ఇటీవల అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే.

# వారసుడి నిర్ణయం దలైలామా చేతుల్లోనే ఉంది

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

**ఢిల్లీ, జూలై 3 :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా చేసిన డిమాండ్‌ను భారత్ తోసిపుచ్చింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టంచేసింది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఈమేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉంది. దలైలామా స్థానం టిబెటన్లకు మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనది' అని రిజిజు పేర్కొన్నారు. దలైలామా 90వ పుట్టిన రోజు కార్యక్రమాలు బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సుగ్లాఖ్‌కాంగ్ ఆలయంలో ప్రారంభమయ్యాయి. దీనికి భారత్ తరఫున రిజిజు, జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు లల్లన్ సింగ్‌లు హాజరుకానున్నారు. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని బుధవారం దలైలామా సోషల్ మీడియాలో పోస్టు ద్వారా తెలిపారు. భవిష్యత్తు గురువును గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే చైనా దీనిపై స్పందించింది. తర్వాత దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని డిమాండ్ చేసింది. వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనా విధానాలను అనుసరించి నిర్వహించాలని పేర్కొంది. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి భారత్‌లోని ధర్మశాలలో దలైలామా ఆశ్రయం పొందుతున్నారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే దలైలామాను వారసుడిగా ఎంపిక చేయాలని బీజింగ్ ఎప్పటినుంచో ప్రయత్నిస్తుంది. చైనా ఎత్తుగడలను గమనించిన దలైలామా వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ తమదేనని తేల్చిచెప్పారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

- కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి
- కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను బిజెపి వీడాలి
- జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం కదం తొక్కాలి
- తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా సదస్సులో తమ్మినేని



**సూర్యాపేట, జూలై 03 (మనం ప్రతినిధి):** మూడవసారి అధికారంలోకి వచ్చిన మతత్వ బిజెపి నాయకత్వంలో ని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పోరేట్ అనుకూల, మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం ధ్వజమెత్తారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సంఘాల జిల్లా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోట్లను తీసుకొచ్చిందన్నారు. కార్మిక వర్గం అనేక పోరాటాల ఫలితంగా లేబర్ కోడ్ లు అమలుకు ఆలస్యం అయినా ప్రస్తుతం వాటిని అమలు చేసి కార్మిక వర్గం హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. 2025 26 బడ్జెట్ లో కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసి సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందన్నారు. సామాన్యులపై బారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడుదారులకు ఐదు వేల కోట్లు రాయితీ ప్రకటించింది అని గుర్తు చేశారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలు పట్టించుకోలేదనీ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కార్మిక వర్గం ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టం చేయాలన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయడంలో ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఢిల్లీలో రైతులు పోరాటం చేసిన సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నేటికీ అమలు చేయలేదనీ. కనీస మద్దతు ధర చట్టం అమలు చేయలేదని అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోజురోజుకు నిర్వీర్యం చేస్తుందని ద్వయబట్టారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర శాసన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ వ్యవసాయ కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదన్నారు. వలసల నివారణ కోసం వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న ఏడాదికి 12,000 నేటికీ అమలు కాలేదు అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్టపరిచి 16 రకాల నిత్యవసర వస్తువులను పేదలందరికీ సభలో డిమాండ్ చేశారు..ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ 11 సంవత్సరాల కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై ఆంక్షలు విధిస్తుంటే ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహిస్తున్నారని అన్నారు. ట్రంపు చర్యల మూలంగా భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ఆంక్షలు కు భారత్ తలొగటం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ జిల్లా సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా నాయకులు కో లిశెట్టి యాదగిరిరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టి పెల్లి సైదులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న, ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు జె నరసింహారావు, వీరబోయిన రవి, ఎల్గూరి గోవింద్, మడ్డి అంజిబాబు, మద్దెల జ్యోతి, శీలం శ్రీను, షేక్ జహంగీర్, ధనియాకుల శ్రీకాంత్, ఉప్పుల రమేష్ బోయిల్ల నవీన్ తో పాటు వివిధ మండలాల నుంచి కార్మిక వర్గం భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పెండింగ్‌లో ఉన్న 7200 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి
- పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చందర్ రావు, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి



**కోదాడ, జులై 03 (మనం న్యూస్):** ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చందర్ రావు, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి పాల్గొని మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వలన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వారి మేనిఫెస్టోలో విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థులకు అండదండగా ఉంటామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్న విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ గురించి కనీసం మాట్లాడే పరిస్థితి కూడా లేదని వారు అన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల గురించి చూసి చూడనట్లు వివరించడం మూలంగా విద్యార్థులు యువకులు కలిసి టిఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు నేడు అదే విధానాలు కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థి యువకులు కలిసి రేపు జరగబోయే స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. విద్యార్థులకు రావాల్సినటువంటి 7200 కోట్ల రూపాయలను విడుదల చేయకుండా అందాల పోటీలకు 200 కోట్లు ఖర్చు పెట్టడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని వారు ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామల్ల ఉదయ్, పులి రాఖి, జిల్లా నాయకులు డి వేణు, పిడిఎస్యు డివిజన్ నాయకులు గుండు ఉమేష్, బి యశ్వంత్, నూనె కళ్యాణ్, రాము, విద్యార్థినీ విద్యార్థులు రమ్య, శైలజ, స్పందన, సులోచన, సాహితీ, శ్రీదేవి, తదితర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి వేడుకల కరపత్రం ఆవిష్కరణ



**కోదాడ, జులై 03 (మనం న్యూస్):** మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామంలో గల సాయిబాబా దేవాలయంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని దేవాలయ చైర్మన్ నలపాటి నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురు పౌర్ణమి వేడుకలు దేవాలయంలో అంగరంగ వైభవంగా 9, 10 వ తేదీలు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు కాగడ హారతి, 5:30 నుండి 6:30 వరకు స్వామివారికి ఆవుపాలు, చందన అభిషేకం కార్యక్రమం. ఏడు గంటలకి అలంకార దర్శనం, 11 గంటలకు గురుపూజ కార్యక్రమం, 12 గంటలకు మధ్యాహ్నం హారతి, 12 గంటల 30 నిమిషాలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు సంధ్యా హారతి, ఏడు గంటలకి పల్లకి సేవ, ఎనిమిది గంటలకి శేష హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. దాతలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నర్రా వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, ఏదులాపురం శ్రీనివాసరావు, శరబయ్య, కోళ్లూరి రామారావు, శేషు, సుబ్బారావు, ప్రగడ వెంకటేశ్వరరావు, బట్టు కోటేశ్వరరావు, పూర్ణ, నారాయణరావు, ఈదర వెంకటేశ్వరరావు, శ్రీను, బాలయ్య, అర్చకులు సాయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి



**సూర్యాపేట, జూలై 03 (మనం ప్రతినిధి):** జిల్లాలో వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వనమహోత్సవం .ఎన్ఆర్ఈజీఎస్ పనులు, రీఛార్జ్ స్ట్రక్చర్స్ ,స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్, శానిటేషన్, పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు ఇచ్చిన 59.884 వేలు లక్ష్యాలను 18 శాఖలు సమన్వయంతో పనిచేసి ఇచ్చిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా డి ఆర్ డి ఓ కు 28,870 వెలు, మున్సిపల్ శాఖకు15,532 వేలు, అటవీ శాఖకు 4,320వేలు, వ్యవసాయ శాఖకు 3,831వేలు, ఇరిగేషన్, సిఎడి శాఖలకు 2,578 వెలు కిరా కేటాయించడమైనదని వీటికి స్థలాల ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు ఉపాధి హామీ పథకం కింద ఎస్టిమేట్ జనరేట్ చేసి డి ఆర్ డి ఓ మొక్కలను పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గుర్తించిన ప్రాంతాలలో ఫిట్టింగ్ ప్లాంటేషన్ చేసి టీజీఎఫ్ ఎంఎస్ సైట్లో అప్లోడ్ చేయాలన్నారు ఎంపీడీవోలు హరితవనాలు అటవీ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు, మండలాలలో మూడు విఐపి స్థలాలను సిద్ధం చేసుకుని ఉండాలని స్పష్టం చేశారు.అటవీ శాఖ సిబ్బంది సమన్వయంతో స్థలాలు ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు నర్సరీల నుండి మొక్కలను గుర్తించిన ప్రాంతాల లో ఏ ప్రాంతానికి కేటాయించబడినవో మ్యాచింగ్ బ్యాటింగ్ ప్రక్రియ చేయాలని తెలిపారు రెవెన్యూ ప్లాంటేషన్లు మూడు అడుగుల పైన మొక్కలు నాటాలని అన్నారు.. పాఠశాలలు మరియు వెల్ఫేర్ హాస్టల్లో మునగ కరివేపాకు ఉసిరి మారేడు వెలగ మొక్కలు నాటాలని ప్రతి ఒక్కరు అమ్మ పేరు మీద మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.పల్లె ప్రకృతి వనాలలో ఉన్న గ్యాప్ లలో మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ఎక్సైజ్ శాఖ వారు 94 వేల మొక్కలు లక్ష్యం కాగా వీటి కొరకు 88 ఎకరాల సొసైటీ భూములను గుర్తించడం జరిగిందని, వీటిలో ఈత తాటి మొక్కలు నాటాలని, అన్ని శాఖల అధికారులు తమకు ఇచ్చిన లక్ష్యాలను సెప్టెంబర్ కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కార్యక్రమం వాటర్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ స్వచ్ఛభారత్ గ్రామీణ కార్యక్రమ ప్రగతిపై మండలాల వారిగా సమీక్షించారు స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 20 25 కార్యక్రమంలో సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. గ్రామలలో రహదారులు పరిశుభ్రత గా ఉంచాలని ,సీజనల్ వ్యాధుల పట్ల చర్యలు తీసు కోవాలన్నారు. జాతీయ పంచాయతీ అవార్డులకు సంబంధించి తొమ్మిది థీమ్స్ గురించి వివరించడం జరిగింది, పంచాయతీ ఇండెక్స్ డిఎల్పిఓ నారాయణరెడ్డి పి పి టి ద్వారా వివరించారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం నాయక్ తెలంగాణ డి ఈ ఈ టి ప్లాట్ఫారం పరిశ్రమ సహకారం ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ ఆఫర్లను పొందటంలో సహాయపడుతుంది, డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ద్వారా అభ్యర్థులకు ఉద్యోగాలను సులభతరం చేసింది యువత ఉపాధి అవకాశాలు పొందటంలో సహాయపడుతుందని కావున మండల అధికారులు మండల సమావేశాలలో దీని గురించి తెలపాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ వీవి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిప్యూటీ సీఈఓ శిరీష, డిపిఓ యాదయ్య ,డిఎల్పిఓ నారాయణరెడ్డి, సంబంధిత శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గృహాలకు అద్దె చెల్లించాలంటూ ఎన్ఎస్పీ అధికారుల హల్ చల్

## నాడు అభయం.... నేడు భయం...
## క్రమబద్ధీకరణ పేరుతో మోసం

**నాగార్జునసాగర్, జూలై 3 (మనం న్యూస్):** రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన సొంత గృహాలకు అద్దె చెల్లించాలంటూ ఎన్ఎస్ పి అధి కారులు గృహ యజమానులకు గురువారం నోటీసులు ఇస్తూ హల్ చల్ చేశారు. వివరాల్లోకి వెళితే గత ప్రభుత్వం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోఉన్న హిల్ కాలని,పైలాన్ కాలనీలోని ప్రభుత్వ గృహాలలో దశాబ్దాలు గా నివాసం ఉంటున్న నివాసితులకు 59 జీవో ద్వారా తమ సొంత ఇంటి కల సాకారం అయ్యిందనే ఆశలు అడియాశలు అయ్యేలా సాగర్ బి అండ్ ఆర్ అధికారుల ప్రవర్తన తీరు అద్దం పడుతుంది.గతప్రభుత్వం 59 జీవో కు సంభందించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ గృహాలలో ఎవరైతే 14 సంవత్సరాలపైబడి



నివాసం ఉంటున్నారో వారికి తమ సొంత ఇంటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో 59జీవో ద్వారా అర్హులైన438 మంది లబ్ధిదారులలో 258 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి రిజిస్ట్రేషన్డాక్యుమెంట్హక్కు పత్రాలు అందివ్వడంజరిగింది మిగిలిన 180 మందికి కొన్ని సాంకేతిక కారణాలవలన అది కార్య.రూపం దాల్చలేదు. అంతలోనే ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన లబ్ధిదారులకు సంభందించిన నిర్వహణ ప్రక్రియ కాస్త అటకకెక్కి కూర్చుంది.అయితే కొద్ది రోజులు గా ఎన్ఎస్పి అధికారులు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ఉన్నగృహ యజమానులకు బకాయిలు చెల్లించాలంటూ గురువారం బలవంతంగా నోటీసులుఇస్తూ ఉండటం చర్చనీయాంశమైంది అర్హులైన నివాసితులు గత ప్రభుత్వ హయాంలోమార్కెట్ రేటు ప్రకారం ప్రభుత్వానికిగజాల లెక్కన లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్హక్కు పత్రాలు తీసుకుంటేఇప్పుడు అందుకు భిన్నంగా పరిస్థితి మారి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యి హక్కు పత్రాలు తీసుకున్న గృహాలు అద్దె బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం విడ్డురంగా ఉందని అన్ని సక్రమంగా ఉంటేనే కదా రిజిస్ట్రేషన్ చేసేది అద్దె బకాయిలు ఉంటే రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు వచ్చిన తర్వాత పురపాలక సంఘ పన్ను చెల్లిస్తారు కానీ ప్రభుత్వ అద్దె ఎలా చెల్లిస్తారని స్థానికులు నిలదీస్తున్నారు.ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘ నాయకులు కలగజేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని గృహ యజమానులు కోరుతున్నారు.

# ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలను పెంచాలి



- డిఐఈఓ భాను నాయక్

**ఆత్మకూర్ ఎస్, జూలై 3(మనం న్యూస్):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లను పెంచి వాటిని బతికించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి భాను నాయక్ అన్నారు. గురువారం మండల పరిదీలోని నెమ్మికల్ ప్రభుత్వ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది కన్నా ఈ ఏడాది 30% అడ్మిషన్లను పెంచే బాధ్యత అధ్యాపకులు తీసుకోవాలని సూచించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లోని పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను జూనియర్ కళాశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్, లైబ్రరీ, రీడింగ్ రూమ్స్, తరగతి గదులు, ఫర్నిచర్, ఉచిత పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామన్నారు. సూర్యాపేట జిల్లాలో 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని వాటిల్లో ప్రవేశాల శాతం పెంచేందుకే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.నెమ్మికల్ కళాశాలలో ఇప్పటివరకు 127 అడ్మిషన్లు జరిగాయని ఇంకా పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులు తీసుకోవాలని కోరారు. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ప్రతి కళాశాలను ఒకసారి సందర్శించి అధ్యాపకులకు చూచనలు చేశానన్నారు. జిల్లాలో గతంలో 2200 అడ్మిషన్లు ఉన్నాయని ఈ ఏడాది 3500 కు పెంచే బాధ్యత తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ గుణగంటి వెంకటేశ్వర్లు అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్రంలో పోలీస్ శాఖ మాత్రమే పనిచేస్తున్నది

- చండూరులో జరుగుతున్న పనులన్నీ బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చినవే
- ప్రజలు అంటున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సమీక్షాలా... ? బిక్షాలా...? అని...
- ఇందిరమ్మ ఇండ్ల విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం
- మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి



**చండూరు, జూలై 3 (మనం న్యూస్):** కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ఒక్క రూపాయి అభివృద్ధి జరగలేదు. కానీ, వందలాది కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ మాత్రమే పని చేస్తుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పై మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. నల్లగొండ జిల్లా చండూరులో గురువారం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న వారి నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించన వారిపై అనేక అక్రమ కేసులు పెడుతుంది. చండూరు మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న యొక్క నిర్మాణంలో ఉన్న నూతన వాణిజ్య సముదాయ భవనం కూల్చి వేశారు. ఇలా కేసులు పెట్టి భయపెట్టి ఓట్లు వేయించుకుందాం అనుకుంటున్నారని మండిపడ్డారు. పనులు లేక బీఆర్ఎస్ చేసిన పనులకే కొత్తగా బోర్డులు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్యాబినెట్లో ఉన్నటువంటి రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొత్తగా తెచ్చి వేసిన రోడ్డు లేదు. వ్యవసాయరంగం పూర్తిగా నిర్లక్ష్యం అయిందన్నారు. తెలంగాణ వచ్చే నాటికి నల్లగొండ అఖరులో ఉంటే..కెసిఆర్ పాలనలో అగ్రస్థానం లో నిలిచిందని గుర్తు చేశారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చేశా. కానీ మళ్లీ కాంగ్రెస్ పాలనలో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా వస్తున్నాయని ఆరోపించారు. నిన్నటి రివ్యూ మీటింగ్ లో వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. ఇదేం సమీక్షా అని. మంత్రులు మాత్రమే మాట్లాడితే మేం ఎందుకు అని ఎమ్మెల్యేలు అనుకుంటున్నారన్నారు. కొంత మంది ప్రజా ప్రతినిధులు పోలీసల నుంచి మామూళ్లు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. ఉత్తమ్ నీటి పారుదల, సివిల్ సప్లై శాఖ లపై అవగాహన లేదు. కృష్ణా నదితో పాటు గోదావరి జాలలను సైతం ఆంధ్రకు అప్ప జెపుతున్నారు. సీఎం, మంత్రులు కెసిఆర్ను తిట్టడంలోనే పోటీ పడుతున్నారని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతున్నారు. ఇలాంటి కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సమస్యలపై ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కాంగ్రెస్ దుర్మార్గలకు చెక్ పెట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఇవ్వాళ చండూరులో జరుగుతున్న పనులన్నీ బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చినవే. మునుగోడు ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు మేము ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ మంజూరు చేసాము. మునుగోడులో ఇప్పుడు అక్కడక్కడా జరుగుతున్న పనులన్నీ కెసిఆర్ హయాంలోనివేనని స్పష్టం చేశారు. కమీషన్స్ కోసం బిల్లులు ఆపడం కాంగ్రెస్ నేతలకే చెల్లిందన్నారు.మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు పాల్వాయి స్రవంతి, రెగట్టే మల్లికార్జున రెడ్డి, మాజీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, బి ఆర్ఎస్ పార్టీ మండల పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- వసతుల సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మేడారంలో చేపట్టే పనులను శాశ్వతంగా నిలిచేలా ఉండాలి
- పక్క ప్రణాళిక తో ముందుకు వెళ్ళాలి
- కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్ నివేదిక సమర్పించాలి
- రాష్ట్ర ఎండోమెంట్స్ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్



**ములుగు, జులై 3 (మనం ప్రతినిధి):** రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతర సందర్భంగా చేపడుతున్న పనులు శ్వాశతంగా నిలిచేలా పనులను పూర్తి చేయాలని, ప్రతి జాతరకు వందల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతున్నమని తెలంగాణ ఎండోమెంట్ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు. గురువారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారం ఐటీడీఏ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్స్ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అడ్వైజర్ గోవిందహరి లతో కలిసి శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర, 2026 పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మేడారం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా సౌకర్యాల ఏర్పాటు కొరకు స్టూడియో వన్ ఆర్కిటెక్టర్ రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై క్షేత్ర స్థాయిలో పరిశీలన, పూజారులు, అధికారులతో చర్చించుటకు సమావేశ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మేడారం వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనుల మాస్టర్ ప్లాన్ నివేదికను కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పక్క ప్రణాళిక తో రూపొందించాలని అన్నారు. కోటిన్నర భక్తులు హాజరయ్యే ఈ నాలుగు రోజుల జాతరకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చెయ్యాలని అన్నారు. ప్రతి జాతరకు కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నమని, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అంతుముందు జంపన్న వాగు, చిలుకలగుట్ట, కన్నెపల్లి లోని సారలమ్మ దేవాలయం ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎండోమెంట్ అడ్వైజర్ గోవిందా హరి తో కలిసి మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకోగా సమ్మక్క సారలమ్మ పూజారులు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికి గద్దెలపైకి తోడుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, ఏ పి ఓ వసంత రావు, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, పూజారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూతనందించిన పరుపాటి



**రాయపర్తి, జూలై 3 (మనం న్యూస్):** రాయపర్తి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు ఐత రవి తల్లి ఐత ఎల్లమ్మ గురువారం ఉదయం ఇంట్లో జరిపడి కాలుకు గాయమై హన్మకొండ గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సందర్భంగా, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ (బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు) పొరపాటు శ్రీనివాస్ రెడ్డి హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి, డాక్టర్ కాలిప్రసాద్ తో మాట్లాడి మేరుగైన వైద్యం చేయాలి అని కోరి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 10,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునవత్ నర్సింహా నాయక్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు కర్ర రవీందర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రామ్ చందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్, మండల పార్టీ ముఖ్య నాయకులు పోగులకొండ వేణు, ఎండీ యూసఫ్, సంకినేని ఎల్లస్వామి, చిలువేరు సాయి గౌడ్, ఉబ్బని సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



**పర్వతగిరి, జూలై 3 (మనం న్యూస్):** రానున్న స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని మండల ఇంచార్జి జోరిక రమేష్, సొసైటీ చైర్మన్ మనోజ్ కుమార్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు అన్నారు. మండలంలో మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు కొంకపాక, చౌటపల్లి, అన్నారం, మాల్యా తండా ఎంపిటిసి పరిధిలో మూడేత్తుల తండా, హ్యాట్య తండా , రావూరు, దుపతండా, పెద్ద తండా, ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు మండలం లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాలలో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సుమారు రెండు సంవత్సరాలైనా ఎలాంటి అభివృద్ధి చేయలేదని గ్రామాల్లో బి ఆర్ ఎస్,కేసీఆర్ చేసిన అభివృద్ధి మాత్రమే కనబడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ముఖ్యమంత్రి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నాడు,పరిపాలన చేతగాక ప్రతిపక్షల పై చౌకబార్ మాటలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పరువు తీస్తున్నాడు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇస్తా నన్న మహిళా భృతి 2,500 ఎందుకు ఇవ్వలేదు...? నాలుగు వేల వృద్ధాప్య పెన్షన్ ఎందుకు ఇవ్వలేదు...?ఇస్తానన్న మూడువేల నిరుద్యోగుల భృతి ఇవ్వలేదని, ప్రతి ఆడబిడ్డకు ఎలక్ట్రిక్ స్కూటీ, కల్యాణ లక్ష్మి లో తులం బంగారం హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ బిఆర్ఎస్ పార్టీ మాజీ సీఎం కెసిఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, మీ గ్రామాలలో ప్రజలకు చెప్పి బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లూనావత్ పంతులు ఎన్నికల ఇంచార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ లు, మాజీ సర్పంచులు, ముఖ్య కార్యకర్తలు, కరిమిళ్ల మోహన్ రావు, గోపగాని రాజు, వర్కల రమేష్, రాజశేఖర్, దేవీలాల్, మట్టపెల్లి వంశీ, చిన్న మాధవరావు, తిరుపతి, కిషన్, కిషోర్, రవి, భూక్యా రవి, మూడు రవి, అన్నమయ్య, దశరత్, షబ్బీర్, యాకయ్య, మదన్ మోహన్, గణేష్, నరేష్, లక్ష్మినారాయణ, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోనాపురంలో ఘనంగా భీరన్న భోనాలు



**చెన్నారావుపేట, జులై 3 (మనం న్యూస్):** చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామంలో బీరన్న బోనాల ఉత్సవం గురువారం కన్నులపండువగా జరిగింది. ఆశడమాసం ఆరంభం కావడంతో తమ ఇలవేల్పు బీరన్నకు తొలిబోనంను కురుమ కులస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. డోలు వాయిద్యాల మధ్య బోనం ఎత్తుకొని భారీగా మహిళలు తరలివచ్చారు. బీరన్నదేవుడికి ఇష్టమైన వంటలతో తయారుచేసిన బోనంను తీసుకొని డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య వినూత్న నృత్యాలతో బీరన్న గుడికి తరలి వెళ్లారు. ముక్కులు చెల్లించుకున్నారు. పిల్ల పాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు కోరె ప్రభాకర్, పోతరాజు వీరస్వామి, యూత్ అధ్యక్షుడు ఈర నవీన్, ఉపాధ్యక్షుడు పోతరాజు రాజు, సురేష్, హరీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యాసన నైపుణ్యాలు, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, జూలై 3 (మనం ప్రతినిధి):** విద్యార్థులలో అభ్యసన నైపుణ్యాలు, పర్యావరణం పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లాలోని గూడూరు మండలంలో మండల ప్రజా పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, బ్రాహ్మణపల్లి, (లక్ష్మీపురం), మండల ప్రజా పరిషత్ స్కూల్ కొమ్ముగూడెం లలోని పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వండుతున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్శనలో విద్యార్థుల హాజరు, అభ్యాసన సామర్థ్యాలు, తరగతి గదుల్లో బోధనా పరిస్థితులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థుల పఠనాభివృద్ధికి పాఠశాలల్లో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ అభినందించారు. కొమ్ముగూడెం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా కలెక్టర్ ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దడం జరుగుతుందని, అనేక సౌకర్యాలు కల్పిస్తూ అత్యుత్తమ సాంకేతిక విద్య బోధనలు అందించడం కోసం విద్యాశాఖను బలోపేతం చేస్తుందని అన్నారు, 'పిల్లల అభ్యాసన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలన్నారు. ఉత్తమ పాఠశాలలుగా మారాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అని ప్రభుత్వ విద్యా సంస్థలలో తమ పిల్లలను చేర్పించాలని ఆయన గ్రామస్తులను కోరారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు ,అదనపు తరగతి గదునుల నిర్మాణం వేగంగా చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు అం దిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ప్రభుత్వా సూచించిన మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ అప్పారావు, డీఈవో డా. రవీందర్ రెడ్డి ,ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ

**పరకాల, జూలై 3 మనం న్యూస్:** పన్నులు చెల్లించేందుకు పట్టణ పరిధిలో ఉన్న వ్యాపారస్తులు లైసెన్స్ పొందే విషయంలో ఇంటి పన్ను చెల్లించే విషయంలో ఆన్లైన్లోనే చెల్లించాలని మున్సిపల్ అధికారుల నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ రావు అని సైబర్ నేరగాళ్ల నుండి వచ్చే ఫోన్ కాల్స్ నుండి పరకాల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సుష్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారస్తులు వర్తక సంఘాలు ట్రేడ్ లైసెన్స్ పొందే విషయంలో ఆన్లైన్లోనే రుసుము చెల్లించి లైసెన్స్ పొందాలని అదేవిధంగా ఇంటి యజమానులు ఇంటి పన్ను చెల్లించే విషయంలో ఆన్లైన్లోనే రుసుము చెల్లించి రసీదు పొందాలని మున్సిపల్ కార్యాలయం నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ రావు అని సైబర్ నేరగాళ్ల నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన పోలీసు వారిని సంప్రదించాలి అని పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని కమిషనర్ తెలియజేశారు.

## రమేష్ మరణానికి కారణమైన కాంగ్రెస్ పార్టీ నాయకులను కఠినంగా శిక్షించాలి

- ములుగు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ములుగు, జూలై 3 (మనం ప్రతినిధి):** ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నిజమైన అర్హులైన పేదలకు ఇవ్వాలని సోషల్ మీడియాలో ప్రశ్నించిన సోదరుడు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్కా రమేష్ ని కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు సమాచారం అందించి వారి ద్వారా అతనిని బెదిరించి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న తర్వాత తదుపరి మా నాయకుడు వచ్చాక నీ సంగతి చెప్తామని బెదిరించడంతో మనస్థాపానికి భయానికి గురి అయిన చుక్కా రమేష్ ఈరోజు ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు చల్వాయి గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది ఇది ముమ్మాటికి ప్రభుత్వం చేసిన హత్య అర్హులకు పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక దాడులు చేయడం ఆత్మహత్య చేసుకునే విధంగా మానసికంగా భయభ్రాంతులకు గురిచేయడం ములుగులో ములుగు జిల్లాలు పరిపాటిగా మారిందని అన్నార ఇప్పటికైనా ప్రశ్నిస్తున్న వారిపై ఇలా భౌతికదాడులు వారిని బెదిరించి మానసికంగా ఇబ్బంది పెట్టి చంపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ కఠినమైన చర్యలు తీసుకోవాలని దీనికి పూర్తి బాధ్యత గౌరవ జిల్లా మంత్రి సీతక్క బాధ్యత వహిస్తూ పార్టీ నాయకులను పార్టీ నుండి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారుప్రధాన ప్రతిపక్షంగా ఎవరైతే ప్రాణాలను కోల్పోయిన దాడులకు గురి అవుతున్న వారికి అండగా బిఆర్ఎస్ అండగా ఉంటుందని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను దయచేసి యువకులు మరియు ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వాళ్లు చేసిన అన్యాలను ప్రశ్నించండి కానీ ఇలా ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఏదైనా ఉంటే బ్రతికి ఉండి సాధించుకోవాలని కోరుతున్నట్లు తెలిపారునిందితులను వెంటనే అరెస్టు చేసి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని ఆ కుటుంబానికి తీరని లోటు దయచేసి జిల్లా కలెక్టర్ గారు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు పోలీస్ శాఖ వారు రమేష్ యొక్క కాల్ డాటా ను మరియు వాట్సాప్ చాటింగ్ అలాగే సాయంత్రం పూట వచ్చిన వారిని గుర్తించి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి నిందితులు ఎంతటి వారైనా ఏ స్థాయిలో ఉన్న శిక్షించాలని అలాగే వాళ్ళ వెనక ఉండి నడిపిస్తున్న నాయకులపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ బాబు డిమాండ్ చేయడం జరిగింది.

## దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాపర్తి రాజు

**రఘునాథపల్లి, జూలై 3 (మనం న్యూస్):** లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న నిర్వహించే సమ్మెను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయంతో చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాపర్తి రాజు పిలుపునిచ్చారు.సిపిఎం మండల కమిటీ మంచాల మల్లేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చెయ్యాలని దేశవ్యాప్తంగా జులై 9న కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్ని వర్గాల ప్రజలు రైతులు కూలీలు గ్రామపంచాయతీ కార్మికులు అమాలి కార్మికులు, అంగన్వాడి, ఆశ, ట్రాన్స్పోర్ట్ రంగం అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బుక్య చందు నాయక్,మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, మండల కమిటీ సభ్యులు పొదల నాగరాజు,మైలారం వెంకటేశ్వర్లు, ఇంజ వెంకట్ స్వామి, నామాల యాదగిరి, పొదల లవ కుమార్, పొదల దేవేందర్ తదితరుల పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు,ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**లింగాలఘణపురం, జూలై 3(మనంన్యూస్):** మండలకేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు,బండ్లగూడెం గ్రామంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం పరిశీలించారు,మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో వర్షపు నీరు ఇంకిపోయేలా నూతనముగా ఏర్పాటు చేస్తున్న ఏడు ఇంకుడు గుంతలను స్వయంగా పరిశీలించారు,అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి ఫోటో అప్ లోడ్ చేసి, పేమెంట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలని హౌసింగ్ ఏఈ ఆదేశించారు, అలాగే మండలంలోని బండ్లగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల వద్దకు వెళ్లి లబ్దిదారులతో స్వయంగా మాట్లాడారు.బేస్ మెంట్ వరకు జరిగిన పనికి ఎంత ఖర్చు జరిగినది అని తెలుసుకోవడము జరిగినది, లబ్దిదారికి మహిళ సంఘం నుండి వచ్చిన డబ్బులతో ప్రస్తుతము ఇంటి నిర్మాణము చేసుకోవడము జరుగుచున్నది అని, ఈ సోమవారము పూర్తైన మొదటి దశ డబ్బులు అకౌంట్ జమ జరుగును అని తెలిపారు. సిమెంట్, ఇసుక, మట్టి, కంకర మెటిరియాల్ కొనుగోలులో ఏమైనా ఎక్కువ డబ్బులు చేల్లిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. మేస్త్రి, కూలీలు ప్రభుత్వం తెలిపిన విధముగా మాత్రమే డబ్బులు తీసుకోవాలని, ఎవరైనా డబ్బులు ఎక్కువ డిమాండ్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడము జరుగును అని తెలిపారు, ప్రతి సోమవారము ప్రభుత్వము లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయడము జరుగుచున్నదని, త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని లబ్దిదారులకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ జి.జలంధర్ రెడ్డి,తహసిల్దార్ పి.రవీందర్, మండల పంచాయితీ అధికారి ఎన్.రఘు రామ కృష్ణ , ఏఈ(హౌసింగ్) దివ్య,పంచాయితీ కార్యదర్శిలు ,జి.ప్రవీణ్ కుమార్ ఎన్.సంతోషిమాత, పాల్గొన్నారు.

## వర్ష విపత్తును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధం

- ప్రజల అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలి
- జిల్లా వ్యాప్తంగా పునరాసా కేంద్రాలు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు, జులై 3(మనం ప్రతినిధి):** జులై, ఆగస్టు మాసాలలో జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జిల్లా ప్రజల అప్రమత్తంగా ఉంటూ అధికారులు సూచనలు సలహాలను పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో 61గ్రామాలు వర్షముక్కు గురి అయ్యే అవకాశం ఉందని, 970 శితలవస్థ లో ఉన్న ఇండ్ల కుటుంబాల యజమానులను అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు భారీ వర్షాల సందర్భంగా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రమాద స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 800 చెరువులు ఉండగా 13 చెరువుల పెద్దవి ఉన్నాయని, నీటి ప్రాణంతో నిండా చెరువులను ముందస్తుగా గమనించడం జరుగుతుందని వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో లోతట్టు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో ఉండే పరిస్థితి ఉండడంతో వారికి సరిపడా నిత్యవసర సరుకులను ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచుతున్నామని, అధికారులు మొదటి హెచ్చరిక చేయగానే ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి 24 గంటల పాటు అధికారులు విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశామని, ప్రమాద పరిస్థితిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు రిస్క్ జాకెట్లను పంపిణీ చేయడంతో పాటు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచి నాలుగు బోట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పర్యటించే పర్యాటకులు నీటి ప్రవాహాలలో దిగవద్దని, దట్టమైన అడవి ప్రాంతాలకు వెళ్ళవద్దని అన్నారు. వర్షపు విపత్తుని ఎదుర్కోవడానికి పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, వైద్యశాఖ, విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామని, లోతట్టు ప్రాంతాల లోని గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్య అధికారులకు తెలిపారు. 58 పునరావాస కేంద్రాలలో 15 వేల మంది ఉండే విధంగా ఏర్పాటు చేశామని, ప్రస్తుత వర్షాకాలంన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఈ పాత్రికేయుల సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం. డి. రఫిక్, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



## భారత్‌కు రానున్న పాకిస్తాన్ జట్టు..!

ఇటీవల జరిగిన తీవ్ర పరిణామాల (పహల్గాం ఉగ్రదాడి, బదులుగా భారత్ ఆపరేషన్ సిందూర్) తర్వాత భారత్, పాక్ ల మధ్య అన్ని విషయాల్లో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. క్రీడలకు సంబంధించి కూడా ఇదే పరిస్థితి. పాక్ తో ఏ క్రీడలో అయినా తలపడేందుకు భారత్ నిరాసక్తత వ్యక్తం చేస్తుంది. అయితే తాజాగా జరుగుతున్న ఓ ప్రచారం భారత క్రీడాభిమానులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆసియా కప్, జూనియర్ వరల్ కప్ టోర్నీల్లో పాల్గొనేందుకు పాకిస్తాన్ హాకీ జట్లు భారత్ కు రానున్నాయట. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పాక్ హాకీ జట్లకు అనుమతి కూడా జారీ చేసినట్లు తెలుస్తుంది.

వచ్చే నెల (అగస్ట్) 27 నుంచి సెప్టెంబర్ 7 వరకు బీహార్లోని రాజ్ గిర్ లో ఆసియా కప్ జరుగనుంది. ఈ టోర్నీ కోసం 31 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టుకు భారత్ కు రానున్నట్లు సమాచారం. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఓ కీలక అధికారి ప్రముఖ క్రీడా వెబ్



సైట్ స్పోర్ట్స్టార్ కు చెప్పాడు. జూనియర్ హాకీ వరల్డ్ కప్ నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు చెన్నై, మధురై నగరాల్లో జరుగనుంది. ఈ టోర్నీలో పాల్గొనేందుకు కూడా పాకిస్తాన్ కు అనుమతి లభించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే, భారత్, పాకిస్తాన్ త్వరలో క్రికెట్ ఆసియా కప్లో కూడా తలపడాల్సి ఉంది. అయితే, ఈ విషయంపై బీసీసీఐ ఇప్పటివరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖను సంప్రదించలేదు. ఈ టోర్నీపై ఎలాంటి అధికారిక సమాచారమూ లేదు. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది క్రికెట్ ఆసియా కప్ సెప్టెంబర్ 5 నుంచి 21వ తేదీ వరకు యూఏఈలో జరగాల్సి ఉంది. ఈ టోర్నీ టీ20 ఫార్మాట్ లో జరుగనుంది. భారత్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో టోర్నీ నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి.



# గిల్ డబుల్ సెంచరీ

## చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భారీ డబుల్ సెంచరీ చేసి, చెలరేగి ఆడుతూ 269 పరుగుల వద్ద పెవిలియన్ పట్టాడు. రెండో రోజు లంచ్ తర్వాత గిల్ ఈ అరుదైన ఘనత సాధించాడు. గిల్ కు టెస్ట్ ల్లో ఇది తొలి డబుల్ సెంచరీ. ఈ మైలురాయిని గిల్ 311 బంతుల్లో చేరుకున్నాడు. ఈ డబుల్ తో గిల్ పలు రికార్డులు సొంతం చేసుకున్నాడు.

- ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ ల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత కెప్టెన్‌గా..
- సేనా దేశాల్లో (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆసియా కెప్టెన్‌గా..
- ఇంగ్లండ్ లో డబుల్ సెంచరీ సాధించిన మూడో భారత ఆటగాడిగా..
- ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక స్కోర్ చేసిన భారత ఆటగాడిగా..
- టెస్ట్ ల్లో డబుల్ సెంచరీ సాధించిన ఆరో భారత కెప్టెన్‌గా..
- విదేశాల్లో డబుల్ సెంచరీ సాధించిన రెండో భారత కెప్టెన్‌గా..
- సేనా దేశాల్లో 250 పరుగుల మార్కు తాకిన తొలి భారత ఆటగాడిగా..
- టెస్ట్‌ల్లో అత్యధిక స్కోర్ చేసిన భారత కెప్టెన్ గా పలు రికార్డులు సాధించాడు.

## కుర్రాళ్లూ.. అదరగొట్టారు : గిల్ - యశస్వీపై సచిన్ ప్రశంసలు

ఇంగ్లాండ్ తో రెండో టెస్టులో కఠినమైన ఎడ్జ్ బాస్టన్ పిచ్ పై భారత కెప్టెన్ శుభ్ మన్ గిల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుతంగా ఆడారు. యశస్వి కాస్తలో సెంచరీని చేజార్చుకోగా.. గిల్ మాత్రం వరుసగా రెండో శతకం సాధించాడు. ఈక్రమంలో వీరిద్దరిపైనా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. బౌలింగ్ కు అనుకూలంగా ఉన్న మైదానంలో పట్టుదల ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన గిల్ ను యువరాజ్ సింగ్ అభినందించాడు.

''యశస్వి జైస్వాల్ తొలి బంతి నుంచే తన విధానం ఏంటో చెప్పాడు. పాజిటివ్, ఫియర్ లెస్, స్మార్ట్ అగ్రెసివ్ తో ఆడాడు. కొద్దిలో సెంచరీ మిస్ అయినా అతడి ఇన్నింగ్స్ మాత్రం సూపర్. ఇక కెప్టెన్ శుభ్ మన్ గిల్ కూల్ గా ఉంటూ ఒత్తిడిలోనూ ఏకాగ్రత కోల్పోకుండా అద్భుతమైన డిఫెన్స్ తో శతకం బాదాడు. కుర్రాళ్లూ.. క్లాసిక్ గేమ్ తో అదరగొట్టారు'' అని సచిన్ పోస్టు చేశాడు. ఎడ్జ్ బాస్టన్ లో సెంచరీలు చేసిన భారత బ్యాటర్ల జాబితాలోకి గిల్ చేరాడు. ఇంతకుముందు సచిన్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా శతకాలు చేశారు. విరాట్ (147) అత్యధిక పరుగులు చేసిన టీమ్ఇండియా బ్యాటర్ గా కొనసాగుతున్నాడు. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించాడు.



## ఊహలకందని విధ్వంసం..

### 78 బంతుల్లో 28 సిక్సర్ల సాయంతో 263 పరుగులు



అమెరికాలో జరిగిన ఓ క్లబ్ క్రికెట్ మ్యాచ్ లో ఊహలకందని విధ్వంసం జరిగింది. ఎడిసన్ క్రికెట్ క్లబ్ కు ప్రాతినిధ్యం వహించే ఓ ఆటగాడు 78 బంతుల్లో 17 ఫోర్లు, 28 సిక్సర్ల సాయంతో 337.18 స్ట్రయిక్ రేట్ తో 263 పరుగులు (నాటౌట్) చేశాడు. క్రికెట్ చరిత్రలో బహూశా ఇంతటి విధ్వంసం ఎప్పుడూ జరిగి ఉండకపోవచ్చు. ఈ మ్యాచ్ కు అధికారిక గుర్తింపు ఉందో లేదో తెలియదు కానీ.. సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్త హల్ చల్ చేస్తుంది. ఇంతటి విధ్వంసానికి కారకుడు ఎవరని తెలుసుకునేందుకు నెటిజన్లు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

## 'రామాయణ' గ్లింప్స్..

### ఇండియన్ సినిమా నుంచి కొత్త చరిత్ర కాబోయేలా



మన దేశపు చరిత్రలో మహాకావ్యం రామాయణం కోసం ఎన్ని సినిమాలు తీసిన ఎన్ని తరాలలో తీసిన కూడా అదే రీతి ఆదరణ అందుకుంటుంది. ఇలా ఆల్రెడీ ఈ మధ్యనే ఆదిపురుష్ అనే సినిమా వచ్చినప్పటికీ మళ్ళీ రామాయణం నేపథ్యంలోనే అనౌన్స్ చేసిన నితీష్ తివారి రామాయణ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ సినిమా నుంచి అంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న టైటిల్ గ్లింప్స ని మేకర్స్ విడుదల చేసారు. అయితే ఈ గ్లింప్స మాత్రం ఒక ఎపిక్ లా ఉందని చెప్పడంలో సందేహమే లేదు. కేవలం బిగ్ స్క్రీన్ పై మాత్రమే చూడగలిగే కొత్త ఎక్స్ పీరియన్స్ ని మేకర్స్ అయితే ఈ గ్లింప్స తో ప్రామిస్ చేస్తున్నారు. బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీర్ కపూర్ రామునిగా, సాయి పల్లవి సీతగా కన్నడ రాకింగ్ స్టార్ యష్ రావణ పాత్రలో అలాగే హనుమాన్ పాత్రలో సన్నీ డియోల్ లని అనౌన్స్ చేయగా ఇందులో రణబీర్, యష్ లపై చూపించిన విజువల్స్ అయితే మైండ్ బ్లాకింగ్ గా ఉన్నాయని చెప్పాలి. ఇంకా హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ అలాగే ఏ ఆర్ రెహ్మాన్ లు ఇచ్చిన స్కోర్ గాని పూర్తిగా ఇంటర్నేషనల్ లెవెల్ స్టాండరడ్స్ ని చూపిస్తున్నాయి. ఇక ఫైనల్ గా రామునిగా రణబీర్ ని రావణునిగా యష్ ని చూపించిన ఆ కొన్ని చిన్న ఫ్రేమ్స కూడా థియేటర్స్ లో ముఖ్యంగా మన ఇండియన్ సినిమా నుంచి ప్రపంచ సినిమాకి ఒక కొత్త చరిత్రకి నాంది పలికేలా సూచిస్తున్నాయి. మొత్తానికి మాత్రం ఈ స్పెషల్ ప్రాజెక్ట్ పై ఈ గ్లింప్స తో అంచనాలు మరింత లెవెల్లోకి పెరిగిపోయాయి. మరి బిగ్ స్క్రీన్స్ పై ఈ సినిమా ఎలా ఉంటుందో తెలియాలి అంటే మొదటి భాగం కోసం వచ్చే ఏడాది దీపావళి వరకు ఆగక తప్పదు. ఇక ఈ సినిమాని భారీ బడ్జెట్ తో నమిత్ మల్హోత్రా నిర్మాణం వహిస్తున్నారు.

## రాముడు వచ్చేశాడు... ఇక హనుమాన్ కూడా వచ్చేస్తున్నాడు..!



ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రాల హవా భాషతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ క్రమంలోనే బాలీవుడ్ లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ హిస్టారికల్ ఎపిక్ చిత్రం 'రామాయణ' ఫస్ట్ గ్లింప్స్ ను మేకర్స్ నేడు రిలీజ్ చేశారు. పాన్ ఇండియా స్టార్స్ ఈ సినిమాలో నటిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఇక ఈ అంచనాలు అందుకునేలా ఫస్ట్ గ్లింప్స్ కూడా ఉండటంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. 'రామాయణ'తో రాముడు రావణాసురుడు మధ్య జరిగే యుద్ధాన్ని మనకు చూపెట్టేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. అయితే, నేడు రాముడు ప్రేక్షకులకు అదిరిపోయే ట్రీట్ అందించడంతో, ఇప్పుడు హనుమాన్ కూడా ఇదే బాటలో వచ్చేందుకు సిద్ధమయ్యాడట. టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న ప్రెస్టీజియస్ సీక్వెల్ చిత్రం 'జై హనుమాన్'. కన్నడ స్టార్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ లో నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ జరుపుకుంటోంది. అయితే, ఈ సినిమా నుంచి కూడా ఓ సాలిడ్ అప్డేట్ ఈ నెలలో రానున్నట్లు తెలుస్తోంది. 'జై హనుమాన్' కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ చిత్రం నుంచి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయినట్లు తెలుస్తోంది. జూలై 7న రిషబ్ శెట్టి పుట్టినరోజు కానుకగా 'జై హనుమాన్' నుంచి ఓ ట్రీట్ రానుందనే వార్త సినీ సర్కిల్స్ లో వినిపిస్తోంది. దీంతో ప్రేక్షకులు ఈ అప్డేట్ ఏమై ఉంటుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## 'హరిహర వీరమల్లు' ట్రైలర్ పై మెగాస్టార్ రివ్యూ..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లేటెస్ట్ మూవీ 'హరిహర వీరమల్లు' నుంచి థియేట్రికల్ ట్రైలర్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ తో ఒక్కసారిగా వీరమల్లు చిత్రం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయింది. పవన్ అభిమానులు సైతం ఊహించని లెవెల్ లో ఈ చిత్ర ట్రైలర్ కట్ అదిరిపోయింది. దీంతో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సాలిడ్ ఇంపాక్ట్ చూపెడుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.

అయితే, ఈ హరిహర వీరమల్లు ట్రైలర్ పై మెగాస్టార్ చిరంజీవి తాజాగా స్పందించారు. ఇలాంటి పవర్ ఫుల్ ట్రైలర్ కట్ చూసి చాలా రోజులు అయిందని ఆయన కామెంట్ చేశారు. దాదాపు రెండేళ్ల తర్వాత పవన్ కళ్యాణ్ వెండితెరపై ఫైర్ పుట్టించాడు అంటూ చిరు కామెంట్ చేశారు. ఈ సినిమాను అందరితో పాటు తాను కూడా ఎప్పుడెప్పుడు బిగ్ స్క్రీన్ పై వీక్షిస్తానా.. అని ఆశగా ఎదురుచూస్తున్నట్లు చిరు తన సోషల్ మీడియా అకౌంట్ లో పోస్ట్ చేశాడు.

ఇక పవర్ స్టార్ వీరమల్లు ట్రైలర్ కు మెగాస్టార్ ఫిదా కావడంతో, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ట్రైలర్ తోరే ఇంత అగ్గి రాజేసిన పవన్ కళ్యాణ్ ఇక సినిమా రిలీజ్ తర్వాత బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. క్రిష్, జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, బాబీ డియోల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను జూలై 24న గ్రాండ్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు.

## దీపికా పదుకొణెకు అరుదైన గౌరవం..



భాషతో సంబంధం లేకుండా అలరిస్తుంటారు నటి దీపికా పదుకొణె. తాజాగా ఆమెకు అంతర్జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికయ్యారు. ఈమేరకు హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయ నటి దీపిక కావడం విశేషం. హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తాజాగా వెల్లడించిన జాబితాలో డెమి మూర్, రాచెల్ మెక్ ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ వంటి హాలీవుడ్ తారలతో పాటు దీపిక పేరు కూడా ఉండడంతో అభిమానులు ఆనందిస్తున్నారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026కు 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ తెలిపింది. వినోదరంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గాను వీరిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది. నటనతోనే కాకుండా తన స్పీచ్ లతోనూ దీపికా పదుకొణె ఆకట్టుకుంటుంటారు. 2018లో టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్ ఫ్లూయెన్షియల్ పీపుల్' (ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు) జాబితాలోనూ ఆమె చోటు దక్కించుకున్నారు. అలాగే 2022లో ఫుట్ బాల్ ప్రపంచకప్ ను ఆవిష్కరించి ప్రపంచాన్ని ఆకర్షించారు. 2023లో జరిగిన ఆస్కార్ ప్రదానోత్సవంలో దీపిక 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని నాటునాటుని ఆడియన్స్ కు పరిచయం చేశారు. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రం నుంచి 'నాటు నాటు' ఇదే..' అంటూ ఈ పాటను పరిచయం చేయడంతో వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది. 2006లో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన దీపిక 2017లో 'ట్రిబుల్ ఎక్స్: ది రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' తో హాలీవుడ్ తెరపై మెరిశారు. ప్రస్తుతం అల్లు అర్జున్.. దర్శకుడు అట్లీ కలయికలో రానున్న బహుభాషా చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శక్తిమంతమైన యోధురాలిగా యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. దీని తర్వాత 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ లోనూ నటించనున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.